www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 185

ఆదివారం | 20-10-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 6.47, చవితి తె. 4.16 వరకు; నక్షత్రం: కృత్తిక ఉ. 8.31 తదుపరి రోహిణి; వర్జ్యం: రా. 11.23-12.52; దుర్ముహూర్తం: సా. 4.13-5.00; అమృతఘడియలు: ఉ. 6.20-7.47, తె. 3.51-5.20; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 5.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజధానికి పునఃప్రతిష్ఠ





శ్రీకారం..

రాజధాని అమరావతి నిర్మాణ పనులను శనివారం తిరిగి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రవణ్ తదితరులు

అమరావతికి ఇక మంచి రోజులు.. మూడేళ్లలో తీర్చిదిద్దుతాం

రాష్ట్రం కోసం రైతులు భూములిచ్చి త్యాగం చేస్తే.. గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టింది. ఎంత మంది రాక్షసులు వచ్చినా అమరావతిని కాపాడిన చరిత్ర రైతులదే. రాణీ రుద్రమదేవిలా రాజధాని ప్రాంత మహిళలు పోరాడారు. నేను కూడా వారి కోసం జోలిపట్టి పోరాటానికి మద్దతు పలికాను.

- సీఎం చంద్రబాబు

- జెట్ స్పీడ్‌లో నిర్మాణ పనులు పూర్తి చేస్తాం
- రాక్షసుల నుంచి అమరావతిని రైతులే కాపాడారు
- మహిళలు రుద్రమ దేవిలా పోరాడారు
- జోలిపట్టి వారి పోరాటానికి మద్దతు తెలిపాను
- భూతం పోయి రాష్ట్రానికి మంచి రోజులొచ్చాయి
- విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం
- రెండు వారాల్లో పోలవరం పనులు ప్రారంభం
- రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధానికి తిరిగి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నామని, మరో మూడేళ్లలో అమరావతిని సుందరవనంగా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అమరావతిలో నిర్మాణ పనులు జెట్ స్పీడ్‌లో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ హయాంలో అమరావతిలో అటకెక్కిన నిర్మాణ పనులను ముఖ్యమంత్రి శనివారం లాంఛనంగా పునఃప్రారంభించారు. రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయ భవనం వద్ద పూజలు చేశారు. ఏడు అంతస్తులతో... రూ.160 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు

మిగతా 13వ పేజీలో...

నిధులొస్తున్నాయ్!

ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రాజధానికి రూ.13,600 కోట్ల అప్పు

- డిసెంబరులో 10% అడ్వాన్స్‌గా ఇవ్వనున్న ఆర్థిక సంస్థలు
- జనవరి నెలాఖరు నాటికి మొదటి విడత రుణం విడుదల
- మరో రూ.1400 కోట్లు భరించనున్న కేంద్ర ప్రభుత్వం
- కాలపరిమితి, మారటోరియం వ్యవధిపై త్వరలోనే స్పష్టత

13



రాజధానిలో నిర్మాణంలో ఉన్న సీఆర్‌డీఏ కార్యాలయం

రెండు నెలల్లో మునిసిపల్ శాఖలన్నీ

సీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లోకి

- అక్కడ పనులన్నీ పూర్తికాగానే తరలింపు
- మంత్రి నారాయణ విజ్ఞప్తిపై నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయనున్న కాంట్రాక్టు సంస్థ
- జనవరిలో ఎమ్మెల్యే, ఐఏఎస్ భవనాలకు, డిసెంబరులో రోడ్ల నిర్మాణానికి టెండర్లు

తీతువు పిట్టల్లా లొల్లి!



అబద్ధాలు చెప్పి ఉంటే అధికారంలోకి వచ్చి ఉండేవాడినని జగన్ చెప్పుకోవడంతో వైసీపీ నాయకులు ఆశ్చర్యపోయారు. 'నువ్వు అబద్ధమాడితే బాగుండు అని ఎవరైనా చెబితే... లేదు, ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే. కానీ, అబద్ధం మాత్రం చెప్పలేను' అని చెప్పడమే పెద్ద అబద్ధం కదా?

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమకూర్చుకున్న ఆస్తులలో తన కుమార్తె షర్మిలకు కూడా సమాన వాటా ఉండాలని, తన భార్య విజయలక్ష్మికి వాటా అవసరం లేదని ఆడిటర్లకు ఆయన సూచించడం వాస్తవమో కాదో జగన్ రెడ్డి స్పష్టం చేయాలి. వాస్తవమే అయితే ఆస్తుల్లో షర్మిలకు వాటా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారో చెప్పాలి కదా!

చంద్రబాబు ప్రభుత్వం జగన్ రెడ్డి అడుగుజాడల్లో నడవడం లేదు. అయినా అధికారంలో ఉన్నప్పుడు తానేం చేశానో, ఎంత అరాచకంగా ప్రవర్తించానో గుర్తు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారా అన్నట్టుగా జగన్ రెడ్డి వ్యాఖ్యలు ఉంటున్నాయి.

తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం.

జగన్ రెడ్డి రోత మీడియాపై పోలీసులు ఒక కేసు పెట్టినందుకే ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ అంటూ పెడబొబ్బలు పెడుతున్నారే? నిన్నటిదాకా మీరు చేసిందేమిటి? రఘురామకృష్ణరాజుతోపాటు నాపైనా, మా సహచరులపైనా దేశద్రోహం కేసు పెట్టిన విషయం మరిచారా? 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై సీఐడీ అధికారులు ఎన్నో కేసులు పెట్టారు కదా! ఐదేళ్ల పాటు శాసనసభ కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఏబీఎన్‌పై నిషేధం విధించడాన్ని మరచిపోతే ఎలా?

చంద్రబాబుకు జగన్ పూనితే పరిస్థితి ఏమిటో మీకే తెలుస్తుంది. అలా జరగడం లేదు కనుకే స్వేచ్ఛగా ప్రవచనాలు చెప్పుకోగలుగుతున్నారు. సొంత పార్టీ కార్యకర్తల నుంచి ఎంత ఒత్తిడి వస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంయమనం కోల్పోవడం లేదు. అనాగరికంగా ఆలోచించే వారే అయితే బూతులకు పేటెంట్ తీసుకున్న కొడాలి నాని వంటి వారికి పోలీస్ ట్రీట్మెంట్ చేయించడం ఎంత సేపు?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో

సాములోరికి సాయమా?

తెర వెనుక ఎవరు?

సీఎం ఆదేశించినా విడుదలకాని ఉత్తర్వులు

- భూ కేటాయింపు రద్దు ఫైలు మళ్లీ పెండింగ్
- దోబూచులాడుతున్న కీలక అధికారి
- ఫైలును నీరుగార్చేందుకు ప్రయత్నం
- అందుకు రెవెన్యూశాఖ ససేమిరా
- దీంతో ఆదేశాలివ్వడంలో కావాలనే జాప్యం
- శారదాపీఠానికి కోర్టుకు వెళ్లే అవకాశం ఇవ్వాలనేదీ జాప్యానికి మరో కారణం!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖ శారదాపీఠానికి తక్షణమే భూ కేటాయింపులను రద్దుచేయాలని, ఇందుకు ఫైలు పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ఫైలు పంపింది. అయితే, రెండున్నర నెలలు ఆ ఫైలును పెండింగ్ పెట్టి వెనక్కి పంపారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చాక ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. తాను ఆదేశించిన ఫైలును ఆపడం ఏమిటి? వెంటనే తిరిగి ఫైలు తెప్పించుకోండి అని సీఎం ఆదేశించారు. ఫైలు వచ్చింది. కానీ సేమ్ సీన్. మళ్లీ పెండింగ్ దీని వెనక సాములోరి శక్తులు బలంగా పనిచేస్తున్నాయా? లేక ముఖ్యమంత్రి ఆదేశాలను

మిగతా 13వ పేజీలో...



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో శనివారం జనసేనలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి, పక్కన మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ పార్టీ నేతలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య

లంచం మాటే వినపడొద్దు

- పాలనలో మార్పులే నా ఆకాంక్ష
- సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా పనిచేద్దాం
- ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగించాలి: డిప్యూటీ సీఎం పవన్
- జనసేనలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి
- గుంటూరు, జగ్గయ్యపేట నుంచి భారీగా చేరికలు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో లంచం అనే మాట వినపడకూడదని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. పాలనలో మార్పు తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి అనేది రాష్ట్రానికి మూలమని, కీలకమైన

మిగతా 13వ పేజీలో...

బీమాపై జీఎస్టీ మినహాయింపు!



- టర్మ్ పాలసీలపై అందరికీ పూర్తిగా..
- ఆరోగ్య బీమాపై సీనియర్ సిటిజన్లకూ
- మిగతావారికి 5 లక్షల్లోపు కవరేజీ వరకు
- 20 లీటర్లు, ఆపై ప్యాకేజ్డ్ తాగునీరు, 10 వేలలోపు సైకిళ్లపై 5%కి తగ్గింపు
- ఖరీదైన బూట్లు, వాచీలపై 28 శాతం
- మంత్రుల సంఘం కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 19: జీవిత, ఆరోగ్య బీమాల ప్రీమియంపై వస్తు, సేవా పన్ను (జీఎస్టీ) విషయంలో మంత్రుల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జీవిత బీమా (టర్మ్) పాలసీలు, సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని మినహాయించాలని ప్రతిపాదించింది. సీనియర్ సిటిజన్లు మినహా మిగతావారికి రూ.5 లక్షల్లోపు కవరేజీ

మిగతా 2వ పేజీలో...



2

విమానాలకు బెదిరింపుల మోత

- ఒక్కరోజే 30కిపైగా సర్వీసులకు.. అన్నీ ఒట్టివే
- వారంలో 70కిపైగా విమానాలకు హెచ్చరికలు
- పండగ సీజన్‌లో సంస్థలకు రూ.కోట్లలో నష్టం
- కంపెనీల సీఈవోలతో బీసీఏఎస్ డీజీ సమావేశం
- రాజకీయ కోణంపై అనుమానాలు

రుషికొండ.. గుదిబండ!

ప్యాలెస్‌పై రాష్ట్ర ప్రభుత్వం తర్జన భర్జన.. గత ప్రభుత్వంలో 500 కోట్లతో నిర్మాణం



విశాఖపట్నం రుషికొండపై నిర్మించిన భవనాలు

గత ప్రభుత్వంలో రుషికొండపై రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించారు. ఒక వ్యక్తి (జగన్) బతకడానికి అంత డబ్బుతో ప్యాలెస్ అవసరమా? ఆ సొమ్ముతో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు పూర్తి చేసి పేద వర్గాలకు అందజేయవచ్చు. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రజలు సూచనలు ఇవ్వాలి.

- మంత్రి లోకేశ్



ప్యాలెస్ లోపలి హంగులు

- జగన్ కోసం ప్రజాధనం దుర్వినియోగం
- పర్యాటకం పేరుతో అడ్డగోలు పనులు
- 4.5 ఎకరాల్లో విలాసవంతంగా 5 బ్లాక్‌లు
- నేడు నిర్వహణే భారంగా మారిన వైనం
- 85 లక్షల వరకు విద్యుత్ బకాయిలు
- భవనాల వినియోగంపై అయోమయం
- ఎంబసీ కార్యాలయాలు, పారిశ్రామిక అవసరాలకు వాడాలని నిపుణుల సూచన
- గ్లోబల్ టెండర్లు పిలవాలనీ అభిప్రాయాలు
- ప్రజలు సూచనలు ఇవ్వాలన్న లోకేశ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తాను 30 ఏళ్లు అధికారంలో ఉంటానని కలలు కన్న నాటి ముఖ్యమంత్రి జగన్.. తన కుటుంబం కోసం విశాఖ రుషికొండపై రూ.500 కోట్లతో అత్యంత విలాసవంతమైన ప్యాలెస్‌ను నిర్మించుకున్నారు. చట్టాలను ధిక్కరించి, నిబంధనలు ఉల్లంఘించి మరీ ప్రజాధనం దుర్వినియోగం చేశారు. జగన్ చేసిన నిర్వాకానికి ఇప్పుడు ఈ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూటమి సర్కారుకు అంతుచిక్కడం లేదు. ఎలా ఉపయోగించుకోవాలో అర్థం కాక కిందా మీదా పడుతోంది. కొత్తగా నిర్మించిన ఐదు భవనాలు పర్యాటక అవసరాలకు ఉపయోగపడవు. కన్వెన్షన్ సెంటర్‌గా మార్చుకునే పరిస్థితి కూడా లేదు. అధికారుల సమావేశాలకు ఉపయోగించుకుందామన్నా చాలా భారమవుతుంది. ప్రస్తుతం ఈ భవనాల నిర్వహణే రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ భవనాలను వినియోగిస్తే కేవలం విద్యుత్ బిల్లులే నెలకు రూ.25 లక్షల వరకు వస్తాయి. ఇతర నిర్వహణ ఖర్చులూ ఉంటాయి. ఈ మొత్తాన్ని భరించగల

మిగతా 12వ పేజీలో...

దొంగ పోలీస్!



- అవినీతి పోలీసులపై ఉన్నతాధికారుల వేటు
- రాష్ట్రంలో వరుసగా సంఘటనలు వెలుగులోకి
- తూర్పుగోదావరిలో పేకాట సొమ్ము నొక్కేసిన సీఐ, ఎస్ఐ, మరో ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్
- రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడి పేరు మార్పు
- పాకాల ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై వేటు
- బాధితుల ఫిర్యాదుతో విచారణ, చర్యలు

2



పారిశ్రామిక వ్యర్థాలతో ఢిల్లీలోని కాలిందీ కుంజ్ వద్ద యమునా నదిలో నీళ్లపై విషపు నురగలు ఇలా దట్టంగా ఏర్పడ్డాయి.

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాకు ఎల్జీ ఆమోదం

శ్రీనగర్, అక్టోబరు 19: జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇవ్వాలని సీఎం ఒమర్ అబ్దుల్లా ఆధ్వర్యంలోని మంత్రిమండలి చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారు. తీర్మానాన్ని యథాతథంగా ఆమోదించినట్లు ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు శనివారం మీడియాకు చెప్పారు. లెఫ్టినెట్ గవర్నర్ ఆమోదం తెలపడంతో జమ్మూకశ్మీర్‌కు కేంద్రపెద్దలు త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై త్వరలోనే సీఎం ఒమర్ అబ్దుల్లా.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు తెలిపారు. మరోవైపు ప్రొటెం స్పీకర్‌గా ముబారిక్ గుల్‌ను నియమిస్తూ ఎల్జీ నిర్ణయం తీసుకున్నారు.

రండి.. మళ్లీ చేరండి!

- రిటైర్డ్ ఉద్యోగులకు రైల్వేశాఖ బిగ్ ఆఫర్

న్యూఢిల్లీ, అక్టోబరు 19: రిటైర్డ్ ఉద్యోగులకు రైల్వే బోర్డు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వనుంది. రైల్వేలలో సిబ్బంది కొరత పెద్ద సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల ఖాళీల భర్తీకి రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించింది. 65 ఏళ్ల లోపు వయసు గల రైల్వే రిటైర్డ్ ఉద్యోగులను సూపర్‌వైజర్లు, ట్రాక్‌మెన్‌లుగా తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోనుంది. తమ సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతం ఇవ్వడంతో పాటు ట్రావెల్ అలవెన్స్‌లు, అధికారిక టూర్లు వంటి ప్రయోజనాలు ఉంటాయి. పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది.

నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాభివృద్ధి

- రూ.500 కోట్లతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్
- సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ వెల్లడి

మహారాణిపేట(విశాఖ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రూపొందించిన నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రం దేశంలో మూడోస్థానంలో నిలుస్తుందని ఏపీ సీఐఐ చైర్మన్ వి.మురళీకృష్ణ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల పురోగతికి సంబంధించి సీఎం ప్రకటించిన ఆరు విధాన నిర్ణయాలను సీఐఐ స్వాగతిస్తోందని తెలిపారు. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.30లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా 20 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఈ పాలసీల ద్వారా పరిశ్రమల స్థాపన వేగవంతమవుతుందని పేర్కొన్నారు. సుమారు రూ.500 కోట్లతో రాష్ట్రంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, వివిధ విద్యాసంస్థలతో అనుసంధానం చేసి సాంకేతికంగా శిక్షణ అందించనున్నట్టు వివరించారు. నవంబరు 13న సీఐఐ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించబోయే సదస్సుకు కేంద్ర మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సీఐఐ ప్రతినిధులు సాంబశివరావు, గుంటూరు శివకుమార్, డి.తిరుపతిరాజు, కేవీవీ రాజు పాల్గొన్నారు.

30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

- వారం రోజుల్లో 70కిపైగా విమానాలకు
- కంపెనీల సీఈఓలతో బీసీఏఎస్ డీజీ భేటీ
- పండగ సీజన్‌లో రూ.కోట్లలో నష్టం

న్యూఢిల్లీ, అక్టోబరు 19: విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. శనివారం ఒక్కరోజే ఏకంగా 30కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. అయితే, అవన్నీ కూడా ఒట్టివేనని తనిఖీల్లో తేలింది. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, విస్తారా, స్పైస్ జెట్, స్టార్ ఎయిర్, అలయెన్స్ ఎయిర్ సంస్థలకు చెందిన విమానాలకు తాజాగా బెదిరింపులు వచ్చాయి. వీటిలో దేశీయ సర్వీసులతో పాటు అంతర్జాతీయ సర్వీసులు కూడా ఉన్నాయి. విస్తారాకు చెందిన 'ఉదయ్‌పూర్-ముంబయి' విమానం మరుగుదొడ్డిలో.. విమానంలో బాంబు పెట్టినట్లుగా ఓ బెదిరింపు లేఖ కూడా లభ్యమైంది. వారం రోజుల్లో ఇప్పటి వరకూ కనీసం 70 విమానాలకు ఈ రకంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. లండన్, అమెరికా, జర్మనీ, కెనడా తదితర దేశాల నుంచి ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఇవి వస్తున్నట్లు ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌ల ద్వారా అధికారులు గుర్తించారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో, దేశీయ విమానయాన సంస్థల సీఈఓలతో 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ' (బీసీఏఎస్) డైరెక్టర్ జనరల్ జుల్ఫికర్ హసన్ శనివారం సమావేశమయ్యారు. నకిలీ బెదిరింపుల నివారణకు అవసరమైన చర్యల గురించి చర్చించారు. అనంతరం హసన్ ఒక ప్రకటన జారీ చేస్తూ.. 'భారత గగనతలం పూర్తిగా సురక్షితంగా ఉంది. ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవటానికి పటిష్ఠమైన నిబంధనలు అమలులో ఉన్నాయి. ఎటువంటి భయాందోళన లేకుండా విమానయానం చేయవచ్చని ప్రయాణికులకు హామీ ఇస్తున్నాం' అని పేర్కొన్నారు. బీసీఏఎస్‌తోపాటు, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) త్వరలో నూతన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బెదిరింపు ఘటనలకు సంబంధించి ముంబై, ఢిల్లీల్లో డజనుకుపైగా కేసులు నమోదయ్యాయి. బుధవారం 17 ఏళ్ల బాలుడిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. 4 విమానాలకు అతడు బెదిరింపులు పంపినట్లు వెల్లడైంది. తన స్నేహితులతో గొడవల నేపథ్యంలో వారిని ఇరికించటానికి ఈ పని చేసినట్లు విచారణలో ఆ బాలుడు వెల్లడించాడు.




రూ.కోట్లలో నష్టం

నకిలీ బాంబు బెదిరింపుల వల్ల విమానయాన సంస్థలకు తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతోంది. విమానాలను మార్గ మధ్యంలోనే దింపివేయటం, ప్రయాణికులకు వసతి ఏర్పాట్లు చేయటం, వేరే విమానాల్లో వారిని గమ్యస్థానానికి పంపించటం, ఇంధనం వృథా మొదలైన వాటితో.. ఒక్కో బాంబు బెదిరింపు ఘటనలో కంపెనీపైన సగటున రూ.3 కోట్ల భారం పడుతున్నట్లు సమాచారం. ఈ నెల 14న ఎయిర్‌ఇండియా బోయింగ్ 777 విమానం ముంబై నుంచి న్యూయార్క్‌కు బయల్దేరింది. 16 గంటలపాటు ప్రయాణించాల్సిన విమానం.. బాంబు బెదిరింపుతో రెండు గంటల్లోనే ఢిల్లీలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. అలాగే, ఎయిర్ ఇండియాకే చెందిన ఢిల్లీ-షికాగో విమానానికి కూడా ఈ నెల 15వ తేదీన బాంబు బెదిరింపు రావటంతో విమానాన్ని కెనడాలోని ఓ నగరంలో దింపివేశారు. ఎంతో డిమాండ్ ఉండే పండగ సీజన్‌లో ఈ విధమైన బాంబు బెదిరింపులతో విమానయాన సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

రాజకీయ కోణం?

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో.. విమానాలకు బెదిరింపులు మొదలుకావటం, అవి రోజురోజుకూ పెరిగిపోవటంతో.. వీటి వెనుక ఏమైనా రాజకీయ కుట్ర దాగి ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా.. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉత్తరాదిన వందలాది స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతిని పలువురు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో పలు దశల పోలింగులో, పోలింగ్‌కు సరిగ్గా 2-3 రోజుల ముందు స్కూళ్లలో బాంబు పెట్టినట్లుగా బెదిరింపులు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇప్పటి విమానాల బాంబు బెదిరింపుల్లాగే నాడు స్కూళ్లకు వచ్చిన బెదిరింపులన్నీ ఒట్టివేనని తేలింది. పిల్లలు, తల్లిదండ్రులు మాత్రం ఆందోళనకు గురయ్యారు.

లోకం తీరు



నెతన్యాహు నివాసంపై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి

టెల్ అవీవ్, గాజా, బీరుట్, అక్టోబరు 19: సెంట్రల్ ఇజ్రాయెల్ సిజేరియా నగరంలోని నెతన్యాహు ప్రైవేట్ నివాసంపై హెజ్‌బొల్లా శనివారం డ్రోన్ దాడి జరిపింది. దాడి సమయంలో ఇంట్లో నెతన్యాహు, ఆయన సతీమణి సారా లేరని, ఎవ్వరికీ గాయాలు కాలేదని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. లెబనాన్ నుంచి 70 కిలోమీటర్ల దూరంలోని సిజేరియాలో ఉన్న నెతన్యాహు ప్రైవేట్ నివాసంపై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి జరపడాన్ని భద్రతా వైఫల్యంగా భావించిన ఇజ్రాయెల్ ఆర్మీ దీనిపై దర్యాప్తునకు ఆదేశించింది. హెజ్‌బొల్లా మూడు డ్రోన్లు ప్రయోగించగా తాము రెండింటిని కూల్చివేశామని ప్రకటించింది. డ్రోన్ దాడిపై నెతన్యాహు స్పందించారు. తమనెవరూ నిలువరించలేరని, యుద్ధంలో విజయం సాధించి తీరతామని అన్నారు. ఈ డ్రోన్ దాడిలో ఇరాన్ ప్రమేయముందని ఓ ప్రభుత్వ అధికారి ధ్రువీకరించారంటూ ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఛానెల్ 12 తెలిపింది. మరోవైపు, గాజాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 50 మంది చనిపోయారు.

ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్



న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) నూతన చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్ రహాట్కర్ నియమితులయ్యారు. ఆమెతో పాటు కమిషన్ సభ్యురాలిగా అర్చనా మజుందార్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పదవీకాలం మూడు సంవత్సరాలు. విజయ కిశోర్ గతంలో 2016 నుంచి 2021 వరకు మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

బీమాపై జీఎస్టీ మినహాయింపు!

(మొదటి పేజీ తరువాయి)

ఉండే ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని తీసేయాలని సిఫారసు చేసింది. కవరేజీ రూ.5 లక్షలు దాటిన పాలసీలకు చెల్లించే ప్రీమియంపై 18 శాతం జీఎస్టీని కొనసాగించాలని సూచించింది. టర్మ్ పాలసీలపై అందరికీ జీఎస్టీ ఎత్తివేయాలని ప్రతిపాదించింది. వీటిపైనా ప్రస్తుతం 18% జీఎస్టీ వసూలు చేస్తున్నారు. తాజా సిఫారసులపై త్వరలో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. బీమా ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలన్న డిమాండ్లు వస్తున్న తరుణంలో గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది. ఈ అంశంపై చర్చించేందుకు మంత్రుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. 20 లీటర్లు, అంతకుమించి ప్యాకేజ్ తాగునీటిపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి, నోటు పుస్తకాలు, రూ.10వేల కంటే తక్కువ ధర సైకిళ్లపై 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని ఈ మంత్రుల సంఘం ప్రతిపాదించింది.

భారత దౌత్యవేత్తలపై నిఘా!

- కెనడా విదేశాంగ మంత్రి మెలానీ వెల్లడి



టొరంటో, అక్టోబరు 19: కెనడాలోని మిగిలిన భారత దౌత్యవేత్తలపై గట్టి నిఘా ఉంచామని ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ తెలిపారు. "వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిన, కెనడా పౌరుల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ప్రయత్నించిన ఏ ఒక్క దౌత్య వేత్తను మా ప్రభుత్వం ఉపేక్షించదు" అని శుక్రవారం తెలిపారు. సోమవారం భారత ప్రభుత్వం కెనడాకు చెందిన ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించిన దరిమిలా.. కెనడా కూడా తమ దేశంలోని ఆరుగురు భారత దౌత్యవేత్తలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జోలీ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌ను రష్యాతో పోల్చారు. భారత దౌత్యవేత్తలకు కెనడాలో జరిగిన హత్యలు, హత్యా బెదిరింపులతో సంబంధాలు ఉన్నాయని తమ జాతీయ పోలీసు దళం గుర్తించినట్టు సంచలన ఆరోపణలు చేశారు. "కెనడా గడ్డపై ఇలాంటి అంతర్జాతీయ అణిచివేతలను చూస్తూ ఊరుకోం. ఇలాంటి ఘటనలు ఐరోపాలో చూశాం. జర్మనీ, బ్రిటన్‌లలో రష్యా ఇలాంటి దురాగతాలకు పాల్పడింది" అని జోలీ అన్నారు.

భారత జర్నలిస్టులపై కూడా

భారత జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపైనా కెనడా ప్రభుత్వం డేగ కన్ను సారించింది. వారి ప్రతి కదలికను నిశితంగా పరిశీలిస్తోంది. నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని ట్రూడో చేసిన వ్యాఖ్యల అనంతరం.. అంతర్జాతీయ సమాచార మార్పిడిలో అవకతవకలు, జర్నలిస్టుల వైఖరికి సంబంధించి కెనడా ర్యాపిడ్ రెస్పాన్స్ మెకానిజం(ఆర్‌ఆర్‌ఎం) సెప్టెంబరు 26న ఓ నివేదిక రూపొందించింది. ఈ నివేదికలో.. "గోడి మీడియా... ప్రధాని ట్రూడో సహా కెనడా సంస్థలను ఉగ్రవాదానికి దోహదపడే సంస్థలుగా పేర్కొంది" అని ఆర్‌ఆర్‌ఎం వెల్లడించింది.

ఆ హత్యతో సంబంధం లేదు

- అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవి నన్ను ఇరికించారు
- మరియమ్మ హత్య కేసు విచారణలో మాజీ ఎంపీ నందిగం సురేశ్ వెల్లడి



గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని వెలగపూడి దళిత కాలనీలో జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ వెల్లడించారు. మరియమ్మ హత్య కేసులో నందిగం నిందితునిగా ఉన్నారు. 2020, డిసెంబరు 27న దళిత కాలనీలో ఒకే సామాజిక వర్గంలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. నాటి బాపట్ల ఎంపీ నందిగం వర్గీయులు కూడా ఈ ఘర్షణలో ఉన్నారు. వీరు చేసిన దాడిలో మరియమ్మ మృతి చెందారు. మృతురాలి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న నందిగం సురేశ్‌ను రెండు రోజుల కస్టడీకి తీసుకున్న పోలీసులు.. శనివారం వైద్య పరీక్షలు అనంతరం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం సాయంత్రం 3 గంటల నుంచి న్యాయవాది సమక్షంలో తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు విచారించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఈ హత్యలో తన ప్రమేయం లేదని, హతురాలి కుమారుడు, వారి కుటుంబ సభ్యులు కూడా తన ప్రమేయం లేదని చెప్పారని నందిగం తెలిపారు. "నిందితుల్లో మీ బంధువులు గానీ, అనుచరులు గానీ ఉన్నారా" అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎవరూ లేరని సురేశ్ సమాధానం చెప్పారు. "హత్య జరిగిన రోజు నిందితులతో మీరు ఫోన్లో మాట్లాడారా" అని ప్రశ్నించగా తాను ఎవరితో మాట్లాడలేదని, తనకు కూడా ఎవరూ ఫోన్ చేయలేదని చెప్పుకొచ్చారు. ఈ కేసులో తనను అప్పటి తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఇరికించారని చెప్పారు. ఆ తర్వాత రోజు అప్పటి హోం మంత్రి సుచరితతో కలిసి తాను మరియమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చానని చెప్పారు. మరియమ్మ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించే క్రమంలో వారు మీ ప్రోద్బలంతోనే జరిగిందని ఆరోపిస్తూ గొడవ చేశారని తెలిపారు. ఆదివారం కూడా సురేశ్‌ను విచారించనున్నారు.

వచ్చేవారం మరో తుఫాన్?

- వాతావరణ శాఖ ప్రకటన

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్య అండమాన్ సముద్రం పరిసరాల్లో శనివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఈనెల 21 లేదా 22వ తేదీన తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి తరువాత పశ్చిమ వాయవ్యంగా పయనించి 23వ తేదీకల్లా వాయుగుండంగా బలపడనున్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో ఈనెల 21 నుంచి మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు. కాగా ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో శనివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా ముక్కామలలో 74.5 మిల్లీ మీటర్లు, కొండేపూడివారిపేటలో 68 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 24వ తేదీ నుంచి రెండు రోజులపాటు ఉత్తరకోస్తాలో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది.

దొంగ పోలీస్!

- అవినీతి పోలీసులపై ఉన్నతాధికారుల వేటు
- రాష్ట్రంలో వరుసగా సంఘటనలు వెలుగులోకి
- తూర్పుగోదావరిలో పేకాట సొమ్ము నొక్కేసిన సీఐ, ఎస్ఐ, మరో ఇద్దరు సిబ్బంది
- దోపిడీ సొమ్ము, బంగారం రికవరీలో నొక్కుడు
- ఎర్ర చందనం స్మగ్లర్ ఒంటిపై బంగారం స్వాహా
- లంచం ఇస్తే అమ్మాయిని వేధించినా వదిలేస్తారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



దొంగతనం కేసులో రికవరీ చేసిన డబ్బు, బంగారంలో నొక్కుడు... పేకాట రాయుళ్లు, ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడితే వాటా... పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం చేయాలంటే లంచం... నగ్న వీడియోలు తీసి యువతిని వేధించినవారికి, రోడ్డు ప్రమాద సంఘటన నిందితులకు వత్తాసు... రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో పోలీసుల తీరు ఇదీ. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టి, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వారే దారి తప్పుతున్నారు. రాష్ట్రంలో వరుసగా వెలుగులోకి వస్తున్న ఇలాంటి సంఘటనలతో పోలీసు శాఖకు చెడ్డపేరు వస్తోంది. బాధితుల ఫిర్యాదుతో ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తరచూ ఎక్కడో ఒకచోట అవినీతి పోలీసులపై చర్యలు తీసుకోవడం సర్వ సాధారణం అవుతోంది. గత ఐదేళ్లు పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కంటే వైసీపీ నేతల సేవలోనే ఎక్కువగా తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థను గాడిన పెడుతూ ప్రజల పక్షాన పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. పాత పద్ధతిని విడనాడాలంటూ పోలీసు ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయి సిబ్బందిని హెచ్చరిస్తున్నా మార్పు రావట్లేదు.

యువతిని వేధించినా...

తన నగ్న వీడియోలు తీసి వేధిస్తున్నారంటూ ఒక యువతి ఇటీవల తెనాలి పోలీసులకు తన గోడు వెళ్లబోసుకుంది. బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు విచారణ చేసి ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక్కరిని మాత్రమే అరెస్టు చూపించి మిగతా ఇద్దరినీ వదిలేశారు. ఆ ఇద్దరూ బయటికి వచ్చి మళ్లీ వేధించడంతో బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఇద్దరు నిందితుల నుంచి తెనాలి సీఐ సుధాకర్ లంచం తీసుకుని వదిలేసినట్లు విచారణలో తేలింది. వెంటనే గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెనాలి సీఐపై సస్పెన్షన్ వేటు వేశారు.

[redacted]ల్లా నిడదవోలు సర్కిల్‌లోని పెరవలి పోలీసు స్టేషన్ పరిధిలో అన్నవరప్పాడు వద్ద ఇటీవల కొందరు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని 6.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయితే రిమాండ్‌కు పంపినప్పుడు 55 వేలు మాత్రమే చూపించడంతో పట్టుబడ్డ వ్యక్తులు అవాక్కయ్యారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత నొక్కేసిన తమ డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గట్టిగా అడిగారు. దీంతో పోలీసులు లక్షన్నర వెనక్కి ఇచ్చేశారు. అయితే మొత్తం ఇవ్వాలని జూదరులు అడిగారు. పోలీసులు ఇవ్వకపోవడంతో జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపించిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్.. నిడదవోలు సీఐ శ్రీనివాసరావు, పెరవలి ఎస్ఐ అప్పారావుతో పాటు రైటర్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

[redacted]పాతిక లక్షల దొంగతనానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగను అదుపులోకి తీసుకుని మొత్తం సొమ్ము రికవరీ చేశారు. అయితే అందులో ఆరున్నర లక్షలు నొక్కేసి 18.52 లక్షలు మాత్రమే రికవరీ చేసినట్టు చూపించారు. ఇది అన్యాయమంటూ బాధితుడు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఏఎస్ఐ రుద్రరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగబాబు, కానిస్టేబుళ్లు అరుణ్ కుమార్, శివ రామకృష్ణ, సృజన్ కుమార్‌పై జిల్లా ఎస్పీ వేటు వేశారు.

సొంతానికి దొంగ బంగారం

గుంటూరులో పేరు గాంచిన ఓ బంగారం షాపులో ఆడిటింగ్ చేసినప్పుడు బంగారం పోయినట్లు షాపు యాజమాని గుర్తించారు. షాపులోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజీని పరిశీలించగా, షాపులో పనిచేసే వ్యక్తే బంగారు వస్తువులు ఎత్తుకెళ్లినట్లు కనిపించింది. దీంతో పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్ చంద్ర దొంగను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు అప్పటికే కొంత బంగారం అమ్మేయగా, మిగిలిన బంగారాన్ని రికవరీ చేశారు. సీఐ అందులో కొంత పక్కన పెట్టేశారు. ఆ తర్వాత దొంగ నుంచి బంగారం కొన్న వారి నుంచి రికవరీ చేసిన దాంట్లో కూడా సీఐ మరికొంత తీసుకున్నారు. షాపు యజమాని పోలీసు పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనపై వేటు పడింది.

ఎర్ర స్మగ్లర్ నుంచి దోపిడీ

ఎర్రచందనం రవాణా చేస్తూ నెల్లూరు జిల్లా పోలీసులకు ఒక స్మగ్లర్ పట్టుబడ్డాడు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. 'ఎంట్రా ఎర్రబంగారం ఎత్తుకెళ్లి పుష్ప సినిమాలో హీరోలా ఒంటి నిండా బంగారు నగలు వేసుకున్నావ్. తీసివ్వు' అంటూ వెంకటాచలం ఎస్ఐ కరీముల్లా ఏకంగా 750 గ్రాముల బంగారు చైన్లు, బ్రాస్‌లెట్, ఉంగరాలు లాక్కున్నారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన తర్వాత ఆ స్మగ్లర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన ఒంటిపై నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు ఇవ్వాలని అడిగాడు. 'బంగారు నగలు సీజ్ చేయలేదు. మా ఎస్ఐగారు ఆశపడి తీసుకున్నారు' అని సిబ్బంది తరిమేశారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పోలీసు పెద్దలకు చేరడంతో విచారణ జరిపించి ఎస్ఐపై చర్యలు తీసుకున్నారు.



విశాఖలో ముగిసిన 'మలబార్-2024'

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమైన 'మలబార్ మ్యారిటైమ్ ఎక్సర్‌సైజ్-2024' సైనిక విన్యాసాలు శుక్రవారంతో ముగిశాయి. ఇందులో భారత నౌకాదళంతో పాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన నౌకాదళాలు పాల్గొన్నాయి. యుద్ధ నౌకలు, ఇంటిగ్రల్ హెలికాప్టర్లు, దీర్ఘ శ్రేణి నిఘా విమానాలు, జలాంతర్గాములతో మొదటి దశలో హార్బర్‌లో, రెండో దశలో సముద్రంలో విన్యాసాలు నిర్వహించారు. దేశాలు స్నేహంగా ఉంటూ, పరస్పర అవసరాలు అర్థం చేసుకొని సహకరించుకుంటూ తీర ప్రాంత భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ విన్యాసాలు ఉపయోగపడ్డాయని నేవీ వర్గాలు తెలిపాయి.

రెచ్చిపోయిన ప్రేమోన్మాది బాలికపై హత్యాయత్నం

- అడవిలోకి తీసుకెళ్లి లైటర్‌తో నిప్పు పెట్టిన యువకుడు
- 80 శాతానికి పైగా గాయాలతో విషమ స్థితిలో ఇంటర్ విద్యార్థిని
- సీఎం చంద్రబాబు సీరియస్.. నిందితుడి అరెస్టుకు ఆదేశం

బద్వేలు/గోపవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు బాలికకు ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి.. అడవిలోకి తీసుకెళ్లి నిప్పు పెట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. 80 శాతానికిపైగా గాయపడ్డ బాలిక ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా బద్వేలు పట్టణానికి చెందిన బాలిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బాలిక నివాసం ఉండే వీధికే చెందిన విఘ్నేశ్ కడపలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. బాలికకు మాయమాటలు చెప్పి సన్నిహితంగా మెలిగేవాడు. ఆరు నెలల క్రితమే విఘ్నేశ్‌కు వివాహం కాగా ప్రస్తుతం అతని భార్య గర్భవతి. వీరు కడపలో నివాసం ఉంటున్నారు. ఇదిలావుంటే, విఘ్నేశ్ శుక్రవారం రాత్రి బాలికకు ఫోన్ చేసి "నువ్వు లేకపోతే చచ్చిపోతాను. నీతో మాట్లాడాలి బయటకు రా" అని చెప్పాడు. దీంతో భయపడ్డ బాలిక శనివారం ఉదయం కళాశాలకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వచ్చింది. అనంతరం ఆటోలో నెల్లూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న విఘ్నేశ్ కూడా ఆటో ఎక్కాడు. ఇద్దరూ ఆటోలో పీపీకుంట వద్ద ఉన్న సెంచరీ ప్లైవుడ్ సమీపంలో దిగారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ.. విఘ్నేశ్ తన వద్ద ఉన్న లైటర్‌తో బాలిక దుస్తులకు నిప్పు పెట్టి పరారయ్యాడు. మంటలకు తాళలేక బాలిక కేకలు వేస్తూ జాతీయ రహదారి వైపు పరుగులు పెట్టింది. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ లారీ డ్రైవరు ఆమెను గమనించి వెంటనే లారీని ఆపి.. తన వద్ద ఉన్న దుప్పటి తీసుకొచ్చి మంటలు ఆర్పివేశాడు. స్థానికంగా ఉన్న ఓ మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. బాలిక శరీరం దాదాపు 80 శాతం కాలిపోయిందని వైద్యులు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. హత్యాయత్నం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంటర్ విద్యార్థినిపై హత్యాయత్నం ఘటనపై సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో ఫోన్‌లో మాట్లాడారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని సీఎం ఆదేశించారు.

కర్నూలు వైద్య కళాశాలలో ఒక 'ఓపెన్ సీటు' భర్తీ చేయొద్దు

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒక ఓపెన్ కేటగిరీ ఎంబీబీఎస్ సీటును మూడో రౌండ్ కౌన్సిల్‌లో భర్తీ చేయకుండా ఉంచాలని ఎన్టీఆర్ హెల్త్ యునివర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో షేక్ సానియా అజ్రా అనే యువతి 626 మార్కులు సాధించారు. బీసీ-ఈ కేటగిరీ కింద సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ వర్సిటీ జారీ చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో కర్నూలులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో బీసీ-ఈ కేటగిరీకి మొత్తం 8 సీట్లు ఉన్నాయి. వీటిలో ఏడు సీట్లను మాత్రమే బీసీ-ఈ కేటగిరీ కింద భర్తీ చేశారని, మిగిలిన ఒక సీటును ఓసీ మెరిట్ కేటగిరీకి బదిలీ చేశారని పేర్కొంటూ ఆమె హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ.. సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమైన తర్వాత సీట్ మ్యాట్రిక్స్‌ను అధికారులు మార్చడానికి వీల్లేదన్నారు. పిటిషనర్‌కు ఓపెన్ కేటగిరీ కింద అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు లభించిందన్నారు. ఆమె కర్నూలు వాసి అయినందున కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. త్వరలో జరగనున్న మూడవ రౌండ్ కౌన్సెలింగ్‌లో కర్నూలులో సీటు పొందేందుకు వెసులుబాటు కల్పించాలని కోరారు.

నియోజకవర్గానికో మోడల్ లైబ్రరీ

దేశంలో బాగా పనిచేసే గ్రంథాలయాలపై అధ్యయనం

- ఇక్కడా అలాగే పనిచేసేలా చర్యలు: లోకేశ్
- సమయానికి తెరవని సిబ్బందిపై అసహనం

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శనివారం విశాఖ జిల్లా టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆయన నగరంలోని విద్యా సంస్థల తనిఖీకి బయలుదేరారు. మార్గమధ్యంలో అక్కయ్యపాలెం నెహ్రూబజార్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం వద్ద ఆగారు. ఉదయం 9.45 గంటలైనా లైబ్రరీ తెరవకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. వెంటనే లైబ్రేరియన్‌కు ఫోన్ చేసి పిలిపించారు. ఉదయం ఎనిమిది గంటలకే లైబ్రరీని తెరవాల్సి ఉండగా, ఎందుకు తెరవలేదని నిలదీశారు. ఎనిమిది మంది సిబ్బందికి గాను ప్రస్తుతం ముగ్గురమే ఉన్నామని లైబ్రేరియన్ చెప్పడంతో.. దానికీ, దీనికీ సంబంధం ఏమిటంటూ లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇదే అంశంపై కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు యువకులు లోకేశ్‌ను కలవగా వారితో ముచ్చటించారు. జిల్లా గ్రంథాలయాలను పటిష్ఠం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి గ్రంథాలయంలో పత్రికలు, పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లు అందుబాటులో ఉంచుతామని, గ్రంథాలయాల పర్యవేక్షణకు ఒక అధికారిని నియమిస్తామని చెప్పారు. దేశంలో బాగా పనిచేసే లైబ్రరీలను అధ్యయనం చేసి ఆ ప్రకారం ఇక్కడా నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. తరువాత అదే భవనంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని లోకేశ్ సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. కుశల ప్రశ్నలు వేసి, రైమ్స్ చదివించారు. పిల్లలకు చాక్లెట్లు ఇచ్చి ఫొటోలు దిగారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మంత్రి లోకేశ్

తిరుమలలో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

- లేపాక్షి సర్కిల్లో చేయి కోసుకున్న నెల్లూరువాసి

తిరుమల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మతిస్థిమితం లేని ఒక వ్యక్తి చేయి కోసుకుని వీరంగం సృష్టించాడు. భక్తుల రద్దీ అధికంగా ఉండే లేపాక్షి సర్కిల్లో పెద్దగా కేకలు వేస్తూ కత్తితో చేతిపై పలుమార్లు కోసుకుంటూ హల్‌చల్ చేశాడు. విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన రేవంత్(23) శనివారం ఉదయం లేపాక్షి సర్కిల్ వద్దకు వచ్చాడు. ఒక్కసారిగా పెద్దగా కేకలు వేస్తూ ఎడమచేతిపై కత్తితో కోసుకున్నాడు. అతన్ని గమనించిన సమీపంలోని భక్తులు భయంతో అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయారు. కొంత సమయానికి విజిలెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని రేవంత్‌కు నచ్చజెప్పి చేతిలో ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం 108 అంబులెన్స్‌లో తిరుమలలో అశ్విని ఆస్పత్రికి తరలించారు.

హైవేపై దారి దోపిడీ

- నగల వ్యాపారి వద్ద రూ.39.50 లక్షలు లూటీ

మేదరమెట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దారి దోపిడీ జరిగింది. గూడ్స్ లారీలో చెన్నై వెళుతున్న నగల వ్యాపారి వద్ద ఉన్న రూ.39.50 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన నగల వ్యాపారి స్వరూప్ వెంకటరమణ ట్రాన్స్‌పోర్టుకు చెందిన రవాణా లారీలో రూ.39.50 లక్షలు తీసుకొని చెన్నై బయలుదేరారు. ఎమర్జెన్సీ రన్‌వేపై వెళుతున్న లారీకి అడ్డంగా దుండగులు నంబరు ప్లేటు లేని కారును నిలిపారు. నలుగురు వ్యక్తులు స్వరూప్ వద్ద ఉన్న రూ.39.50 లక్షల నగదు, సెల్‌ఫోన్ తీసుకొని వెళ్లిపోయారు. ఆ తర్వాత స్వరూప్ మేదరమెట్ల పోలీసు స్టేషన్‌కు చేరుకుని దోపిడీపై ఫిర్యాదు చేశారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు ఎస్సై సురేష్ స్వరూప్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డీ బ్రదర్స్ కొలతే వేరు

సొమ్ములిస్తేనే మెజర్‌మెంట్

- ఇరిగేషన్‌లో 2017లో భారీ దందా
- ట్రాప్‌వేసి పట్టుకున్న ఏసీబీ..సస్పెన్షన్
- వారి క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు ఇప్పుడు అనుమతి.. ఉత్తర్వులు జారీ

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒకరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు....మరొకరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. ఇద్దరూ రెడ్డీ బ్రదర్స్. శాఖాపరంగా అప్పగించిన పనులు కాంట్రాక్టర్లు పూర్తి చేశాక ఇంజనీర్లు జరిగిన పనిని కొలతలు వేసి, మెజర్‌మెంట్ బుక్ (ఎం.బుక్)లో నమోదు చేస్తారు. కానీ, ఈ పని చేయడానికి రెడ్డీ బ్రదర్స్ లంచం అడిగి 2017లో ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. అప్పుడే వారిని సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో ముందుకెళ్లడానికి ఏసీబీకి అనుమతి ఇస్తూ శుక్రవారం జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల్లోని వివరాల్లోకి వెళితే.. కడప జిల్లా ఖాజీపేట గ్రామనివాసి షేక్ ఖదీరుల్లా భార్య షేక్ యాస్మిన్ జన్మభూమి కమిటీ సభ్యురాలు. గ్రామ సర్పంచ్‌తో సహా నలుగురు జన్మభూమి కమిటీ సభ్యులతో కలసి 'డీసిల్టింగ్' పనులు చేసేందుకు కలెక్టర్ నుంచి ఆమె అనుమతి పొందారు. 2016లో... ఏప్రిల్ 7వ తేదీన రూ.4,96,000, ఆగస్టు 17న రూ.4,96,000, అక్టోబరు 28వ తేదీన రూ.4,95000 విలువైన పనులు.... జన్మభూమి కమిటీకి అప్పగిస్తూ పంచాయతీ తీర్మానం చేసి ఖాజీపేట ఎంపీడీవోకు పంపింది. ఈ తీర్మానాన్ని ఎంపీడీవో... ఖాజీపేట జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు పంపారు. ఈ పనులు పూర్తి చేసేలా యాస్మిన్ భర్త షేక్ ఖాదీరుల్లాతో జలవనరులశాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు (ఏఈఈ) పాతకోట వరప్రసాదరెడ్డి ఒప్పందం చేసుకున్నారు. ఈ పనులు పూర్తి చేశాక .. తనకు రావాల్సిన బిల్లుల కోసం ఏఈఈని ఖాదీరుల్లా సంప్రదించారు. అయితే.. బిల్లులు చెల్లించాలంటే ముందుగా పనులు పూర్తి చేసినట్లుగా కొలతలు తీసుకుని బుక్‌లో రికార్డు చేయాల్సి ఉందని, దానికోసం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మిరియాల వెంకట రమణారెడ్డిని కలవాలని ఆయనకు సూచించారు. వెంకట రమణారెడ్డిని కలిసి ఖాదీరుల్లా తన బిల్లుల విషయం మాట్లాడారు. అయితే, ఎంబుక్‌లో కొలతలు నమోదుచేసి ..ఏఈఈకి పంపాలంటే తనకు రూ.50,000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బేరమాడక ..రూ. 30 వేలకు దిగివచ్చారు. అక్కడ నుంచి బిల్లులు చెల్లించేందుకు ఫైలు ఏఈఈ వరప్రసాద్‌రెడ్డి వద్దకు వెళ్లింది. ఆయన బిల్లులు మంజూరు చేసేందుకు రూ.50,000 లంచం డిమాండ్ చేశారు. రూ.30,000 ఇస్తానంటే ఒప్పుకోలేదు. దీంతో.. ఖాదీరుల్లా...ఏసీబీని ఆశ్రయించారు. 2017 అక్టోబరు మూడో తేదీన .. పాతకోట వరప్రసాదరెడ్డి కుడిచేత్తో రూ.50,000, మిరియాల వెంకట రమణారెడ్డి ఎడమ చేత్తో రూ.30,000 తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వీరిని జల వనరులశాఖ విధుల నుంచి సస్పెండ్ చేసింది. తాగాజా వీరిద్దరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిసాయిప్రసాద్ రెండు ఉత్తర్వులు జారీ చేశారు. విడుదల చేశారు. కాగా, మిరియాల వెంకట రమణారెడ్డి కడప జిల్లా బద్వేల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా 2014 నవంబరు 24 నుంచి 2017 అక్టోబరు మూడో తేదీ వరకు పని చేశారు. పాతకోత వరప్రసాద్‌రెడ్డి ప్రకాశం జిల్లా గిద్దలూరు జలవనరుల శాఖ స్పెషల్ సబ్ డివిజన్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పాతకోట వరప్రసాదరెడ్డి 2016 జూన్ 27 నుంచి 2017 అక్టోబరు మూడో తేదీదాకా బాధ్యతలు నిర్వహించారు.

విద్యుత్తు చార్జీల భారం మోపితే ఉద్యమం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం మోపితే ఇతర వామపక్ష పార్టీలన్నింటినీ కలుపుకుని ఉద్యమం చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ చార్జీలు ఉండవని, స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకమని చెప్పిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలిస్తామని, ఇళ్ల నిర్మాణానికి యూనిట్ ఖర్చు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇళ్ల లబ్ధిదారులను సమీకరించి నవంబరు 18న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సామూహిక అర్జీలు సమర్పించనున్నట్లు చెప్పారు.

టీడీపీ కడప నగర అధ్యక్షుడిపై దాడి

- కర్రలతో కొట్టిన ముగ్గురు యువకులు, తలకు తీవ్ర గాయాలు

కడప (క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టీడీపీ అధ్యక్షుడు శివకొండారెడ్డిపై కొంత మంది గుర్తుతెలియని యువకులు కర్రలతో దాడిచేశారు. ఇంటి నుంచి శనివారం ఉదయం 6.30 గంటలకు సమీపంలో ఉన్న టీస్టాల్‌కు ఆయన స్కూటీపై వచ్చారు. అక్కడి నుంచి కూరగాయలు కొనేందుకు అప్సర సర్కిల్‌కు వెళ్లారు. కూరగాయలు తీసుకుని ఇంటికి వెళుతూ పాల కోసం దగ్గర్లోని మార్ట్ వద్ద ఆగేందుకు ప్రయత్నిస్తుండగా.. వెనకే ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు కర్రలతో ఆయన తల, వీపు మీద దాడి చేశారు. గమనించిన స్థానికులు అక్కడికి రావడంతో కర్రలు అక్కడే పారేసి నిందితులు పారిపోయారు. సమాచారం అందుకున్న చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్‌ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని దాడి ఘటనపై ఆరా తీశారు. అక్కడ ఉన్న షాపుల్లో సీసీ ఫుటేజీలు పరిశీలించారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాడిలో గాయపడ్డ శివకొండారెడ్డిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని కడప టీడీపీ నాయకులు పరామర్శించారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డి

మధ్యవర్తిత్వాన్ని సంస్థాగతం చేయాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ

న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ కమిటీ నివేదికలో సిఫారసు చేసిన విధంగా ఆర్బిట్రేషన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పర్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ అన్నారు. శనివారం ఢిల్లీలో 15వ నానీ పాల్కీవాలా ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో కీనోట్ ప్రసంగం చేసిన నరసింహ ఈ సంస్థకు స్వతంత్రప్రతిపత్తి ఉండాలని, లబ్ధిదారులకు ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. ఆర్బిట్రేషన్ తీర్పుల అమలును పర్యవేక్షించేందుకు ఒక యంత్రాంగం అంటూ దేశంలో లేదని ఆయన అన్నారు. భారత దేశంలో ఉన్న ఆర్బిట్రేషన్ న్యాయనిపుణులు ప్రతిభావంతులని, ప్రపంచంలో ఏ నిపుణులకూ తీసిపోరని తెలిపారు. అందువల్ల ఆర్బిట్రేషన్ ప్రక్రియను సంస్థాగతం చేసి ఉత్తమ పద్ధతులను అవలంబించేందుకు వీలుగా పర్యవేక్షణ సమర్థంగా జరిగేలా చూడాలన్నారు. నిర్దిష్ట కాలపరిమితికి కట్టుబడి ఉండే ఆర్బిట్రేషన్ సంస్కృతి చాలా ముఖ్యమని సూచించారు. 1996లో చేసిన ఆర్బిట్రేషన్ చట్టం నిబంధనలను రూపొందించినప్పటికీ పర్యవేక్షణ జరిపేందుకు నియంత్రణా వ్యవస్థను సూచించలేదని ఆయన చెప్పారు. దేశంలో 91 శాతం కంపెనీలు కోర్టుల చుట్టూ తిరగడం కన్నా ఆర్బిట్రేషన్‌ను కోరుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అందువల్ల ఆర్బిట్రేషన్ తెగిన గాలిపటంలా మారకూడదని, దానికి నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు.

మేం ప్రజలకు మంచి చేస్తున్నాం

- గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దందాతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు
- మా హయాంలో అక్రమాలకు తావు లేదు
- ట్రాక్టర్లతోనూ ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చు
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుందని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఇసుక రేవులన్నింటినీ జగన్ తన గుప్పిట్లో పెట్టుకొని వేల కోట్ల రూపాయలు దండుకొన్నారు. మేం ఇసుకపై సీనరేజి పన్ను, జీఎస్టీ తీసేశాం. ప్రజలు సొంత అవసరాలకు ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తవ్వుకొని తీసుకెళ్లేందుకు కూడా అనుమతిచ్చాం' అని పేర్కొన్నారు. పన్నుల రద్దు వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.264 కోట్ల నష్టం వస్తుందని, ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు దాన్ని వదులుకున్నామన్నారు. ఉచిత ఇసుక విధానంపై అనుమానం ఉంటే జగన్మోహన్‌రెడ్డి స్వయంగా ఒక ట్రాక్టర్ తీసుకొని ఇసుక ఉచితంగా తవ్వుకొని తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకొని వెళ్లొచ్చని మంత్రి అన్నారు. 'జగన్ ప్రభుత్వంలో ఇసుక ధర ఆకాశాన్ని తాకింది. పనులు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు నిర్మాణ రంగానికి మళ్లీ ఊపిరి పోయడానికి మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలు తీశారని, మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకూ తమ గుప్పెట్లో పెట్టుకొని వేల కోట్లు దోచుకొన్నారని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సంస్కరిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన పరీక్షలను ఆరు నుంచి పదమూడుకు పెంచి నాణ్యమైన మద్యం అమ్మేందుకు కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి మద్యం ధరలను నిర్ణయించబోతున్నామని తెలిపారు. బడులు, దేవాలయాలకు వంద మీటర్ల లోపు మద్యం షాపులు ఉండకుండా చూస్తామన్నారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకొన్నాం

- జీవో 117 రద్దుపై పీతల సుజాత

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను భ్రష్టు పట్టించిన జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నామని మాజీ మంత్రి, టీడీపీ నేత పీతల సుజాత పేర్కొన్నారు. శనివారం ఆమె ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీవో 117 రద్దు నిర్ణయం తీసుకొన్న మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. 'వైసీపీ సర్కార్ హయాంలో తెచ్చిన జీవో విద్యార్థుల పాలిట శాపంగా మారింది. లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వెళ్లిపోయారు. జగన్మోహన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యారంగం సర్వనాశనం అయింది. ఇష్టానుసారం చేసి పాఠశాల విద్యను పనికి రాకుండా చేశారు' అని సుజాత విమర్శించారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టడం, మరుగుదొడ్ల శుభ్రం చేయించడం వంటి చర్యలతో జగన్ వారిని తీవ్రంగా అవమానించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీచర్లపై ఒత్తిడి తగ్గించామని, ఒకటో తేదీన జీతాలు ఇవ్వడంతోపాటు మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచామని చెప్పారు. రానున్న కాలంలో విద్యా రంగాన్ని మరింత తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

రేపు కర్నూలులో ట్రాన్స్‌కో సమన్వయ సమితి సమావేశం

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో రాష్ట్ర సమన్వయ సమితి సమావేశం కర్నూలులో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన సోమవారం జరగనుంది. ఈ సమావేశంలో 2024-25 నుంచి 2028-29 వరకూ రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఆమోదం పొందేందుకు ఏర్పాటు చేసినట్టు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు, ఏపీట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డిస్కమ్‌ల సీఎండీలు పట్టన్‌శెట్టి రవి, ఇమ్మడి పృథ్వితేజ్, సంతోష్‌రావు, ఎన్టీపీసీ, సెకీ తదితర సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan వేయండి

తీతువు పిట్టల్లా లొల్లి..!

అమంగళం ప్రతిహతం అవుగాక! మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోడానికి కూడా సిద్ధమే అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడంతో వైసీపీకి చెందిన పలువురు 'మాయాబజార్' చిత్రంలో శకుని చెప్పిన ఈ డైలాగ్‌ను గుర్తు చేసుకున్నారు. జగన్‌రెడ్డి మాటల్లో ఈ మధ్య తడబాటు కనిపిస్తోంది. తాను మళ్లీ అబద్ధాలు చెప్పి ఉంటే అధికారంలోకి వచ్చి ఉండేవాడినని ఆయన చెప్పుకోవడంతో వైసీపీ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ మాటకు అర్థాలు తీస్తే 2019 ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పడం వల్లనే అధికారంలోకి వచ్చామని ఆయన చెప్పకనే చెప్పారని సరిపెట్టుకున్నారు. రాజకీయాల్లో అబద్ధాలు చెప్పడం సహజమేగానీ ఇలా అసంకల్పితంగా నిజాలు చెప్పుకొంటే ఎలా అని విస్తుపోతున్నారు. ఆడిన మాట తప్పని సత్య హరిశ్చంద్రుడిని అని చెప్పుకోవడానికి జగన్‌రెడ్డి ఈ మాట అని ఉండవచ్చుగానీ, ఫలితంగా అతడి అంతరంగం ఆవిష్కృతమైంది. వాస్తవానికి జగన్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు అలవోకగా ప్రవహిస్తాయి. 2019 ఎన్నికలకు ముందు, అధికా-

> బోసడీకే అన్న పదం వాడినందుకే రక్తం మరిగి దాడులు చేసే పరిస్థితి ఉంటే, చంద్రబాబు ధర్మపత్నిని నిండు సభలో దారుణంగా అవమానించి వ్యక్తిత్వ హననానికి పాల్పడినప్పుడు అవతలి వారి రక్తం ఇంకెంత మరగాలి? తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా వంటి వారి మాటలు, వాడిన భాష విన్నప్పుడు రక్తం మరగదా? ఇళ్లలోని ఆడవాళ్లను సైతం బజారుకు ఈడ్చిన వాళ్లను ఏం చేయాలి?

రంలోకి వచ్చిన తర్వాత కూడా అసత్యాలే పునాదులుగా ఆయన రాజకీయాలు సాగాయి. తాజా వ్యాఖ్యలతో ఆయన గతంలో చెప్పిన అబద్ధాలను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకున్నారు. దీంతో తలలు పట్టుకోవడం వైసీపీ నాయకుల వంతైంది. "వచ్చే ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమే కానీ అబద్ధాలు మాత్రం చెప్పను" అని జగన్‌రెడ్డి చెప్పుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులు కూడా విస్తుపోయారు.

మరి... నిజం చెప్పాలి కదా!

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమకూర్చుకున్న ఆస్తులలో తన కుమార్తె షర్మిలకు కూడా సమాన వాటా ఉండాలని, తన భార్య విజయలక్ష్మికి వాటా అవసరం లేదని ఆడిటర్లకు ఆయన సూచించడం వాస్తవమో కాదో జగన్‌రెడ్డి స్పష్టం చేయాలి. వాస్తవమే అయితే ఆస్తుల్లో షర్మిలకు వాటా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారో చెప్పాలి కదా! తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని వందల, వేల కోట్ల పెట్టుబడులను సేకరించి, సొంత మీడియాను ఏర్పాటు చేసుకొని కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు మీడియా లేదని చెప్పుకోవడం అబద్ధం కాదా? రోత మీడియా తనది కాకపోతే తన భార్య భారతీరెడ్డి దానికి చైర్‌పర్సన్ ఎలా అవుతారో, మెజారిటీ షేర్లు తన పేరిట, తన కంపెనీల పేరిట ఎలా ఉంటాయో వివరించాలి కదా! సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేసింది, చేయించిందీ ఎవరో తెలిసి కూడా ఆ నెపాన్ని చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించింది నిజం కాదా? 2019కి ముందు కోడి కత్తితో దాడి చేయించుకొని, అది కూడా చంద్రబాబు పనేనని ప్రచారం చేయించి రాజకీయ లబ్ధి పొందడం నిజం కాదని చెప్పగలరా? అవినీతి కేసులలో తండ్రి రాజశేఖర రెడ్డి పేరు చేర్పించి తాను తప్పించుకోవాలని ప్రయత్నించడం నిజం కాదా? అమరావతిలోనే రాజధాని ఉంటుందని, అందుకే అక్కడ ఇల్లు కట్టుకున్నానని ఎన్నికలకు ముందు చెప్పడం నిజం కాదా? ఎన్నికల తర్వాత మూడు రాజధానులు అని చెప్పి ప్రభుత్వ సొమ్ముతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్యాలెస్‌లు నిర్మించుకోవాలనుకోవడంలో నిజం లేదా? అధికారం ఇస్తే మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి... అత్యంత నాసిరకం మద్యాన్ని ప్రజలకు విక్రయించి అక్కడ కూడా డబ్బు సంపాదించుకొనే నీచానికి ఒడిగట్టింది ఎవరో జగన్‌రెడ్డి చెప్పగలరా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో! 'నువ్వు అబద్ధమాడితే బాగుండు అని ఎవరైనా చెబితే.. లేదు, ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే. కానీ, అబద్ధం మాత్రం చెప్పలేను' అని చెప్పడమే పెద్ద అబద్ధం కదా?

మరవగలమా మీ పాలన...

అబద్ధాల విషయం అలా ఉంచితే, ప్రజలు తన పాలనను ఎక్కడ మరచిపోతారోనని జగన్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువని అంటారు. అందుకే తాము ఓడించిన పార్టీలనే ఐదేళ్ల తర్వాత ఆశీర్వదిస్తుంటారు. అయితే 2029 ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమైనందునే జగన్‌రెడ్డి తన రాక్షస పాలనను తానే ప్రజలకు పదే పదే గుర్తుచేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇసుక, మద్యం వ్యవహారాల్లో ఏదో జరిగిపోతోందని చెబుతూ తన దోపిడీని ప్రజలకు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో కక్ష సాధింపులు, వేధింపులు పరాకాష్ఠకు చేరాయని, నాలుగు నెలలకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని చెబుతూ తన పాలనను మళ్లీ మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ వేధింపులే అజెండాగా పాలన సాగించి చంద్రబాబును జైల్లో పెట్టే వరకు శాంతించని తనను ప్రజలు ఎక్కడ మరచిపోతారోనని గుర్తు చేస్తూనే ఉన్నారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో సరికొత్త రికార్డులు నెలకొల్పడం ద్వారా తన ప్రత్యర్థులపైకి ఉసిగొల్పిన జగన్‌రెడ్డి అప్పుడు ఏం జరిగిందో గుర్తు చేస్తున్నారు. జగన్‌రెడ్డి గతంలో చెప్పినవన్నీ అబద్ధాలని తెలుసుకోవడం వల్లనే ప్రజలు తాజా ఎన్నికల్లో ఆయన పార్టీని పదకొండు సీట్లకే పరిమితం చేయడం మాత్రం సత్యం. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డి అడుగుజాడల్లో నడవడం లేదు. అయినా అధికారంలో ఉన్నప్పుడు తానేం చేశానో, ఎంత అరాచకంగా ప్రవర్తించానో గుర్తు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారా అన్నట్టుగా జగన్‌రెడ్డి వ్యాఖ్యలు ఉంటున్నాయి. అబద్ధాలే పునాదులుగా అధికారంలోకి వచ్చిన వ్యక్తి తాను అబద్ధాలే ఆడనని చెప్పుకోవడం వింతగా ఉన్నప్పటికీ... అతగాడి మనస్తత్వానికి ఆ మాటలు అద్దం పట్టడం లేదా? ప్రజల జ్ఞాపకశక్తి తక్కువే అయివుండవచ్చునుగానీ తమరి పాలనను ప్రజలు అంత తొందరగా ఎలా మరచిపోగలరు? జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను ఒక పీడ కలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. ఆ రాక్షస పాలనను మరచిపోదామన్నా మరచిపోలేని పరిస్థితి! ప్రతిపక్ష నాయకుడి స్థాయి నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరికీ స్వేచ్ఛ లేకుండా జగన్‌రెడ్డి పాలన సాగింది. అప్పట్లో ఎవరైనా స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుకోగలిగారా? జగన్‌రెడ్డి సొంత మనుషులు, కలెక్షన్ ఏజెంట్లు కూడా ఫోన్లలో స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగారా? లేదే! 'మీరు ఎవరెవరితో మాట్లాడేదీ, మీకు వచ్చే మెసేజులు అన్నీ నాకు తెలుస్తాయి' అని తన అంతరంగికులలో ఒకరిని జగన్‌రెడ్డి హెచ్చరించడం నిజం కాదా? ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉన్నది, ఎలా ఉండబోతున్నది అన్న విషయం పక్కన పెడితే... ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు. ఫేస్ టైం, సిగ్నల్ వంటి యాప్‌ల అవసరం లేకుండా ఫోన్లలో మామూలుగా మాట్లాడుకోగలుగుతున్నారు. ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా సాగించిన పాలన కూడా పాలన అవుతుందా? కాదు.. కాజాలదు!



హవ్వ... ఆ నోట ఈ మాటా!

అధికారం ఉన్నది సొంత ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే అని నమ్మి ప్రభుత్వ వనరులను కొల్లగొట్టి, నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి ఇప్పుడు ప్రవచనాలు చెబుతున్నారు. సత్యహరిశ్చంద్రుడే జీవించి ఉంటే... 'నేను అబద్ధాలు చెప్పను' అనే జగన్ మాటలు విని సిగ్గుతో చచ్చిపోయేవారేమో! పురాణాల్లో పౌండ్రక వాసుదేవుడి గురించి చెప్పారుగానీ ఇలాంటి అపర సత్యహరిశ్చంద్రుడి గురించి చెప్పలేదు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పే జగన్‌రెడ్డి వంటి కేరెక్టర్లు కూడా ఉంటాయని ఎవరూ ఊహించి ఉండరు. కొంత మంది నోటి వెంట కొన్ని మాటలు వింటే వినసొంపుగా ఉంటాయి. జగన్‌రెడ్డి వంటి వారు నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తే వినడానికే రోతగా ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి ప్రజలను అడుక్కునే వారి స్థాయికి దిగజార్చడం ద్వారా అధికారాన్ని అంటిపెట్టుకోవాలని చూసిన జగన్‌రెడ్డి కుయుక్తులను

> తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని వందల, వేల కోట్ల పెట్టుబడులను సేకరించి, సొంత మీడియాను ఏర్పాటు చేసుకొని కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు మీడియా లేదని చెప్పుకోవడం అబద్ధం కాదా? రోత మీడియా తనది కాకపోతే తన భార్య భారతీరెడ్డి దానికి చైర్‌పర్సన్ ఎలా అవుతారో, మెజారిటీ షేర్లు తన పేరిట, తన కంపెనీల పేరిట ఎలా ఉంటాయో వివరించాలి కదా! సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేసింది, చేయించిందీ ఎవరో తెలిసి కూడా ఆ నెపాన్ని చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించింది నిజం కాదా? అమరావతిలోనే రాజధాని ఉంటుందని, అందుకే అక్కడ ఇల్లు కట్టుకున్నానని ఎన్నికలకు ముందు చెప్పడం నిజం కాదా? ఎన్నికల తర్వాత మూడు రాజధానులు అని చెప్పి ప్రభుత్వ సొమ్ముతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్యాలెస్‌లు నిర్మించుకోవాలనుకోవడంలో నిజం లేదా? అధికారం ఇస్తే మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి... అత్యంత నాసిరకం మద్యాన్ని ప్రజలకు విక్రయించి అక్కడ కూడా డబ్బు సంపాదించుకొనే నీచానికి ఒడిగట్టింది ఎవరో జగన్‌రెడ్డి చెప్పగలరా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో!

ప్రజలే తిప్పికొట్టారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పంచిపెట్టినా ఎన్నికల్లో తనకు ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోగా 'నేను అబద్ధం చెప్పను' అని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా? ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమేగానీ అబద్ధాలు మాత్రం చెప్పనని జగన్‌రెడ్డి అన్నప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొన్న కొంత మంది చప్పట్లు కొట్టడం చూస్తే వైసీపీలో ఇంకా ఉన్మాదుల సంఖ్య తగ్గలేదనిపిస్తోంది. తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటి? అని ప్రశ్నించిన జగన్‌రెడ్డి ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. ఇదంతా కాదుగానీ నిత్యం బైబిల్ పఠనం చేస్తానని చెప్పే జగన్‌రెడ్డి... బైబిల్ చేత పట్టి ఏసు ప్రభువు సమక్షంలో ఆత్మపరిశీలన చేసుకుంటే తత్వం బోధపడుతుంది. అయినా మన పిచ్చిగానీ ఏసుప్రభువును కూడా తన స్వార్థానికి వాడుకుంటున్న విషయం అతనికి తెలియదా? అలాంటి వారిలో పరివర్తన రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అరాచక మనస్తత్వంతో పాలించడం దైవ ప్రేరణ ఎలా అవుతుంది? ఇతరులను ప్రేమించడం గురించి చెప్పిన బైబిల్ పైశాచికంగా ప్రవర్తించమని బోధించలేదే?

గతం మరిచిపోయి కథలు

అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి వైసీపీ మూక మాట్లాడటం జుగుప్సాకరంగా ఉంది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని తెలుగుదేశం అధికార ప్రతినిధి పట్టాభి బోసడీకే అని తిట్టడం వల్ల తమ కార్యకర్తల రక్తం మరిగి, తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేస్తే చేసి ఉండవచ్చునని సజ్జల రామకృష్ణారెడ్డి అనే మాజీ జర్నలిస్టు చెబుతున్నారు. ఈ కేసులో పోలీసులు తనను విచారణకు పిలవడం ఏమిటి? అని కూడా ఆయన ప్రశ్నిస్తున్నారు. బోసడీకే అన్న పదం వాడినందుకే రక్తం మరిగి దాడులు చేసే పరిస్థితి ఉంటే, చంద్రబాబు ధర్మపత్నిని నిండు సభలో దారుణంగా అవమానించి వ్యక్తిత్వ హననానికి పాల్పడినప్పుడు అవతలి వారి రక్తం ఇంకెంత మరగాలి? తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా వంటి వారి మాటలు, వాడిన భాష విన్నప్పుడు రక్తం మరగదా? ఇళ్లలోని ఆడవాళ్లను సైతం బజారుకు ఈడ్చిన వాళ్లను ఏం చేయాలి? జగన్‌రెడ్డిలో ఉన్న లక్షణాల్లో పదోవంతు చంద్రబాబులో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. పోలీసు విచారణకు హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి గంటల వ్యవధిలోనే బయటకు వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిని సమర్థించుకోగలిగేవారా? ఎంపీ అని కూడా చూడకుండా రఘురామకృష్ణ రాజును పోలీసులతో చితగ్గొట్టించిన విషయం మరచిపోతే ఎలా? పోలీసు ఉన్నతాధికారులైన పి.సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామిరెడ్డి కిరాయి సైనికులుగా మారి చేసిన దురాగతాలను సజ్జల మరచిపోయినా ప్రజలు మరచిపోతారా? జగన్‌రెడ్డి రోత మీడియాపై పోలీసులు ఒక కేసు పెట్టినందుకే ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ అంటూ పెడబొబ్బలు పెడుతున్నారే? నిన్నటిదాకా మీరు చేసిందేమిటి? రఘురామకృష్ణరాజుతోపాటు నాపైనా, మా సహచరులపైనా దేశద్రోహం కేసు పెట్టిన విషయం మరిచారా? 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై సీఐడీ అధికారులు ఎన్నో కేసులు పెట్టారు కదా! ఆ కేసులలో మా సిబ్బంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు కదా? రోత పత్రికపై కేసు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని... జగన్‌రెడ్డి దయవల్ల ఐదేళ్ల పాటు మీడియా సలహాదారు పదవిలో కొనసాగిన దేవులపల్లి అమర్ అనే జర్నలిస్టు నాయకుడు ఇప్పుడు అంటున్నారు. ఆయనకు అప్పుడు పత్రికా స్వేచ్ఛ కనిపించలేదా? 'ప్రచురించిన వార్తల విషయమై ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే వివరణ ఇవ్వాలి! సదరు వివరణను ప్రచురించకపోతే పరువు నష్టం దావా వేసుకోవచ్చునుగానీ కేసులు పెట్టడం ఏమిటి?' అని ఇప్పుడు ప్రవచనాలు చెప్పడం ఏమిటి? ఇదే సలహా జగన్‌రెడ్డి ప్రభుత్వానికి మీడియా సలహాదారుడిగా ఎందుకివ్వలేదు? మాపై కేసులు పెట్టినప్పుడు ప్రభుభక్తి మత్తులో దేవులపల్లి అమర్ నిద్రపోయారా? ఐదేళ్ల పాటు శాసనసభ కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఏబీఎన్‌పై నిషేధం విధించడాన్ని మరచిపోతే ఎలా? ముఖ్యమంత్రి కార్యాలయానికి, నివాసానికి వెళ్లకుండా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై నిషేధం విధించడాన్ని ఏమనాలి? రోత మీడియాతోపాటు మరో రెండు కూలి మీడియా చానళ్ల ప్రసారాలను ఇప్పుడు అడ్డుకోవడంపై పెడబొబ్బలు పెడుతున్నారే! మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏబీఎన్‌తో పాటు టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు అడ్డుకోలేదా? కర్మ మనల్ని వదలదు— తప్పు ఎవరు చేసినా తప్పే! జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఈ దురాగతాలను అప్పుడు ఖండించి ఉంటే ఇప్పుడు ఎవరికైనా ఏడ్చే అర్హత, హక్కు వచ్చి ఉండేవి. అప్పుడు ప్రభువు కళ్లలో ఆనందం చూసి నోళ్లకు తాళం వేసుకున్న వాళ్లు ఇప్పుడు తీతువు పిట్టల్లా లొల్లి చేసినా లాభం లేదు. మీరు ఏం చేశారో ప్రజలు మరచిపోలేదు కనుకే ఇప్పుడు జరుగుతున్న దాన్ని కూడా పట్టించుకోవడం లేదు. తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇప్పుడు కూలి మీడియాగా మారిన ఒక చానల్ ప్రసారాలను కొద్ది రోజులు ఆపించడంతో అలా చేయడం తప్పు అని నేను స్వయంగా ముఖ్యమంత్రికి చెప్పగలిగాను. ఏబీఎన్, టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు నిలిపివేసినా మాట్లాడని వారు ఇప్పుడు తమకు అన్యాయం జరిగిందని రోదించే అర్హత కోల్పోయారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై పోలీసు కేసు పెట్టడమేమిటి? అని రోత మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, 'ఐదేళ్లుగా ఏం జరిగిందో నేను చూశాను. అప్పుడు ఎలా ఏం చేశారో ఇప్పుడు అలాగే చేశాం. అంతా చట్టప్రకారమే జరుగుతోంది. ఇందులో ఆక్షేపించడానికి ఏమీ లేదు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు కూల్‌గా బదులిచ్చారు.

> సత్యహరిశ్చంద్రుడే జీవించి ఉంటే... 'నేను అబద్ధాలు చెప్పను' అనే జగన్ మాటలు విని సిగ్గుతో చచ్చిపోయేవారేమో! పురాణాల్లో పౌండ్రక వాసుదేవుడి గురించి చెప్పారుగానీ ఇలాంటి అపర సత్యహరిశ్చంద్రుడి గురించి చెప్పలేదు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పే జగన్‌రెడ్డి వంటి కేరెక్టర్లు కూడా ఉంటాయని ఎవరూ ఊహించి ఉండరు.

అందుకు సంతోషించండి...

ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కోతో పాటు కొంత మంది వారి తాబేదార్లు గగ్గోలు పెట్టడం చూస్తే కౌరవ మూక హాహాకారాలను వింటూ 'ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి' అని మాయాబజార్ చిత్రంలో ఘటోత్కచుడు చెప్పిన డైలాగ్ గుర్తుకొస్తుంది. జగన్‌రెడ్డి సాగించిన అరాచకాల ప్రభావం ఇప్పట్లో తొలగిపోదు. జగన్‌రెడ్డికి 2019లో లభించిన మెజారిటీ కంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి ఎక్కువ మెజారిటీ వచ్చింది. అయినా గతంలో జరిగిన వాటిని, రెడ్ బుక్‌లో రాసుకున్న వాటిని గుర్తుకు తెచ్చుకొని తాడూ బొంగరం లేని కేసులు పెట్టి వేధించనందుకు సంతోషించకుండా గగ్గోలు పెట్టడం అస్సలు బాగోలేదు. చంద్రబాబుకు జగన్ పూనితే పరిస్థితి ఏమిటో మీకే తెలుస్తుంది. అలా జరగడం లేదు కనుకే స్వేచ్ఛగా ప్రవచనాలు చెప్పుకోగలుగుతున్నారు. సొంత పార్టీ కార్యకర్తల నుంచి ఎంత ఒత్తిడి వస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంయమనం కోల్పోవడం లేదు. తప్పులు చేయడంలో కూడా హద్దులు మీరిన వారిని కూడా చట్టప్రకారమే శిక్షించాలనుకుంటున్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి అవాకులు చవాకులు పేలినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రక్తం ఎంత మరగాలి? ప్రజలు అధికారం ఇచ్చింది కక్ష సాధింపులకు కాదు కదా అని అటు చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్ నమ్ముతున్నందున వైసీపీ మూక స్వేచ్ఛగా తిరగగలుగుతోంది. కొంత మంది వ్యక్తులపై కేసులు పెడుతున్నా, పాత కేసులలో దర్యాప్తు వేగం పెరుగుతున్నా అదంతా చట్ట పరిధిలోనే జరగాలనుకుంటున్నారు. అనాగరికంగా ఆలోచించేవారే అయితే బూతులకు పేటెంట్ తీసుకున్న కొడాలి నాని వంటి వారికి పోలీస్ ట్రీట్‌మెంట్ చేయించడం ఎంత సేపు? పోలీసులు తనను దారుణంగా కొడుతున్నప్పుడు బాధతో రఘురామకృష్ణ రాజు అరచిన అరుపులు జగన్ అండ్ కోకు శ్రవణానందకరంగా అనిపించి ఉండవచ్చునుగానీ ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి పైశాచిక మనస్తత్వం ఉన్నవాళ్లు లేరనే చెప్పవచ్చు. అయితే గతంలో హద్దులు మీరి ప్రవర్తించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం వస్తుంది. అది రాజకీయాలకే కాదు— రాష్ట్రానికీ మంచిది కాదు. దుష్టశిక్షణ ధర్మసమ్మతం, న్యాయ సమ్మతం అని దేవుడే చెప్పాడు. ఇందులో శషభిషలకు తావు ఉండకూడదు. అబద్ధాలు చెప్పడం అలవాటు లేదని అబద్ధం చెబుతున్న జగన్‌రెడ్డిని ప్రజలు ఇప్పట్లో విశ్వసించరు. సొంత పార్టీ వారే ఆయనను విశ్వసించడం లేదు. త్వరలోనే ఆ పార్టీకి చెందిన కీలక నేతలు జగన్‌కు బైబై చెప్పే అవకాశం ఉంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉన్నప్పటికీ వారు పార్టీని వీడితే మాత్రం మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే అన్న జగన్ మాటలు నిజమవుతాయి. తథాస్తు దేవతలు ఉండరా మరి! అభినవ సత్యహరిశ్చంద్రుడి రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!

> జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను ఒక పీడ కలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. ఆ రాక్షస పాలనను మరచిపోదామన్నా మరచిపోలేని పరిస్థితి! ప్రతిపక్ష నాయకుడి స్థాయి నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరికీ స్వేచ్ఛ లేకుండా జగన్‌రెడ్డి పాలన సాగింది. అప్పట్లో ఎవరైనా స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుకోగలిగారా? జగన్‌రెడ్డి సొంత మనుషులు, కలెక్షన్ ఏజెంట్లు కూడా ఫోన్లలో స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగారా? లేదే! 'మీరు ఎవరెవరితో మాట్లాడేదీ, మీకు వచ్చే మెసేజులు అన్నీ నాకు తెలుస్తాయి' అని తన అంతరంగికులలో ఒకరిని జగన్‌రెడ్డి హెచ్చరించడం నిజం కాదా? ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉన్నది, ఎలా ఉండబోతున్నది అన్న విషయం పక్కన పెడితే... ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు. ఫేస్ టైం, సిగ్నల్ వంటి యాప్‌ల అవసరం లేకుండా ఫోన్లలో మామూలుగా మాట్లాడుకోగలుగుతున్నారు. ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా సాగించిన పాలన కూడా పాలన అవుతుందా? కాదు.. కాజాలదు!

నక్సల్ సమస్యకు పరిష్కారమెలా?

> నక్సలైట్లను పెద్ద ఎత్తున నిర్మూలించినంత మాత్రాన మావోయిస్టు తీవ్రవాదం మూలమట్టుగా అంతమవదు. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలలో రెండునెలల పాటు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలించాలి. నక్సలైట్ నాయకులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలి. ఇది మాత్రమే నక్సల్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఖాయం చేస్తుంది.

నక్సలైట్లపై పోరులో తన విజయాలను కేంద్రం ఇటీవల చాలా బిగ్గరగా ప్రకటిస్తోంది. కర్కశంగా మాట్లాడుతోంది. యుద్ధ సమాప్తికి చేరువయ్యామని కూడా గట్టిగా చెప్పుతోంది. హతులు, అరెస్టయినవారు, లొంగిపోయినవారి విషయమై కేంద్రం ఏకరువుపెడుతున్న గణాంకాలు ఉత్తేజకరంగా ఉన్నప్పటికీ నక్సలైట్ సమస్యను అవి పరిష్కరించగలవా అన్నది ప్రశ్నార్థకమే.

ఈ నెల 7న నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో 85 శాతం వామపక్ష తీవ్రవాదులను, మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు 14 మందిని నిర్మూలించామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటికే 237 మంది మావోయిస్టులు హతమయ్యారని, 812 మందిని అరెస్ట్ చేశామని, 732 మంది లొంగిపోయారని ఆయన తెలిపారు నక్సలైట్ల హింసాకాండ 2014–24 సంవత్సరాల మధ్య, 2004–14 సంవత్సరాల మధ్య కాలంతో పోలిస్తే 53 శాతం తగ్గిందని అమిత్ షా చెప్పారు.

నక్సలైట్ల ఉద్యమం కచ్చితంగా వెనుకంజలో పడింది. అక్టోబర్ 4న బస్తర్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టు కార్యకర్తలు హతమవడం వారికి కోలుకోని నష్టమే. మార్చి 2026 నాటికల్లా మావోయిస్టు తీవ్రవాద కంటక భూతం నుంచి దేశాన్ని విముక్తం చేస్తామని కేంద్ర హోం మంత్రి తెలిపారు. 2010లోను, అప్పటి కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం నక్సలైట్ల సమస్యను రాబోయే మూడేళ్లలో అధిగమించగలుగుతామని చెప్పడం గమనార్హం. చిదంబరం తడబడిన చోట అమిత్ షా సఫలమవుతారా? ఏ పరిస్థితులు నక్సలైట్ల ప్రభావ ప్రాబల్యాలకు కారణమవుతున్నాయనే విషయమై సమగ్ర అవగాహన కొరవడిన దృష్ట్యా పై ప్రశ్నకు ఇదమిత్థమైన సమాధానమివ్వడం కష్టం.

గత ఆగస్టు 24న నక్సలైట్ల ప్రభావిత రాష్ట్రాల సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ వామపక్ష తీవ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా తడిచిపెట్టాల్సిన సమయమాసన్నమయిందని అన్నారు. దృఢ సంకల్పం ప్రశస్తమే కాని మన సొంత ప్రజలతో కనికరం లేని రీతిలో వ్యవహరించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. వామపక్ష తీవ్రవాదాన్ని చావుదెబ్బ తీయడంలో సఫలమయినట్టు భారత రాజ్య వ్యవస్థ ఇంతకు ముందు రెండుసార్లు విశ్వసించింది. తొలుత 1972లో చారు మజుందార్ మరణించిన తరువాత, రెండోసారి 1990ల నడిమి కాలంలో కొండపల్లి సీతారామయ్య నాయకత్వం బలహీనపడిన తరువాత. అయితే ఈ రెండు సందర్భాలలోను నక్సలైట్ ఉద్యమం మరింత శక్తితో, మరింత చురుగ్గా పునర్ విజృంభించింది.

ఒక సంక్లిష్ట సమస్య పట్ల మన దృక్పథంలోని మౌలిక లోపాలను అక్టోబర్ 7 సమావేశం బయల్పరిచింది. సత్వర సత్ఫలితాలను సాధించేందుకు కేంద్ర హోం శాఖ భద్రతా దళాలపై పెద్ద ఎత్తున ఆధారపడుతోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్) తనకు అప్పగించిన బాధ్యత నిర్వహణలో సమర్థంగా పనిచేస్తోంది. అయితే ఆ భద్రతా దళాలు చేయగలిగేదానికి ఒక పరిమితి ఉన్నది. భద్రతాదళాలు ఒకసారి ఒక ప్రాంతంలో నక్సల్స్‌ను ఏరిపారేసిన తరువాత, అక్కడి గిరిజనుల జీవితాలను మెరుగుపరిచే సదుపాయాలను అభివృద్ధిపరచడం ప్రభుత్వ బాధ్యత. దురదృష్టవశాత్తు ఇదే జరగడం లేదు. ఫలితంగా ఆ ప్రాంతాలను నక్సలైట్లు పునరాక్రమించుకుంటున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు అవసరమయిందేమిటి? సమస్య పరిష్కారానికి సమస్త ప్రభుత్వ విభాగాల సమష్టి సమన్వయ కృషి (హోల్ ఆఫ్ గవర్నమెంట్ అప్రోచ్). సరిగ్గా ఇవే కనిపించడం లేదు. మరో ముఖ్య లోపం రాష్ట్ర పోలీసు దళాలు సిఆర్‌పిఎఫ్‌కు సహాయక పాత్ర మాత్రమే వహించడం. అలా కాకుండా నక్సలైట్ల వ్యతిరేక పోరులో రాష్ట్ర పోలీసులు అగ్రస్థానంలో ఉండాలి. రాష్ట్ర పోలీసులు భూమి పుత్రులు. తాము పనిచేస్తున్న ప్రాంతం పట్ల వారికి సమగ్ర అవగాహన ఉంటుంది. అలాగే అక్కడి ప్రజల గురించి కూడా. కనుక నక్సల్ వ్యతిరేక పోరాటాలు ప్రారంభించేందుకు వారు మెరుగైన యోగ్యతలు కలిగివుంటారు. అయితే రాష్ట్రాల ప్రతినిధులు మరిన్ని కేంద్ర భద్రతా దళాలు కావాలని అభ్యర్థించడం నిరుత్సాహం కలిగిస్తోంది.

అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. ఇక్కడ ఒక హెచ్చరిక చేయవలసిన అవసరం ఉన్నది. అభివృద్ధి అనేది గిరిజనులకు మౌలిక అవసరాలు తీర్చుతూనే వారి సంప్రదాయ జీవనశైలిని చిందరవందర చేయకూడదు. ఇది చాలా ముఖ్యం. స్థానిక హస్తకళలను ప్రోత్సహించాలి. గిరిజన కళలు, సంస్కృతి, భాషలను అభివృద్ధిపరచాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పవచ్చు. అయితే అడవుల విధ్వంసానికి, ఆదివాసీలు నిర్వాసితులు కావడానికి దారితీసే మెగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని అనుమతించకూడదు. ఆ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీలు తమ భూములను కోల్పోవలసివస్తుంది. భూముల నుంచి దూరమయిన ఆదివాసులు అశాంతికి లోనవుతారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం ఏప్రిల్ 1, 2018 – మార్చి 31, 2023 మధ్య 88,903 హెక్టార్ల అటవీ భూమి అటవీయేతర ప్రయోజనాలకు మళ్లించబడింది. భూమిని కోల్పోవడమనేది గిరిజనులకు చాలా బాధాకరమైన విషయం. 'గిరిజనులు పూర్తిగా అలసిపోయారు, నిరుపేదలుగా కునారిల్లుతున్నారు, తీవ్ర మనోవ్యాకులతకు గురవుతున్నారు' అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక ఒకటి పేర్కొంది.



నక్సలైట్ల సమస్య గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర స్థాయిలో ఉన్నది. ఈ హింసాకాండ, రక్తపంకిల చరిత్ర అంతమవ్వాలని అందరూ ఆశిస్తున్నారు. అయితే నక్సలైట్లను అంతమొందించడం ద్వారా మీరు ఆ సమస్యను పరిష్కరించలేరు. నిజానికి అటువంటి చర్యలు ప్రతికూల ఫలితాలనే ఇస్తాయి. దాదాపుగా ప్రతి నక్సలైట్‌కూ రాజ్యవ్యవస్థపై తీవ్ర అసంతృప్తి ఉన్నది. నక్సల్స్‌ను రాజ్యం అనేక ఇక్కట్లపాలు చేస్తోంది. వివక్ష, వేధింపుల, దోపిడీల గాథ అది. ఆ దురాగతాలను ప్రతిఘటించకుండా వారు ఎలా ఉంటారు. మార్గాంతరమేమిటి? పాత ఆలోచనా రీతులను విడనాడి కొత్త పద్ధతులలో ఆలోచించాలి. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలలో రెండునెలల పాటు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలించాలి. లొంగిపోవాల్సిందిగా నక్సల్స్‌కు విజ్ఞప్తి చేయాలి. లొంగిపోయినవారికి కేసుల నుంచి రక్షణ కల్పించి, వారి పునరావాసానికి పూర్తిగా తోడ్పడతామని అభయమివ్వాలి, అదే సమయంలో నక్సలైట్ నాయకులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. వారి ఇబ్బందులు, వ్యధలను సావధానంగా వినాలి. వాటిని వీలైనంతవరకు పరిష్కరించాలి, ప్రధానస్రవంతిలో కలిసిపోవాలని వారికి నచ్చజెప్పాలి. ఇటువంటి దృక్పథంతో వ్యవహరించినప్పుడు, బహుశా నక్సలైట్ల సంఖ్య తగ్గేందుకు అవకాశమున్నది. సాయుధ చర్యల కంటే ఆ మానవీయ పద్ధతే నక్సల్ ప్రభావం తగ్గేందుకు తోడ్పడుతుంది. ఎంతో రక్తపాతం జరిగింది, ఇంకా జరుగుతోంది. రాజ్య వ్యవస్థ కాఠిన్యం నుంచి నక్సలైట్లకు ఉపశమనం కలిగించాలి. వారి మనస్సులు, హృదయాలు గెలుచుకోవాలి. అది మాత్రమే నక్సల్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఖాయం చేస్తుంది.



■ ప్రకాష్ సింగ్
సరిహద్దు భద్రతా దళాల మాజీ డైరెక్టర్ జనరల్

(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యం)







కృష్ణా తీరంలో డ్రోన్ షో

22, 23 తేదీల్లో డ్రోన్ సమ్మిట్‌కు ఏర్పాట్లు

పున్నమి ఘాట్‌లో 5 వేల డ్రోన్లతో ఇల్యూమినేటెడ్ ప్రదర్శన

- ఆకాశంలో అద్భుత చిత్రాల ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ
- వీటితో పాటు వీ అన్‌బీటబుల్ డాన్స్ షో
- కృష్ణానదిని కప్పేసేలా లేజర్ షో

ఏర్పాట్లు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్, సీపీ

8

కళ్లు మిరుమిట్లు గొలిపే డ్రోన్ షోకు బెజవాడ వేదిక కానుంది. ఐదేళ్ల తర్వాత బెజవాడలో మళ్లీ నగరవాసులకు మంచి వినోదాన్ని పంచే ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ జరగబోతోంది. ఈ నెల 22న పున్నమి ఘాట్ వేదికగా జరిగే డ్రోన్ షోకు అందరూ ఆహ్వానితులే! కృష్ణమ్మ చెంతన భారీ ఎత్తున నిర్వహించే 'డ్రోన్ షో' గతంలో జరిగిన ఈవెంట్ల కంటే సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలవనుంది. ఒకటూ రెండా ఐదు వేల డ్రోన్లు ఆకాశంలో చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఇల్యూమినేటెడ్ వెలుగు జిలుగులతో ఆకాశంలో ఛాయాచిత్రాలను ఆవిష్కరించనుంది. అంతర్జాతీయ టాప్ షోలలో డ్రోన్ షో ఇప్పుడు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్ షోలలో విజయవాడ ఈవెంట్ కూడా ఒకటి కాబోతోంది. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ నెల 22, 23 తేదీల్లో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో డ్రోన్ షోను కృష్ణాతీరంలో నిర్వహిస్తున్నారు.

క్లాప్ బంద్!

నగరాలు, పట్టణాల్లో నిలిచిన చెత్తసేకరణ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 300కుపైగా క్లాప్ వాహనాలు

నిర్వహణ, సిబ్బంది జీతాల బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి

- మూడు నెలలుగా జీతాలు చెల్లించని ఏజెన్సీ
- విధులు బహిష్కరించిన క్లాప్ వాహన డ్రైవర్లు
- వారం రోజులుగా ఇంటింటి చెత్త సేకరణ బంద్
- పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్త

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు ఉపయోగించే క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలు నిలిచిపోయాయి. క్లాప్ వాహన సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. ఫలితంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని నగరాలు, పట్టణాల్లో చెత్త సేకరణ నిలిచిపోయింది. అసలే డయేరియా భయంతో వణుకుతున్న ప్రజలకు చెత్తసేకరణ నిలిచిపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది.


(విజయవాడ - ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సీఎన్‌జీ వాహనాలను కేటాయించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 225 వాహనాలు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు 42 వాహనాలు, గుడివాడ మున్సిపాలిటీకి 31 వాహనాలు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీకి 42 వాహనాలు కేటాయించారు. ఈ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించేవారు. ఈ వాహన డ్రైవర్లకు జీతాల చెల్లింపు.. వాహనాల నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు ఏజెన్సీకి కట్టబెట్టారు. క్లాప్ డ్రైవర్‌కు రూ.18,500 చొప్పున ప్రభుత్వం ఈ ఏజెన్సీకి చెల్లిస్తుంది. అయితే ఏజెన్సీ వారు మాత్రం డ్రైవర్లకు రూ.12,000 మాత్రమే చెల్లిస్తున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి తమకు బిల్లులు రాలేదంటూ ఏజెన్సీ వారు డ్రైవర్లకు జీతాల చెల్లింపును నిలిపివేశారు. 365 రోజులు పనిచేస్తున్నా జీతాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ క్లాప్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళనబాట పట్టారు. దీంతో గత వారం రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయింది.



వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో రోడ్డుపైన పేరుకుపోయిన చెత్త

ఎక్కడ చూసినా చెత్తే

విజయవాడ కార్పొరేషన్‌లో 225 వాహనాల నిర్వహణ, జీతాలకు ప్రతినెలా రూ.1.28 కోట్లు ఏజెన్సీకి చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ మిగతా 6లో..



మళ్లీ భారీగా వరద

ఎగువ నుంచి 84,297 క్యూసెక్కుల నీరు రాక

- సముద్రంలోకి 77,750 క్యూసెక్కులు

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజ్‌కు మళ్లీ వరద ప్రవాహం మొదలైంది. ఎగువ నుంచి 84,297 క్యూసెక్కుల నీరు వస్తోంది. సెప్టెంబరు ఒకటో తేదీన ప్రకాశం బ్యారేజ్‌కి రికార్డు స్థాయిలు 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 40 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతూనే ఉంది. శనివారం ఒక్కసారిగా ఇది మరింతగా పెరిగింది. పులిచింతల నుంచి 84,237 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజ్ 40 గేట్లను రెండు అడుగులు, 30 గేట్లను ఒక అడుగు మేరకు ఎత్తి 77,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 4,028, కేడబ్ల్యూకి 2,519, కాల్వలకు 6,547 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

వరద ప్రవాహం పెరగడంతో వీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద సంబంధిత ఫిర్యాదుల కోసం వీఎంసీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర అధికారులతో సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పెరుగుతున్న వరదల నేపథ్యంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

సూరీడే తగలని చిరు ప్రాయం



8లో



రాజధాని అమరావతి మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ తదితరులు

అమరావతికి మళ్లీ అంకురార్పణ

రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

- శాస్త్రోక్తంగా పూజలతో రాయపూడి వద్ద పనుల ప్రారంభం
- రైతుల హర్షధ్వానాల మధ్య సీఎం చంద్రబాబు భూమిపూజ
- మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేసింది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన ఐదో నెలలోనే తిరిగి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అడివిలా మార్చిన రాజధాని ప్రాంతంలో తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు రాజధాని అంతటా పర్యటించారు. నిలిచిపోయిన పనులను పరిశీలించి వాటిని ఎలా తిరిగి పట్టాలెక్కించాలనే దానిపై అవగాహనకు వచ్చారు. మరోవైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ అమరావతిలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి బాటలు వేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమరావతి పనులు ప్రారంభిస్తారని రాజధాని ప్రాంత ప్రజలే కాకుండా రాష్ట్రమంతటా ఎదురు చూస్తున్న క్రమంలో శనివారం సీఎం చంద్రబాబు అమరావతి పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. ప్రజల హర్షధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా పూజలతో రాజధాని పనులను ప్రారంభించారు. రాయపూడి వద్ద జీ ప్లస్ 7 విధానంలో నిర్మించతలపెట్టిన సీఆర్డీయే కార్యాలయం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోగా దాని నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు పునః ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. అమరావతిలో రూ.160 కోట్లతో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తున్నామని దీనిని 121వ రోజున ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానన్నారు. రైతులకు కౌలు పెండింగ్ నిధులు 170 కోట్లు ఇచ్చామని, రూ.225 కోట్లు త్వరలో ఇస్తామన్నారు. రాజధాని ఉద్యమ సమయంలో ఇక్కడి మహిళలు రాణీరుద్రమ దేవిలా పోరాడారన్నారు. 1,631 రోజులు పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారని చంద్రబాబు తెలిపారు. విధ్వంసం పోయింది.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ పాల్గొన్నారు.

రైల్వేలో కీచకపర్వం!

- డివిజినల్ పర్సనల్ కార్యాలయ అధికారిపై రైల్వే జీఎంకు మహిళా ఉద్యోగి ఫిర్యాదు
- ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని కలిసి కన్నీటిపర్యంతమైన బాధితురాలు
- రైల్వే జీఎంతో మాట్లాడిన పురందేశ్వరి.. విచారణకు ఆదేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే డివిజినల్ పర్సనల్ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి లైంగికంగా వేధిస్తున్నట్లు ఓ మహిళా ఉద్యోగి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడం పెనుసంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. డివిజినల్ పర్సనల్ ఆఫీసులో బిల్స్ సెక్షన్‌లో ఓఎస్‌గా పనిచేసే మహిళా ఉద్యోగిని ఈ నెల 15న డీపీఓ ఆదేశాల మేరకు బాపట్లకు బదిలీ చేశారు. దీనికి ఒక రోజు ముందు ఆమెకు డీపీఓ కార్యాలయం నుంచి షోకాజు నోటీసు అందింది. సర్‌ప్రైజ్ తనిఖీలలో భాగంగా విధి నిర్వహణ సమయంలో ఆమె కార్యాలయంలో లేనందున రైల్వే సర్వీస్ రూల్స్ ప్రకారం ఈ షోకాజు నోటీసును జారీ చేసినట్లు పేర్కొన్నారు. షోకాజు నోటీసులో ఆ ఉద్యోగిని వివరణ ఇవ్వటానికి ఏడు రోజుల సమయం ఇచ్చారు. ఉద్యోగిని వివరణ ఇచ్చిన తర్వాత.. ఆమె వివరణ మిగతా 6లో..





అమరవీరుల సంస్మరణ దినం చురుగ్గా ఏర్పాట్లు

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 21న అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించడానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వీటిని డీజీపీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు శనివారం పరిశీలించారు. పటిష్ట భద్రత, ట్రాఫిక్ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఐజీలు శ్రీకాంత్, రాజకుమారి, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీఐజీ అమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



ఇసుక రీచ్



తీర గ్రామాల్లో ఇసుక పండుగ

ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఉచితంగా తీసుకెళ్లమనడంపై సర్వత్రా హర్షం

రీచ్‌ల నుంచి ఎద్దుల బండ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా ఉచితంగా ఇసుక తీసుకువెళ్లేందుకు సీఎం చంద్రబాబు అనుమతి ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం సాహసోపేత నిర్ణయంతో అందరికీ ఇసుక తక్కువ ధరకు అందుబాటులోకి రానుంది. సామాన్యుల గృహ నిర్మాణ కష్టాలు తీరడంతో పాటు కూలీల ఉపాధికి ఇక ఢోకా ఉండదని తెలిసి తీర గ్రామాల్లో ప్రజలు ఇసుక పండుగ జరుపు కుంటున్నారు.

- సీఎం చంద్రబాబు సాహసోపేత నిర్ణయానికి కృతజ్ఞతలు
- ఎన్టీఆర్ జిల్లా నందిగామ డివిజన్‌లో పుష్కలంగా ఇసుక నిల్వలు
- తీరనున్న సామాన్యుల ఇంటి నిర్మాణ కష్టాలు

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల) : ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదితో పాటుగా పాలేరు, వైరాయేరు, కట్లేరు, మునేరు ప్రవహిస్తుండటంతో ఇసుకకు ఎలాంటి కొరత లేదు. అయినప్పటికీ తీర గ్రామాల్లో ఇసుక మిగతా 6లో..



వైద్యశిబిరానికి వచ్చిన పేదలను ఆప్యాయంగా పలకరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆరోగ్య భారత్ సాకారమవ్వాలి

» వైద్యసేవలు అందరికీ అందుబాటులో ఉండాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'గ్రామీణప్రాంతాల్లో తక్కువ ధరకే మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ వైద్యసంస్థలు, సేవా సంస్థలు దృష్టి సారించాలి. వైద్యఖర్చుల భరించలేమని పేదలు, మధ్యతరగతి ప్రజలు భయపడే పరిస్థితి రాకూడదు. పేదరికం, వివక్షతకు తావులేని ఆరోగ్య భారత్ సాకారం కావాలి.' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)ప్రాంగణంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, అకిరా కంటి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వర్ణభారత్‌ట్రస్ట్ స్థాపించిన నాటినుంచి ఇప్పటివరకు 48ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి 15వేలమందికి పైగా పేదలకు వైద్యసేవలందించిందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ట్రస్ట్ తరఫున సేవలు కొనసాగిస్తామన్నారు. శిబిరానికి విచ్చేసిన రోగులను ఆప్యాయంగా పలకరించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి వెస్ట్ ప్రయాగ్‌రాజ్, ఎమ్మెల్యే సిద్ధార్థనాథ్‌సింగ్, స్వర్ణభారత్‌ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, ట్రస్ట్‌సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఒప్పందం

ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో ఫార్మా రంగంలో నైపుణ్యాభివృద్ధి, వ్యాక్సిన్, వైద్య ఉపకరణాల తయారీపై శిక్షణ త్వరలో అందుబాటులోకి రానుంది. శనివారం సువెన్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ), స్వర్ణభారత్‌ట్రస్ట్‌ల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సమక్షంలో ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, ఈడీ పరదేశి, ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ సీఈవో గౌతమ్ భట్టాచార్య, సువేన్ ఫార్మాకంపెనీ కార్యదర్శి కుందన్‌కుమార్‌ఝాలు సంతకాలు చేశారు.



ఎన్జీవో నగర శాఖ కార్యదర్శి ఇ.సాగర్‌ను అభినందిస్తున్న ఎ.విద్యాసాగర్ తదితరులు

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

» ఏపీ ఎన్జీవోస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన విజయవాడ నగర శాఖ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. జేఏసీ, ఎన్జీవో సంఘం పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ఒకరోజు వేతనం రూ.120 కోట్లు ఇచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్క ఉద్యోగిని అభినందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తి అలసత్వం వహించిందన్నారు. ఆరు విడతల కరువుభత్యం బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోగా, ఉద్యోగుల జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ ఖాతాల్లో దాచుకున్న సొమ్మును కూడా ఇవ్వలేదన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ చెల్లింపులు లేవని, గత ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లకు పైగా ఉద్యోగులకు బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఆందోళన చేస్తున్న వారిపై నాలుగువేల కేసులు బనాయించిందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని పరిశీలించి ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం ఒకటో తారీఖునే జీతాలు, పెన్షన్లు చెల్లించటం హర్షదాయకమన్నారు. పీఆర్సీ నివేదికను త్వరగా వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరతామని తెలిపారు. ఈలోపు మధ్యంతర భృతిని చెల్లించాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. పదోన్నతి వలన ఖాళీ అయిన కార్యదర్శి పదవికి కో-ఆప్షన్ నిర్వహించి ఐటీఐ కళాశాలకు చెందిన ఇ.సాగర్‌ను ఎంపిక చేశారు. సాగర్‌ను నాయకులు సత్కరించారు. నగర శాఖ అధ్యక్షుడు సి.హెచ్.వి.ఆర్.ప్రసాద్, అసోసియేషన్ నాయకులు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, ఐటీఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేష్ పాల్గొన్నారు.

రూ. కోటి టోకరా కేసులో...

వైసీపీ నేత సహా ముగ్గురిపై కేసు

విద్యాధరపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు, స్థలాలు ఇప్పిస్తామని చెప్పి కోటి రూపాయలకు పైగా మోసం చేసిన వైసీపీ నాయకుడు షేక్ అహ్మద్‌తో పాటు లాయర్ టి.వెంకట రమణరావు, అతని అసిస్టెంట్ కిషోర్‌పై శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా న్యూజెండ్ల మండలం, జంగాలపల్లికి చెందిన లింగం సరళాదేవి స్థానికంగా అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఈమెకు ఏలూరు జిల్లా, పాతూరులో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న జెల్లూరి రామలక్ష్మితో అయిదేళ్ల నుంచి పరిచయం ఉంది. 2022 సెప్టెంబరులో రామలక్ష్మి తనకు విజయవాడకు చెందిన వైసీపీ నాయకుడు షేక్ అహ్మద్‌తో ఓ వివాహ వేడుకలో పరిచయమైందని, అహ్మద్‌కు రాజకీయ పలుకుబడి ఉండటంతో జిల్లా కోర్టులో జాబులు ఇప్పిస్తానని సరళాదేవికి తెలిపింది. దీంతో వారిద్దరూ విజయవాడ వచ్చి అహ్మద్ ద్వారా లాయర్ టి.వి.రమణరావును, అతని అసిస్టెంట్ కిషోర్‌ను కలిసి ఉద్యోగ వివరాలు తెలుసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.12 లక్షలు, క్లర్క్ పోస్టుకు రూ.10 లక్షలు చెల్లిస్తే జాబులు వస్తాయని బాధితులకు నమ్మకంగా తెలిపారు. వారి ఒప్పందం ప్రకారం సరళాదేవి రూ.5 లక్షలు, రామలక్ష్మి రూ.5 లక్షలు చెల్లించి మిగిలిన డబ్బులు ఉద్యోగాలు వచ్చాక చెల్లిస్తామన్నారు. జిల్లా కోర్టులో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యాక దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదని, నేరుగా ఉద్యోగాలు వస్తాయని నమ్మబలికారు. అందులో భాగంగా సరళాదేవి నుంచి రూ.5 లక్షలు, రామలక్ష్మికి జాబుతో పాటు ఆమె భర్తకు విజయవాడలో చికెన్ షాపు ఏర్పాటు చేయిస్తామని వారి వద్ద నుంచి మొత్తం రూ.22,50,000 అహ్మద్ తీసుకున్నాడు. 2023 నవంబరులో బాధితురాలు రామలక్ష్మి, ఆమె కుమారుడికి జూనియర్ అసి స్టెంట్ ఉద్యోగాలు వచ్చినట్లుగా అహ్మద్ ఓ సెల్‌ఫోన్ నుంచి బాధితులకు ఆర్డర్ పత్రాన్ని వాట్సాప్‌లో పంపించి, మిగిలిన డబ్బులు కూడా పంపించాలని మెసేజ్ పెట్టాడు. దీంతో బాధితులు వేర్వేరుగా రూ.5,50,000 అహ్మద్ భార్య బ్యాంక్ అకౌంట్‌కు పంపించారు. రామలక్ష్మి తన కుమారుడు ఉద్యోగ నిమిత్తం రూ.14 లక్షలు అహ్మద్ బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్ ఫర్ చేసింది. చికెన్‌షాపు కోసం రామలక్ష్మి మరో రూ.16 లక్షలు అహ్మద్ భార్య ఫోన్‌పేకి, రూ.8 లక్షల నగదును కుమ్మరిపాలెం సెంటర్‌లో ఉం టున్న అహ్మద్ ఇంటికి వెళ్లి ఇచ్చారు. అహ్మద్ చెప్పినట్టుగానే రామలక్ష్మి, ఆమె భర్త విజయవాడలో చికెన్ షాపు పెట్టటానికి భవానీపురం వచ్చి ఉం టున్నారు. ఉద్యోగాలు, చికెన్ షాపు ఏర్పాటు చేయించకపోవటంతో పలుసార్లు అహ్మద్, వెంకట రమణరావు, కిషోర్‌ను అడిగితే కాలయాపన చేస్తున్నారు. గట్టిగా ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో సరళాదేవి తమను మోసంచేసిన ముగ్గురిపై పోలీసులకు ఫిర్యాదుచేసింది.



వలివర్తిపాడు-మల్లాయిపాలెం మధ్య గుర్రపు డెక్కతో పూడుకుపోయిన పంటకాలువ

పేరుకే.. పంట కాలువ!

* గుర్రపు డెక్క, ఇంగ్లీషు గడ్డితో పూడిక
* కాలువలో కలుస్తున్న మురుగునీరు
* ఆక్రమణలతో బోదెలా మారిన వైనం
* అధికారులు పట్టించుకోవడం లేదంటున్న రైతులు

వర్షాకాలంలోనూ సాగుకు నీరందక వలివర్తిపాడు రైతుల అవస్థలు

వందలాది ఎకరాలకు సాగు నీరందించే వలివర్తిపాడు పంట కాలువ పూడుకుపోయింది. గృహాలు, ఫ్యాక్టరీల నుంచి వదిలే మురికి నీటితో కలుషితమైపోయింది. పూడిక, వ్యర్థాల పారబోత కారణంగా వర్షాకాలంలోనూ సాగునీరందక కాలువ కింద పొలాలు సాగుచేస్తున్న రైతాంగం సతమతమైపోతోంది. సాగు అవసరాలకే కాకుండా, తాగునీటి కోసమూ వినియోగించే ఈ కాలువలో మురుగు నీటి కారణంగా గ్రామ ప్రజానీకం ఇబ్బంది పడుతోంది. పూడిక తొలగించాలని అధికారులను కోరుతోంది.

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

గుడివాడ పక్క నుంచి మల్లాయిపాలెం, వలివర్తిపాడు, మెరకగూడేనికి వెళ్లే వలివర్తిపాడు పంట కాలువ గుర్రపు డెక్క, తూడు, ఇంగ్లీష్ గడ్డితో పూడుకుపోయింది. గుడివాడ మునిసిపాలిటీ, గ్రామాలు, ఫ్యాక్టరీల నుంచి వచ్చే మురుగు వదలడంతో పంట కాలువలోకి మురుగునీరు చేరుతోంది. కాలువలో వ్యర్థాలు పారబోయడం, పూడిక కారణంగా వర్షాకాలంలోనూ నీరు పారక సాగుకు పెట్టుకోలేని దుస్థితి రైతులకు దాపురించింది. సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆయకట్టు రైతాంగం వాపోతోంది.

రెండు వైపులా ఆక్రమణలు

కాలువ గట్లను రెండు వైపులా ఆక్రమించేశారని, పెద్ద కాలువ చిన్న పంట బోదెలా మారిపోయిందని రైతులు చెబుతున్నారు. నీటి పారుదల లేక వందలాది ఎకరాలకు నీరందక ఇబ్బంది పడుతున్నామని, అధికారులు కాలువలో తూడు, గుర్రపుడెక్క, ఆక్రమణలు తొలగించాలని వారు కోరుతున్నారు.



వలివర్తిపాడు వద్ద కాలువలో మురుగునీరు, ఇంగ్లీష్ గడ్డి

దోమలు విజృంభిస్తున్నాయి



పంట కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. కనీసం ఇళ్ల దగ్గర ఉండలేని పరిస్థితి ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

- తోకల వెంకన్న, వలివర్తిపాడు

తాగునీటికీ ఇబ్బందులే..



గ్రామంలో తాగునీటి అవసరాలకు ఈ కాలువను ఉపయోగిస్తాం. మురుగు నీరు రావడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. గుర్రపుడెక్క, ఇంగ్లీష్ గడ్డి తొలగించాలి. మురుగునీరు రాకుండా చూడాలి.

- గుడివాడ దేవపాలన, వలివర్తిపాడు

అంచనాలు రూపొందించాం..త్వరలో పనులు

పంటకాలువ పూడికతీత పనులకు అంచనాలు రూపొందించాం. త్వరలోనే కాలువ మరమ్మతులు చేయిస్తాం. తాత్కాలికంగా కొంత భాగం చేయించాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- పవన్, ఇరిగేషన్ ఏఈ

జనసేనలో చేరిక

» జగ్గయ్యపేటలో నామమాత్రంగా విగిలిన వైసీపీ

» వైస్‌చైర్మన్ ప్రభాకర్ సహా 10 మంది కౌన్సిలర్లకు కండువా కప్పిన జనసేనాని

» అదేబాటలో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు



జనసేనలో చేరిన కౌన్సిలర్లతో సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట పురపాలకసంఘంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోల్పోయి నామమాత్రంగా విగిలిపోయింది. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో శనివారం మునిసిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌తో పాటు వైసీపీ కౌన్సిలర్లు కొలగాని రాము, కాశీ అనురాధ, కాటగాని శివకుమారి, తన్నీరు నాగమణి, సాదుపాటి రాజు, పాకాలపాటి సుందరమ్మ, మోరె సరస్వతి, షేక్ సిరాజున్ సత్తార్, పందుల రోశయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, చైతన్య శర్మలు డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఒక్కొక్కరికి పవన్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతు సామినేని ఉదయభాను క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, ఆయన మీద అచంచెల విశ్వాసంతోనే జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతు ఉదయభాను అడుగు జాడలలో పనిచేసి జనసేన బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

పాలకపక్షం నుంచి నామమాత్రంగా వైసీపీ

31 మంది కౌన్సిలర్లు ఉన్న పురపాలకసంఘంలో 18 మంది సభ్యులతో అధికారపక్షంగా ఉన్న వైసీపీ మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో పాటు ముగ్గురు కౌన్సిలర్లు పి.సీతారావమ్మ, గింజుపల్లి వెంకట్రావు, డి.రమాదేవిలు తెలుగుదేశం పార్టీలో గత సెప్టెంబరు 13న చేరటంతో వైసీపీ అధికారాన్ని కోల్పోయి, టీడీపీ పాలకపక్షంగా అవతరించింది. 13 మంది టీడీపీ సభ్యులకు నలుగురు తోడు కావటంతో టీడీపీ బలం 17 కాగా, వైసీపీ బలం 17 నుంచి 13కు పడిపోయింది. మిగిలిన 13 మందిలో 10 మంది జనసేనలో చేరగా, ఉదయభాను కుమారుడు వెంకటకృష్ణ ప్రసాద్‌తో కలుపుకొంటే 11 మంది జనసేన సభ్యులు అయ్యారు. వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్‌తో పాటు కౌన్సిలర్ వట్టెం మనోహర్ వైసీపీలో కొనసాగాలని నిర్ణయించారు. మొత్తంగా పురపాలకసంఘంలో జనసేన-టీడీపీ కూట మి బలం 29కు చేరింది. ఇద్దరు సభ్యులతో వైసీపీ నామమాత్రంగా మిగిలింది.

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్

కుర్చీ కోసం పోటాపోటీ

» టీడీపీ నేతల ముమ్మర ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ పదవి కోసం టీడీపీలో తీవ్ర పోటీ ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గస్థాయిలో నెంబరు-2 పదవి కావడంతో సీనియర్లు పోటీపడుతున్నారు. గతంలో జగ్గయ్యపేట ఏఎంసీ పరిధిలో జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలు ఉండేవి. పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని నియోజకవర్గపరిధి గ్రామాలు నందిగామ ఏఎంసీ పరిధిలో ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గం మొత్తాన్ని ఏఎంసీ పరిధిలోకి తెచ్చింది. దీంతో ఈ పదవికి ప్రాధాన్యం ఏర్పడింది. జగ్గయ్యపేట మండలం నుంచి సీనియర్ నేత, పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కొరారు సత్యనారాయణప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, తెలుగురైతు రాష్ట్ర అధికారప్రతి నిధిగా ఆయన పనిచేశారు. నియోజకవర్గ ముఖ్యనేతలతో పాటు, రాష్ట్రస్థాయి పరిచయాలు ఆయనకు కలిసి వస్తాయని భావిస్తున్నారు. టీడీపీ వత్సవాయి మండలాధ్యక్షుడు, వత్సవాయి మాజీ సర్పంచ్ వడ్లమూడి రాంబాబు పేరు కూడా వినిపిస్తోంది. టీడీపీ పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య కూడా రేసులో ఉన్నారని తెలుస్తోంది. పెనుగంచిప్రోలు మండలానికి రెండు దశాబ్దాలకు పైగా అధ్యక్షుడిగా ఉన్న తనకు పదవి ఇవ్వాలని, తమ మండలానికి ఈసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్టు సమాచారం.

గేదెలు మేపుతుండగా పిడుగుపడి..కాపరి మృతి

పెనుగంచిప్రోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ పశువుల కాపరి పొలంలోనే దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనగపాడులో శనివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలో కొద్దిసేపు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలో గేదె లు మేపుతున్న ధారావత్ బాలాజీ(51)పై పిడుగుపడడంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం

విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ హోంగార్డుల విభాగంలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలకు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హోంగార్డులు బడుగు నాగరాజు, మోతుకూరి వీరరాఘవయ్యలు అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం పనిచేశారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల సహాయ చెక్కులను కమిషనర్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు రాజశేఖర బాబు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు విభాగ ఆర్ఐ కె.సుధాకరరెడ్డి ఉన్నారు.

తీర గ్రామాల్లో ఇసుక పండుగ

(ఐదో పేజీ తరువాయి)

కోసం సామాన్యులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొన్ని అడుగుల దూరంలోనే ఇసుక ఉన్నప్పటికీ సవాలక్ష ఆంక్షలతో ఇసుక అందని ద్రాక్షగా తయారైంది. రూ.వేలకు వేలు చెల్లించేందుకు సిద్ధపడినప్పటికీ ఇసుక దొరకటం గగనమైంది. నిర్మాణ రంగం కుంటుపడటంతో కూలీలకు ఉపాధి దొరకని దుస్థితి నెలకొంది. పసిడిగా తయారైన ఇసుక దోపిడీపై శ్రద్ధ పెట్టిన వైసీపీ పాలకులు నిబంధనలు ఉల్లఘించి నదుల గర్భాలను యంత్రాలతో కొల్లగొటి సరిహద్దులు దాటించి అమ్ముకున్నారు. దీంతో స్థానికంగా ఇసుక అందుబాటులో లేకుండా పోయింది.

పేదల కష్టాలను చూసే ఉచిత ఇసుక విధానం

అయితే పేదలు, కూలీల కష్టాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సీఎం చంద్రబాబు గతంలో మాదిరిగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారు. ముందుగా స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను విక్రయించారు. రవాణా ఖర్చులు, సీనరేజీ, జీఎస్టీ, ఇతరత్రా పన్నులు కలిపి టన్ను రూ.290 ధర నిర్ణయించారు. స్టాక్ పాయింట్ల వద్ద నేతలు, అధికారులు కుమ్మక్కు కావడంతో ధర అందుబాటులో లేకుండా పోయింది. ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ బుకింగ్ ప్రవేశపెట్టినప్పటికీ వెసులుబాటు కలగలేదు. లారీకి కేవలం 20 టన్నులు మాత్రమే లోడింగ్ చేయటం వల్ల ఒకవైపు లారీ యజమానికి గిట్టుబాటు కాలేదు, మరోవైపు విజయవాడ, ఏలూరు ఇతర పట్టణాల్లో వినియోగదారులు అధిక ధర చెల్లించాల్సి వచ్చింది. మరోవైపు నేతల ఒత్తిళ్లతో ట్రాక్టర్లపై అధికారులు కొరడా ఝులిపించటం ప్రారంభించారు. వాల్టా కేసులు నమోదు చేశారు. ఉచిత ఇసుక విధానం వల్ల కూటమి ప్రభుత్వానికి తగినంత మైలేజీ రాకపోగా, ఎక్కడికక్కడ స్థానిక నేతల పెత్తనం వల్ల చెడ్డపేరు వచ్చే పరిస్థితి తలెత్తింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను వివిధ మార్గాల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు ఇసుక విషయంలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. రీచ్‌ల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చునని, ఈ విషయంలో అధికారులెవ్వరూ అడ్డగించవద్దని ఆదేశించారు. ఇసుక ట్రాక్టర్లపై కేసులు పెట్టిన అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ పార్టీ నేతలు అడ్డగించినా, ఉచిత విధానానికి తూట్లు పొడిచినా మొహమాటం లేకుండ కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం వల్ల అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆంక్షలు తొలగించటం వల్ల ఇక ఇసుక కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇక తక్కువ ధరకు ఇసుక లభ్యం

తీరగ్రామాలతో పాటు సమీప గ్రామాలు, పట్టణాల్లో ఇసుక తక్కువ ధరకు లభించనుంది. నిన్నటి వరకు నందిగామ, కంచికచర్లలో ట్రాక్టర్ ఇసుక రూ. 3 వేల నుంచి రూ. 3,500 పలికింది. ఒకవైపు ట్రాక్ట ర్లకు ఉచితం చేయటం, మరోవైపు సీనరేజ్, జీఎస్టీ కూడా తీసివేయటం వల్ల నిర్భయంగా ఇసుక తోలుకోవటానికి వీలు పడింది. ఇక నుంచి ట్రాక్టర్ ఇసుక వెయ్యి రూపాయలకు లభించనుంది. లారీలకు లోడిం గ్‌పై ఇంతకు ముందున్న పరిమితిని తొలగించారు. 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు లోడింగ్‌కు అనుమతి ఇస్తూనే ఓవర్ లోడ్ పెనాల్టీ విధించవద్దని సీఎం అధికారులను ఆదేశించటం వల్ల పట్టణాల్లో సైతం ఇసుక ధర భారీగా తగ్గనుంది.

కొందరు నేతల్లో అసహనం

సీఎం తీసుకున్న నిర్ణయంతో కొందరునేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల్లో చక్రంతిప్పే నేతలు ఇసుక రాబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రీచ్‌లను, స్టాక్ పాయింట్లను గుప్పిట్లో పెట్టుకుని అడ్డగోలుగా దోపిడీ చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీనిలో భాగంగానే రీచ్‌లలో తవ్వకాలు, రవాణా, లోడింగ్‌కు తక్కువ ధరలకు టెండర్లు వేయించారు. ట్రాక్టర్లకు ఉచితం చేయటంతో రాబడిపై ఆశలు పెట్టుకున్న నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

క్లాప్ బంద్!

(ఐదో పేజీ తరువాయి)

అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) చెల్లిస్తుంది. గత కొంతకాలంగా విజయవాడ, మచిలీపట్నం కార్పొరేషన్‌తోపాటు గుడివాడ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలోనూ చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వాహన డ్రైవర్లు విధులు బహిష్కరించారు. విజయవాడ నగరంలో 225 వాహనాల ద్వారా ప్రతిరోజూ సుమారు 300 టన్నుల చెత్తను సేకరించి తరలిస్తారు. మచిలీ పట్నంలో సుమారు 80 టన్నులు, గుడివాడ మున్సిపాలిటీలో 60 టన్నులు వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 30 టన్నుల వరకు చెత్తను సేకరి స్తారు. వారం రోజులుగా క్లాప్ వాహనాల డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో విజయవాడలోనే సుమారు 500 టన్నులు, మిగిలిన పట్టణాల్లో సుమారు 200 టన్నుల వరకు చెత్త పేరుకుపోయింది.

అసలే డయేరియా.. ఆపై చెత్త సమస్య

కొన్ని రోజుల క్రితం వరకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రజలను అల్లాడించింది. ఇప్పటికీ డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెత్త సేకరణ నిలిచిపోవడం.. ఇళ్లలో చెత్త పేరుకుపోవడంతో పాటు వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు తక్షణం స్పందించి చెత్తసేకరణ సమ స్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వీఎంసీలో 110 ట్రాక్టర్లు ఏర్పాటు

విజయవాడలో క్లాప్ డ్రైవర్ల ఆందోళన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం 110 ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. వీఎంసీ టిప్పర్లు, ట్రాక్టర్లతో నగరంలో చెత్త సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు చెప్పారు. అయితే మచిలీపట్నం కార్పొరేష న్‌తోపాటు తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి.

రైల్వేలో కీచకపర్వం!

(ఐదో పేజీ తరువాయి)

సంతృప్తికరంగా లేకపోతే ఆమెపై చర్యలు తీసుకోవాల్సిన డీపీఓ కార్యాలయ ఉన్నతాధికారి ఆ మరుసటి రోజునే ఆమెపై బదిలీ వేటు వేయటం గమనార్హం. గతంలో ఇదే ఆఫీసులోని మహిళా ఉద్యోగులు ఈ ఉన్నతాధికారి వేధింపులపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందు కంటే ఉన్నతాధికారి సోదరుడు ఎంపీ కావడంతో ఆయన ద్వారా రైల్వే బోర్డుపైనే ఒత్తిడి తీసుకువస్తుండటంతో డీఆర్ఎం వంటి స్థాయి అధికా రులే భయపడే పరిస్థితి వచ్చింది. ఈ ఉన్నతాధికారిపై గతంలో సికింద్రా బాద్‌లోనూ ఇలాంటి వేధింపుల ఆరోపణలు వచ్చాయి. విజయవాడ వచ్చిన తర్వాత కూడా ఇలాంటి ఆరోపణలు కొనసాగుతున్నాయి. కాగా, బీజేపీ ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని కలిసి బాధితురాలు కన్నీరు మున్నీ రైంది. ఆమె రైల్వే జీఎంతో మాట్లాడటంతో ఆయన సమగ్ర విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు శనివారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం శనీశ్వరస్వామి ఆలయం వెనుక కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేనందున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఒంటిపై బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సీపీఎం ధర్నా

రాణిగారితోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసేందుకు సిద్ధమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో 17వ డివిజన్ రాణిగారితోట సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంపు, అవినీతికి పాల్పడిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి తీసుకువస్తే ఇచ్చిన హామీని మరిచి ఈ ప్రభుత్వం చార్జీలు పెంచేందుకు సిద్ధమైందన్నారు. 2022-23 సంవత్సరంలో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు ప్రజల నుంచి వసూళ్ళకు పూనుకుంటుందని, గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో లాలూచీ పడి ఏవిధంగా విద్యుత్ భారాలు వేసిందో అదే తీరులో కూటమి ప్రభుత్వం కూడా ప్రజలపై భారాలు మోపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సాఫ్ట్‌స్కిల్స్, నైపుణ్యత పెంచుకోవాలి

విద్యార్థులకు వక్తల సూచన

మొగల్రాజపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఉద్యోగావకాశాలను సులువుగా అందిపుచ్చుకోవాలంటే సాఫ్ట్‌స్కిల్స్, సాంకేతిక నైపుణ్యత, మార్కెటింగ్ నైపుణ్యత అందిపుచ్చుకోవాలని వక్తలు సూచించారు. ఎంఎస్సీ, ఎంసీఏ కంప్యూటర్ సైన్సులో చేరిన విద్యార్థులకు డిగ్రీ నుంచి పీజీలో చేరినపుడు వచ్చే మార్పులను, విద్యావిధానం, పాఠ్యాంశాలపై అవగాహన సదస్సు పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

ఈ సదస్సులో ఐటీ వర్సిటీ ఇంక్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ గదిరాజు శ్రీదుర్గ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, క్వాలిటీ ఎష్యూరెన్స్‌ఎన్‌విడిగా గ్రాఫిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ రెమెల ప్రియాంక, ఎంఎస్సీ పూర్వ విద్యార్థి రెమెల సాయి మృదుల రేఖ మాట్లాడుతూ ఏడబ్ల్యూఎస్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగంలో ఉద్యోగావకాశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ రాజేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, కంప్యూటర్ సైన్స్ హెడ్ డాక్టర్ టీఎస్ రవికిరణ్, అధ్యాపకులు జి. సామ్రాట్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గదిరాజు శ్రీదుర్గ





దర్శిపేట ఐదురోడ్ల సెంటర్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న మురుగునీరు,రాజరాజేశ్వరి ఆలయం పక్కన ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు కాల్వ

ఇళ్ల మధ్య ఓపెన్ డ్రెయినేజీ

- తీవ్ర దుర్గంధంతో దర్శిపేట, అంబేడ్కర్‌నగర్ వాసుల అవస్థలు
- వర్షాకాలంలో వ్యాధులబారిన పడుతున్న వైనం
- ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం

(పటమట, ఆంధ్రజ్యోతి)

ఏళ్ల తరబడి అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో దర్శిపేట, అంబేడ్కర్‌నగర్ వాసులు ఓపెన్ డ్రెయినేజీతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏలూరు రోడ్డు సాయిబాబా గుడి నుంచి మొదలయ్యే మురుగునీటి ప్రవాహం నిర్మలా స్కూల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వెనుక నుంచి కృష్ణవేణి స్కూల్ వైపుగా దర్శిపేట నుంచి అంబేడ్కర్‌నగర్ వరకు ఇళ్ల మధ్య నుంచి ఓపెన్ డ్రెయినేజీ ప్రవహిస్తోంది. దీంతో తీవ్ర దుర్గంధంతో దర్శిపేట, అంబేడ్కర్‌నగర్ నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు.



అంబేడ్కర్‌నగర్ వద్ద బందర్‌కాల్వలో కలుస్తున్న ఓపెన్ డ్రెయినేజీ

మురుగునీటిని దర్శిపేట జంక్షన్ నుంచి పూజిత అపార్టుమెంట్ మీదుగా డీమార్టు వైపు నుంచి నేరుగా చేపల మార్కెట్ వద్ద బందర్‌రోడ్డు కాల్వలోకి కలపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీమార్టు వైపునకు మురుగుకాల్వ మళ్లింపునకు నిధులు మంజూరైనప్పటికీ, ఆ నిధులు అరకొరగా మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు ఎవరూ పనులు చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆ పనులు అటకెక్కాయి. ఐదురోడ్ల సెంటర్ దర్శిపేట నుంచి మురుగునీటి ప్రవాహం రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం పక్క నుంచి ఇళ్ల మధ్యగా ఎస్ఎస్ఎం స్కూల్ వెనుకగా అంబేడ్కర్‌నగర్ వాసుల ఇళ్ల నుంచి ప్రవహిస్తూ అంబేడ్కర్‌నగర్ చివర బందర్‌కాల్వలో కలుస్తుంది. మురుగునీరు ఇళ్ల మధ్య నుంచి ప్రవహించడం వలన అపరిశుభ్ర వాతావరణంలో నివసించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. మురుగునీటితో తీవ్రమైన దుర్గంధంతో పాటు వర్షాకాలం సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా ప్రబలి అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోరాటం చేస్తాం

ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగుకాల్వ మళ్లింపు కార్యక్రమం చేపట్టకపోతే ప్రజల పక్షాన దశలవారీగా పోరాటం చేస్తాం

లంక దుర్గారావు(సీఐటీయూ)

పరిష్కారానికి కృషి చేస్తాం

ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ తరఫు మా వంతు ప్రయత్నం శక్తివంచన లేకుండా చేస్తాం

పోతంశెట్టి నాగేశ్వరరావు
(బీజేపీ తూర్పు ఇన్‌ఛార్జి)

మొదటి దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే నివారించవచ్చు

కేన్సర్ వైద్య నిపుణులు సత్యశ్రీనివాస్

పటమట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మొదటి దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే చాలా వరకు నివారించవచ్చునని ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ వి సత్యశ్రీనివాస్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నాలుగు మరణాల్లో ఒక మరణం కేన్సర్ వల్ల జరుగుతుందన్నారు. శ్వాసకోశ కేన్సర్, గర్భాశయ ముఖ కేన్సర్, రొమ్ము కేన్సర్ ఎక్కువ మందిలో కనిపిస్తాయన్నారు. కేన్సర్ రావడానికి జన్యుపరంగా కొంతకారణం కాగా, ఇమ్యూనిటీ లేకపోవడం, కొన్ని రకాల రసాయనాలు, వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, జీవనశైలి ముఖ్యమైందన్నారు. దీర్ఘకాలికంగా ప్రేగుల పనితీరులో మార్పు కనబడితే, అసాధారమైన రక్తస్రావం జరుగుతుంటే, రొమ్ములో గడ్డలు కనబడుతుంటే, ముద్ద మింగడానికి ఇబ్బందిగా ఉంటే, గొంతులో దీర్ఘకాలికంగా మార్పు వస్తే కేన్సర్ అని అనుమానించి వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ముందు జాగ్రతగా ధూమపానం, మద్యపానం సేవించడం పనికిరావని, రోజూ వ్యాయామం చేయాలని, ఎక్కువ పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని, మానసికంగా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

విజయవాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి రైల్వే కోర్టు జరిమానా విధించింది. ఐదో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17మందిపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో శనివారం హాజరుపరిచారు. వారిలో ఐదుగురికి రూ.15వేలు, 12 మందికి రూ.10వేలు జరిమానా విధించారు.

రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎంకు అండగా ఉందాం

పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ చేసిన పాపాలను కడుగుతూ మరో వైపు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. 8వ డివిజన్ ఎస్‌బీఐ కాలనీ ఆచార్య రంగానగర్‌లో సుమారు రూ.12.50 లక్షలతో తీర్చిదిద్దిన పార్కును ఆయన శనివారం ప్రారంభించారు. అనారోగ్యానికి గురైన టిడిపి నాయకులు బొద్దూరి వీరారెడ్డికి వైద్యఖర్చుల నిమిత్తం రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో భవన నిర్మాణాలతో పాటు అమరావతిలో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయంటే చంద్రబాబు ఇసుక పాలసీ వల్లేనని చెప్పారు. అమరావతి అభివృద్ధి వల్ల యువత లక్షల సంఖ్యలో ఉద్యోగాలు పొందుతారని అన్నారు. అడగ్గానే పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు, ఎంపీ కేశినేని శివనాథ్‌కు కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మల్లెల రామకృష్ణ, లింగా కృష్ణశంకర్, వీరపనేని అరుణ, చెన్నుపాటి రామారావు, వల్లభనేని ప్రసాద్, అక్కినేని ప్రభాకర్‌రావు, అట్లూరి శ్రీనివాస్, వీరవల్లి సత్యనారాయణ, సూరపనేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



పార్కులో జిమ్ పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాళ్లు లేచి రోడ్డు అధ్వానం

ప్రమాదకరంగా ఉన్న గురునానక్‌నగర్ కాలనీ మెయిన్ రోడ్డు



భారతీనగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గురునానక్ నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో రాళ్లు లేచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. నాల్గవ డివిజన్ పరిధిలో గురునానక్ నగర్ కాలనీ ఉంది. ఈ రోడ్డు భారతీనగర్ కాలనీకి అనుసంధానంగా ఉంటుంది. దీంతో నిత్యం వాహనలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు నిర్మించి ఏళ్ల గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు రాళ్లు లేచి అధ్వానంగా మారాయి. వర్షా కాలం కావడంతో చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డులో నిలిచిపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని , అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చదరంగ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈనెల 22 నుంచి 27 వరకు నిర్వహించే భారతీయ నవీన క్రీడ ఉత్సవ్ ఫస్ట్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ ఫెస్టివల్-2024 పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఎమ్మెల్యే బొండా ఉమా నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన పోటీలు నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. టోర్నమెంట్ కన్వీనర్ రాజేంద్ర మాట్లాడుతూ చదరంగ పోటీలను రూ. 15 లక్షల నగదు బహుమతులతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఇప్పటికే మూడు దేశాల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు సమాచారం తెలిపారన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో బీఎస్‌కేయూ ఫౌండేషన్ సభ్యులు విత్తనాల కుమార్, నరేష్, ఉదయకుమార్ నాయుడు, టోర్నమెంట్ కన్వీనర్ ఎస్‌కె ఖాసీం పాల్గొన్నారు.

దుర్గగుడి కళావేదిక పై కూచిపూడి నృత్యం


వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని కళా వేదికపై శనివారం దువ్వి హేమచంద్రరావు ఆధ్వర్యంలోని బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. కళాకారుల బృందం చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. నాలుగు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు.

దర్శిపేటలో కుక్కల బెడద

(పటమట, ఆంధ్రజ్యోతి)

పటమట దర్శిపేట రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి ఆలయ పరిసరాల్లో కుక్కల గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా అరుస్తూ ఏడుస్తూ నిద్రాభంగం కలిగిస్తున్నాయి. అంతర్గతరోడ్ల మీద మలమూత్రాలు విసర్జిస్తున్నాయి. దీనికి తోడు ఇక్కడి కుక్కలు కొన్ని తీవ్రమైన చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాయి. కుక్కలపై చర్మం ఊడిపోయి శరీరం అంతా పుండ్లుగా ఏర్పడి, వాటి నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అర్ధరాత్రి సమయాల్లో భయంకరంగా ఏడుస్తూ స్థానికులకు తీవ్ర నిద్రాభంగం కలిగిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





22 23న కృష్ణా తీరంలో.. డ్రోన్ షో

పున్నమి ఘాట్‌లో 5వేల డ్రోన్లతో ఇల్యూమినేటెడ్ షో

కళ్లు మిరుమిట్లు గొలిపే డ్రోన్ షోకు నగరం వేదిక వుతోంది. ఐదేళ్ల తర్వాత నగరంలో మళ్లీ నగర వాసులకు మంచి వినోదాన్ని పంచే ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ జరగబోతోంది. ఈనెల 22న పున్నమిఘాట్ వేదికగా జరిగే ఈ డ్రోన్ షోకు అందరూ ఆహ్వాని తులే. కృష్ణమ్మ చెంతన భారీగా నిర్వహించే ఈ డ్రోన్ షో గతంలో జరిగిన ఈవెంట్ల కంటే కూడా సమ్‌థింగ్ స్పెషల్‌గానే ఉంటుంది.

\- ఆంధ్రజ్యోతి, విజయవాడ

- ఆకాశంలో వెలుగు జిలుగుల చిత్రాల ఆవిష్కరణ
- భారీగా సాంస్కృతిక ప్రదర్శనలు, వీ అన్‌బీటబుల్ డ్యాన్స్ షో
- కృష్ణా తీరంలో ముందే దీపావళి గ్రాండ్ ఫైర్ వర్క్స్ (బాణసంచా)
- చల్లని రాత్రిసమయంలో మ్యూజిక్ బ్యాండ్

ఒకటా రెండా 5 వేల డ్రోన్లు ఆకాశంలో చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఇల్యూమినిటేడ్ వెలుగు జిలుగులతో ఆకాశంలో చాయాచిత్రాలను ఆవిష్కరిస్తుంది. ఆకాశంలో ఈ డ్రోన్లు చేసే గ్రాఫిక్స్ కట్టిపడేస్తాయి. అంతర్జాతీయ టాప్ షోల్లో డ్రోన్ షోదే అగ్రస్థానం. ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్‌షోల్లో విజయవాడ ఈవెంట్ కూడా ఒకటి. కృష్ణానదిపై ఆకాశంలో ఈ డ్రోన్లు చేసే విన్యాసాలు వీక్షకులను మరో లోకంలోకి తీసుకు వెళ్లనున్నాయి. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ నెల 22, 23న మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ డ్రోన్ షోను కృష్ణాతీరంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడే ఎందుకు నిర్వహిస్తున్నారంటే 5 వేల డ్రోన్లు చేసే విన్యాసాలను అశేష జనవాహిని వీక్షించటానికి అనుకూలంగా ఉంటుంది కాబట్టి. దీంతో పాటు మరో ప్రత్యేక కారణం పర్యాటకానికి ఊతం ఇవ్వటానికి కూడా నిర్వహిస్తున్నారు. ఆకాశంలో డ్రోన్ల విన్యాసాలు కృష్ణానదిపై ప్రతిబింబిస్తూ ఈ ప్రాంతాన్ని వర్ణరంజితం చేస్తుంది. ఈ దృశ్యాలను చూడటానికి రెండు కళ్లు చాలవు. ఈ షో దాదాపుగా గంట పాటు సాగుతోంది.

మరెన్నో మస్త్.. అట్రాక్షన్స్

డ్రోన్ షో వీక్షించటానికి వచ్చేవారి కోసం ఇంకా ఎన్నో ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలకు రంగం సిద్ధం చేశారు. చల్లటి సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల పాటు ఏకబిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. వీ అన్‌బీటబుల్ డ్యాన్స్‌లు, ముంబాయి కళాకారులు అబ్బుర పరిచే ప్రదర్శనలు, లేజర్ బీమ్ షోతో కృష్ణా తీరం ధగధగలాడనుంది. ఈ లేజర్ షోతో వీక్షకులు ఫుల్ ఫిదా అవుతారు. వీటి మ్యూజిక్ బ్యాండ్ ఉంటుంది. బ్యాండ్ సంగీతంలో ఓలలాడిన తర్వాత అంతిమంగా గ్రాండ్ ఫైర్ వర్క్స్ జరుగుతుంది. దీంతో కృష్ణానది తీరాన దీపావళిని ముందే ఆవిష్కృతం చేయనున్నారు. అనంతరం బాణసంచా వెలుగు జిలుగులతో మనసు నింపుకుని హాయిగా ఇంటికి వెళ్లటమే!

డ్రోన్ షోకు పటిష్ట ఏర్పాట్లు

- ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, సీపీ రాజశేఖర్‌బాబు



విద్యాధరపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23న పున్నమీఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో జరగనున్న డ్రోన్ షోకు అధికారులు సమన్వయంతో వ్యవహరించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. శనివారం క్షేత్రస్థాయిలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ రాబు, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల హాజరు కానున్న దృష్ట్యా అందుకనుగుణంగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని మౌలిక వసతుల్లో లోటుపాట్లు ఉండకూడదన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ అన్ని విధాల పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీఎంసీ కమిషనర్ ఎస్.ఎం. ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోక్వాల్, డీఆర్వో శ్రీనివాసరావు, డీసీపీ ఉదయరాణి, బీఆర్‌డీఎఫ్ పిడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత నిధిమీనా, పోలీస్ కమిషనర్ డ్రోన్ సమ్మిట్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ సీఎం మార్గదర్శకాలకు అనుగుణంతో డ్రోన్ షో, డ్రోన్ సమ్మిట్‌ను విజయవంతానికి సమష్టి కృషి అవసరమన్నారు.

డ్రోన్ షోతో ఆహ్లాదకరమైన వాతావరణం

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి: పున్నమిఘాట్‌లో జరగనున్న డ్రోన్ షోకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాధరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్చార్జి) డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ పి.సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్ అమృత్, యూసిడి ఇన్‌ఛార్జి పి.ఓ డాక్టర్ లత, ఈఈ ఎ.ఎస్.ఎన్. ప్రసాద్, ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో నాగమల్లేశ్వరావు, బాబూరావు, సీతారామయ్య

జిమ్నాస్టిక్స్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల సత్తా

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బ్రహ్మానందం స్టేడియంలో 17,18న జరిగిన రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా ప్లేయర్స్ పతకాలతో మెరిశారు. అండర్-12 బాలికల పోటీల్లో కే శ్రీ సరయూ (విజయవాడ వీపీఎస్ పబ్లిక్‌స్కూల్) అన్ ఈవెన్ బార్‌లో స్వర్ణం, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో రజతం బ్యాలెన్ బీమ్ రజతం సాధించింది. వ్యక్తిగతంగానూ ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానం సాధించింది. అండర్-14 బాలుర విభాగంలో ఎల్ శ్రీరామ్ (విజయవాడ వీపీఎస్) హై బార్‌లో కాంస్యం, బాలికల విభాగంలో ఎస్ కీర్తన (సిద్ధార్థ) ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో స్వర్ణం, అన్‌ఈవెన్ బార్‌లో రజతం, బ్యాలెన్ బీమ్‌లో కాంస్యం, వ్యక్తిగత ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానం వశం చేసుకుంది. ఎస్. ప్రజ్ఞ (వీఆర్ సిద్ధార్థ) బ్యాలెన్ బీమ్‌లో రజతం సాధించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీ నాగమల్లేశ్వరరావు, సెక్రెటరీ బీ బాబూరావు, ట్రెజరర్ ఎల్ మురళీకృష్ణ, వీపీఎస్ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, కోచ్ రామ్మోహన్‌రావు అభినందించారు.

21,22న ఎన్టీఆర్ వర్శిటీ స్పోర్ట్సు సెలక్షన్స్

నగరంలోని ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలలో బాస్కెట్‌బాల్ పురుషుల, విశాఖపట్నం ఎన్ఆర్ఐలో తైక్వాండో మహిళలు, 22 రాజమహేంద్రవరం జీఎస్ఎల్‌లో బ్యాడ్మింటన్ పురుష జట్ల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వర్శిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తులు ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే మెడికల్, డెంటల్ ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాల ఫిజికల్ డైరక్టర్లు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు వేదిక వద్ద రిపోర్టు చేయాలన్నారు.

విలువలపై జగన్ మాట్లాడటం విడ్డూరం: గన్నె

వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాని జగన్ విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) శనివారం ఒక ప్రకటనలో అన్నారు. అబద్ధాలు, అవినీతి సొమ్ము, శవాలు జగన్ పార్టీకి పునాదులంటూ తీవ్రంగా విమర్శించారు. బాబాయ్ హత్య, కోడికత్తి, గులకరాయి కేసులలో జగన్ చెప్పిన మాటలను ప్రజలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన అభివృద్ధి, రాష్ట్రానికి తిరిగొస్తున్న కంపెనీలు, సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ మంచి జరుగుందన్న నమ్మకం ఏర్పడిందన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ అబద్ధాలతో ప్రెస్‌మీట్లు ఏర్పాట్లు చేయటం మొదలు పెట్టాడన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకుందాం: యార్లగడ్డ సుచిత్ర

వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర కోరారు. శనివారం విజయవాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే, మంత్రి, విద్యాధికుడుగా రాణించిన ఆయన్ను ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ సీటును సీఎం చంద్రబాబు కేటాయించారని, పట్టభద్రులు ఆయనకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



జ్యోత్స్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సభలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ రాష్ట్ర నేతలు

ఉద్యమ కెరటం గుళ్లపల్లి జ్యోత్స్న

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోత్స్న సంస్మరణ సభ
- హాజరైన రాజకీయ, మహిళ, ప్రజా సంఘాల నేతలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం, సమాజాభివృద్ధి, సామాజిక చైతన్యం కోసం నిరంతరం పనిచేసిన జ్యోత్స్న హఠాన్మరణం సమాజానికి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సామాజిక ఉద్యమకారిణి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం మంగళగిరి బైపాస్‌లోని సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు, మహిళా సంఘాల నేతలు, న్యాయవాదులు హాజరై జ్యోత్స్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న నిరంతరం పోరాటం చేశారన్నారు. ఎంబీవీకే చైర్మన్ పీ మధు మాట్లాడుతూ జ్యోత్స్న దసరా ఉత్సవాలను కూడా సామాజిక అంశాలతో ముడిపెట్టి నిర్వహించారన్నార. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ జ్యోత్స్న తన తుదిశ్వాస వరకు మహిళల హక్కుల కోసం ఉద్యమించారన్నారు. మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ జ్యోత్స్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ తనకు 4 దశాబ్దాలుగా రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులతో పరిచయం ఉందన్నారు. సమాజంలో మార్పు కోసం జ్యోత్స్న నిరంతరం పాటుపడ్డారన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి టీ రజని మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్శిటీలో చదివేటప్పుడు జ్యోత్స్నతో పరిచయం ఏర్పడిందన్నారు. ఆ పరిచయంతోనే విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో పనిచేశామన్నారు. సార్వోత్తమ లైబ్రరీ కార్యదర్శి ఆర్.శారద, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకనాథ్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణ్‌రెడ్డి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కేరళ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు థామస్ అబ్రహం, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాసు, జీ.సురేంద్ర, జీ.జితేంద్ర, వివిధ సంఘాల ప్రతినిధులు అక్కినేని వనజ, కే.స్వరూపరాణి, ఎ.సునీత, బి.శ్రీనివాసరావు, జీ.రామారావు, ఏవీ శేషసాయి, సీహెచ్ ఆషాలత, ఎం.జయకర్, పీ.మురళీకృష్ణ, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఖలీల్, పీ.శ్రీనివాసరావు, జగతి, శేషారత్నం, జీ.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పక్కదారి పడితే

6ఏ చట్టంతో కఠిన చర్యలు

రేషన్ డీలర్ల నియామకాల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి: ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే 6 ఏ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. నిత్యావసర వస్తువుల పంపిణీ డీలర్ల నియామక ప్రక్రియపై శ నివారం ఆమె రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలి సి పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థపై అధికారులు మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గత 3 నెలల్లో ఇలా అవకతవకలకు పాల్పడిన వారిపై 6 ఏ చట్టం కింద 54 కేసులు నమోదుతోపాటు 627 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. జిల్లాలో నూతన రేషన్ దుకాణాల ఏర్పాటుకు డీలర్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అదనంగా 82 రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి డీలర్లను నియమించాల్సి ఉందని ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అభ్యర్థులకు నవంబర్ 5న రాత పరీక్ష, 7న మౌఖిక పరీక్షలు నిర్వహించి 12న నియామక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బియ్యంతో పాటు జొన్నల పంపిణీ

నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు జొన్నల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇకపై బియ్యంతో పాటు 3 కేజీల వరకు జొన్నలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు.రైతుబజార్లలో వంటనూనెలు, కందిపప్పు, ఉల్లి అందుబాటులో ఉంచి ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.125 ఉన్న పామాయిల్‌ను రూ.110కి, రూ.135 ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.124కు విక్రయించాలని, అలాగే కిలో కందిపప్పు రూ.150కే వినియోగదారులకు అందజేయాలన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో వి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌వో పాపారావు, ఆర్డీవోలు కె.చైతన్య, మాధురి, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సూరీడే తగలని చిరు ప్రాయం



- అర్ధరాత్రి వరకు చదువులు, టీవీలు, ఫోన్లు
- బారెడు పొద్దెక్కే వరకు మంచాలపైనే
- అధికశాతం చిన్నారుల్లో విటమిన్ డీ లోపం
- పెళుసుబారుతున్న ఎముకలు
- పెరుగుతున్న ఆస్టియో ఫోరోసిస్ బాధితులు



విపరీతంగా జుట్టు ఊడిపోతుండటం.. వాతావరణం చల్లగా ఉన్నా చెమటలు పట్టడం, ఆకలి తగ్గిపోవడం.. చిన్నారుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తమవ్వాలి. బహుశా మీ పిల్లలు విటమిన్ -డీ లోపంతో బాధపడుతుండవచ్చు. ఈ లక్షణాలతో వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య విజయవాడ నగరంలో ఇటీవల కాలంలో ఎక్కువగా ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు వయస్సు ఎక్కువగా ఉన్నవాళ్లలోనే ఎముకల బలహీనత కనిపించేది ఇప్పుడు చిన్నారుల్లోనూ ఎముకల బలహీనత గుర్తిస్తున్నారు. 18ఏళ్ల లోపు చిన్నారుల్లో ప్రతి వంద మందిలో 30 మంది విటవిన్ -డీ లోపంతో బాధపడుతున్నట్లు కాంప్రహెన్సివ్ నేషనల్ న్యూట్రిషన్ సర్వే (సీఎన్ఎన్ఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ లోపం అంతిమంగా ఆస్టియోఫోరోసిస్‌కు దారితీస్తుంది. నేడు ప్రపంచ ఆస్టియోఫోరోసిస్ దినోత్సవం. ఈ సందర్భంగా విటమిన్ -డీ లోపం.. ఆస్టియోఫోరోసిస్‌పై వైద్య నిపుణులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి.

\- విజయవాడ/ఆటోనగర్ - ఆంధ్రజ్యోతి

మారుతున్న జీవనశైలి కారణంగా రాత్రిపూట చదువుకుంటూనో.. టీవీలు, ఫోన్లు చూస్తూనో ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం 7 తర్వాతే మంచం నుంచి కిందకు దిగటం కారణంగా సూర్యకిరణాలకు చిక్కకుండా రోజు గడిచిపోతోంది. బాల్యం నుంచి 25 ఏళ్ల వరకు ఎముకల బలానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరానికి కాల్షియం సమృద్ధిగా అందాలంటే ఉదయపు సూర్యకిరణాలకు మించింది లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు.

మారుతున్న జీవనశైలితోనే ప్రమాదం

డాక్టర్ ఎం. విజయ, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్

విటమిన్ డీ లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం జీవనశైలిలో మార్పే. ఉదయం ఎండలో ఉండటం అలవాటు చేసుకోవాలి. గతంలో వయసురీత్యా ఆస్టియోఫోరోసిస్ కేసులొచ్చేవి. ఇప్పుడు చిన్నపిల్లల్లోనూ ఉంటుంది. మన శరీరం కాల్షియం స్వీకరించడానికి విటమిన్ డీ అవసరం. ఈ విటమిన్ ఆహారంలో తక్కువ. ఉదయం వేళ సూర్యకిరణాల్లో పుష్కలంగా ఉంటుంది. ఎముక గుల్లబారటం అనే ప్రక్రియ నెమ్మదిగా జరగడం వల్ల ఆస్టియోఫోరోసిస్‌ను గుర్తించడం కష్టం. అందుకే 65 ఏళ్ల బడిన స్త్రీలు, 70 ఏళ్లపై బడిన పురుషులు ఎముకల సామర్థ్యాన్ని తెలిపే బీఎండీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వ్యాధి తొలి దశలోనే గుర్తిస్తే కాపాడుకోవచ్చు.



నేడు ప్రపంచ ఆస్టియో ఫోరోసిస్ దినోత్సవం

విటమిన్ డీ కోసం ఏం చేయాలి..?

ఉదయం ఎండలో 5 నుంచి 30 నిమిషాలు ఉండటంతోపాటు కాల్షియం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, చేపలు, గుడ్లు, పాలు, నువ్వులు, బాదం పప్పు వంటి వాటిని ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యాయామం వల్ల కూడా ఎముకలు గట్టిగా తయారవుతాయి.


ఆస్టియోఫోరోసిస్ ఎలా వస్తుంది?

సాధారణంగా ఎముక నిర్మాణం, ఎదుగుదలలో భాగంగా ఎముకలోని పాతకణాలు పోయి కొత్త కణాలు చేరతాయి. దీన్ని ఎముక రీమాడలింగ్ అంటారు. ఇది చిన్నతనంలో మొదలై కౌమారదశ వరకు అతివేగంగా ఉండి సుమారు 30 ఏళ్లకు పూర్తిస్థాయికి చేరుతుంది. ఈ దశలో ఎముక దృఢంగా ఉంటుంది. 50 ఏళ్లు వచ్చేసరికి ఎముక సాంద్రత తగ్గి గుల్లబారుతుంది. జన్యుపరమైన కారణాలు, అధికంగా ఆల్కహాల్, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, విటమిన్ డీ లోపం వల్ల ఆస్టియోఫోరోసిస్ వచ్చే అవకాశాలున్నాయి.

వ్యాధి లక్షణాలు

ఆస్టియోఫోరోసిస్ నెమ్మదిగా మనిషిని కుంగదీస్తుంది. చాలామందికి ఎముకలు విరిగేంతవరకు లక్షణాలు కనపడవు. నెమ్మదిగా నడుము వంగటం, వెన్నునొప్పి, ఎత్తు తగ్గడం, అలసట కొంతమందిలో కనిపిస్తాయి. అన్ని ఎముకలు దీని కారణంగా ప్రభావితమైనా వెన్నుపూస, తుంటి, మణికట్టు ఎముకలపై వ్యాధి ఎక్కువగా ఉంటుంది.

అకాడమీ పేరుతో కాలేజీ.. ఆర్ఐవో విచారణ



విచారణ చేస్తున్న ఆర్ఐవో

జగ్గయ్యపేట, అక్టోబరు 19: పట్టణంలో సీతారాంపురం లో ఆకాడమీ పేరుతో కళాశాల నిర్వహిస్తున్న విద్యాసంస్థపై తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు ఇంటర్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా ఆర్ఐవో సీ.సత్యనారాయణరెడ్డి విచారణ జరిపారు. ఇంటర్ బో ర్డులో నిబంధనలు అడ్డుపెట్టుకుని ముగ్గురు వ్యక్తులు మోసానికి పాల్పడినట్టు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సీతారాంపురంలో కొత్త వెంకటేశ్వరస్వామి గుడి వద్ద లక్ష్య ఐఐటీ అకాడమీ పేరుతో ఐదేళ్లుగా ముగ్గురు వ్యక్తులు కళాశాల నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అకాడమికి స్వల్ప దూరంలో ఉన్న విశ్వభారతి జూనియర్ కాలేజీ పేరున లోపాయికారిగా అడ్మిషన్లు ఇస్తున్నారు. ఆకాడమీ పేరుతో ఇంటర్‌తో పాటు జేఈఈ మెయి న్స్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని చెప్పటంతో గత ఏడాది టెంత్ టాపర్లు అనేక మంది చేరారు. అడ్మిషన్ సమయం లో చూపించిన ఫ్యాకల్టీ ఎవరూ లేకపోవటంతో ఇంటర్‌లో మెరి ట్ విద్యార్థుల ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రముఖుడు ధరణికోట వెంకటరమణ ఫిర్యాదుతో ఆర్ఐవో సత్యనారాయణరెడ్డి విచారణకు వచ్చారు. పైకి లక్ష్య అకాడమీ బోర్డులు, లోపల రికార్డుల్లో మాత్రం విశ్వభారతి జూనియర్ కళాశాల అడ్మిషన్లున్నాయి. ఆర్ఐవో విశ్వభారతి కళాశాల కరస్పాండెంట్ పద్మను పిలిపించి విచారించారు. అకాడమీ పేరు తొలగించి, విశ్వభారతి జూనియర్ కళాశాల పేరునే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుక్రవారం విచారణ జరిపి ఆర్ఐవో చెప్పిన మార్పులను ఇంకా మార్చలేదు.

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేస్తాం

విద్యార్థులను లక్ష్య ఐఐటీ అకాడమీ ప్రతినిధుల మోసంపై మంత్రి లోకేష్‌కు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేస్తామని పేరెంట్స్ కమిటీ ప్రతినిధి ధరణికోట వెంకటరమణ చెప్పారు. విశ్వభారతి జూనియర్ కళాశాలకు అనుబంధం అని చెప్పకుండా ప్రత్యేక కళాశాల అని భారీగా ప్రచారం చేశారన్నారు.

న్యాయం చేయండి


- ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు ఎయిడెడ్ ఉపాధ్యాయుల వినతి

గవర్నర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విలీనం కాబడి తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం జరిగేలా నూతన ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఎయిడెడ్ ఉపాధ్యాయులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు యూటీఎఫ్ కార్యాలయం వద్ద శనివారం వినతిపత్రం ఇచ్చారు. విలీన ఎయిడెడ్ ఉపాధ్యా య సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. మోహన వెంకటకృష్ణ, ఎంవీ కృష్ణారెడ్డి తమ సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు విద్యాశాఖాధికారులతో చర్చించి, మండలిలోనూ సమస్యలు లేవనెత్తుతానని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ నేతలు ఏ సీతారామమూర్తి, హరిప్రసాద్, ఏ సురేష్‌కుమార్, జి. సత్యానందం, సీతమ్మ, ఆస్కార్, థామస్, ఎం. భానుప్రకాష్ ఉన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ డాక్టర్

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం గన్నవరంలో హల్‌చల్ చేసిన అపరిచితుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అతను తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన యిమ్మంది జ్యోతి శివ శ్రీ అలియాస్ డాక్టర్ సూర్య అంటూ పలు పేర్లతో మోసాలకు పాల్పడుతున్నాడన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 20 వరకు కేసులు నమోదైనా లుగేళ్లు జైలు శిక్ష అనుభవించి 10నెలల క్రితం విడుదలైనట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. డాక్టర్ అని చెప్పి మొబైల్ కావాలి, సరుకులు కావాలని చెప్పి షాపుల వద్ద నుంచి తాను ముందుగా నిర్ణయించుకున్న ప్రదేశానికి తెప్పించుకుని డబ్బులివ్వకుండా వెళ్లిపోయి ఎంతో మందిని మోసం చేశాడన్నారు. గతంలోనూ గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో ఇలా మొబైల్ తీసుకుని వెళ్లిపోయినట్లు తేలిందన్నారు. ఇతడి నుంచి సరుకులు, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. తీరా చూస్తే ఆ కారు అతడిది కాదని తేలిందన్నారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్టు ఎస్సై శివ ప్రసాద్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
ఆదివారం • 20 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



కీలకంగా సాహూ పాత్ర

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మట్కా'. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించారు. నవంబర్ 14న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ చిత్రంలో నవీన్‌చంద్ర సాహూ అనే కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. నవీన్‌చంద్ర స్కూటర్‌పై కూర్చొని తీక్షణంగా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్. సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

తెలంగాణ యాస కోసం కష్టపడ్డా



అజయ్

'చాలా రోజుల తర్వాత నా మనసుకు నచ్చిన పాత్ర 'పొట్టేల్' చిత్రం ద్వారా దొరికింది. ఇందులో పటేల్ అనే పాత్ర పోషించాను. చాలా షేడ్స్ ఉన్నాయి. అందుకే కథ వినగానే ఈ సినిమా తప్పకుండా చేయాలని నిర్ణయించుకున్నాను' అని నటుడు అజయ్ అన్నారు. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించగా, సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా అజయ్ మీడియాతో ముచ్చటించారు. 'కథలో కీలకమైన పాత్ర కావడంతో బాగా చేయకపోతే సినిమా దెబ్బతింటుందనే భయం ఏర్పడింది. ఈ సినిమాకు కథ, నా పాత్ర అద్భుతంగా కుదిరాయి. సాహిత్ కథను ఎంత అద్భుతంగా చెప్పాడో, సినిమాను అంతే అద్భుతంగా తెరకెక్కించాడు. కథలో సందేశం పాలు ఎక్కువ ఉన్నా దానికి వాణిజ్య హంగులు అద్దిన తీరు మెప్పిస్తుంది. తెలంగాణ యాసలో సంభాషణలు పలకడానికి కొంచెం కష్టపడాల్సి వచ్చింది. విజిల్స్ పడే సన్నివేశాలు చాలా ఉన్నాయి. విక్రమార్కుడులో నేను పోషించిన విలన్ పాత్రకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఆ స్థాయి విలనిజం పండించే పాత్ర ఇప్పటివరకూ మళ్లీ దక్కలేదు. ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది' అని చెప్పారు.

మా అబ్బాయి కోసం బతకాలనుకున్నా


సోనాలి బింద్రే

క్యాన్సర్ అనగానే చాలామంది అది కలిగించే శారీరక బాధలు గురించే మాట్లాడతారు. కానీ, అది మానసికంగా కలిగించే నష్టం అపారం. క్యాన్సర్ సర్వైవర్‌గా తాను ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పగలనన్నారు నటి సోనాలీ బింద్రే. జీవీకె హెల్త్ హబ్ ప్రారంభించిన మేక్ యువర్ పింక్ మార్క్ ప్రచారంలో భాగంగా శనివారం జూబ్లీహిల్స్‌లోని సంస్థ ప్రాంగణంలో ఓ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సోనాలీ బింద్రే మాట్లాడుతూ 'మీకు క్యాన్సర్ వచ్చిందని తెలియగానే ఆందోళనకు గురైతే అది మిమ్మల్ని మరింత కుంగదీస్తుంది. అటువంటి సందర్భంలో మానసిక బలం ముఖ్యం. నా విషయానికి వస్తే మానసికంగా బలంగా ఉండడంతో పాటు చిన్న వయసులో ఉన్న మా అబ్బాయి కోసం బతకాలనుకున్నా. కుటుంబ సభ్యులు, స్నేహితులు



నాకు పూర్తిగా మద్దతు అందించారు. రోజువారీ ధ్యానం, యోగా, చిన్న చిన్న విజయాల ద్వారా అవసరమైన మానసిక స్థైర్యం సంపాదించుకున్నా' అని చెప్పారు. 'క్యాన్సర్ అనే పదమే భయంకరమైనది. దాని బారిన పడితే ఇక జీవితం ముగిసినట్లే అన్నది వాస్తవం కాదు. మనం ముందు వ్యాధిని గుర్తిస్తే, చికిత్స ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చు. మనలో చాలామంది ఆరోగ్యంగా ఉన్నాం కాబట్టి వైద్య పరీక్షలు అవసరం లేదనుకుంటారు. రెగ్యులర్‌గా పరీక్షలు చేయించుకుంటే, ఈ తరహా సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్సలను పొందవచ్చు. మగవారంతా కూడా ఇళ్లలోని తమ ఆడవారికి పరీక్షలు చేయించాలి' అని కోరారు సోనాలి.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)




నాగచైతన్య, శోభితా ధూళిపాళ్లకు ఇటీవలే నిశ్చితార్థం అయిన సంగతి తెలిసిందే. నిశ్చితార్థం తర్వాత శోభితాతో కలసి దిగిన మొదటి ఫొటోను నాగచైతన్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారు. ఈ పోస్టుకు కామెంట్స్‌ను డిసేబుల్ చేయడం గమనార్హం.

అన్నా అని పిలిస్తే ఫీలయ్యా



అందమైన అమ్మాయిని చూస్తే ఎవరికైనా మాట్లాడాలనిపిస్తుంది. సరదాగా కాసేపు కబుర్లు చెప్పాలనిపించడమూ కామన్. అయితే అప్పుడు ఆ అమ్మాయి 'అన్నా' అంటే మాత్రం అబ్బాయిలు తట్టుకోలేరు. ఈ విషయంలో మన సినిమా హీరోలు కూడా అతీతం కాదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితే శివకార్తికేయన్‌కు ఎదురైందట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'అమరన్' ఆడియో వేడుకలో చెప్పారు. "నేను ఓ టీవీ చానెల్‌లో పనిచేసేటప్పుడు సాయిపల్లవిని మొదటిసారి కలిశాను. అందులో ఓ షో కోసం నేను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నప్పుడు సాయి పల్లవి ఆ కార్యక్రమానికి వచ్చారు. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్' సినిమాలో ఆమె నటనను చూసి ఫోన్ చేసి ప్రశంసించాను. ఆమె అందుకు 'థ్యాంక్యూ అన్నా' అన్నారు. సాయి పల్లవి అలా పిలిచేసరికి ఫీల్ అయ్యా" అని చెప్పారు. ఈ విషయాన్ని శివ కార్తికేయన్ స్టేజీ మీద చెప్తున్నంత సేపూ సాయి పల్లవి నవ్వుతూనే ఉన్నారు.

సన్నీ యాక్షన్ మోడ్



బాలీవుడ్ హీరో సన్నీడియోల్ కథానాయకుడిగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. సన్నీడియోల్ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ సినిమా టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'జాత్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శరీరమంతా రక్తపుధారలు కారుతుండగా, పెద్ద ఫ్యాన్‌ను పట్టుకొని యాక్షన్ మోడ్‌లో ఉన్న సన్నీడియోల్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. రణ్‌దీప్ హుడా, వినీత్‌కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: థమన్ ఎస్, సినిమాటోగ్రఫీ:రిషి పంజాబీ.

రేణు దేశాయ్ చండీ హోమం

శరత్ పూర్ణిమ సందర్భంగా గణపతి, చండీ హోమం చేశారు సినీ నటి రేణు దేశాయ్. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పూజలో అకీరా నందన్ కూడా పాల్గొన్నాడు. 'మన పూర్వీకులు అనుసరించిన సాంప్రదాయాలు, ఆచారాలను పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా మనపై ఉంది. డెకరేషన్‌పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సిన అవసరం లేదు. ఆర్భాటంగా పూజలు చేసుకోవడానికి బదులుగా ఇలా హోమం, పూజలపైనే ఫోకస్ చేస్తే సరిపోతుంది' అని రేణు దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు.



పోరాటాలే ఈ స్థాయికి చేర్చాయి



బుల్లి తెరపై నట ప్రస్థానం ఆరంభించి.. ఆ తర్వాత వెండితెరపై నటించిన ఐదో చిత్రంతోనే జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు మానసి పరేఖ్. ఇటీవల జరిగిన 70వ జాతీయ అవార్డుల్లో.. గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్'తో ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకొని టాక్ ఆఫ్ ద నేషన్‌గా నిలిచారు. ఇటీవలే ఆంగ్ల మీడియాతో ముచ్చటించిన ఆమె.. తన కెరీర్ తొలి రోజులను గుర్తుచేసుకున్నారు.

"మనం చేసే పోరాటాలే మనమేంటో ప్రపంచానికి తెలియజేస్తాయి. నేను ఎన్నో పోరాటాలు చేసి కష్టపడ్డాను కాబట్టే.. ఈ స్థాయికి చేరుకోగలిగానని నమ్ముతాను. కష్టాల తర్వాత వచ్చే విజయంలో ఉండే ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అదొక అనిర్వచనీయమైన అనుభూతి. అప్పుడే ప్రతి క్షణాన్ని ఆస్వాదించగలుగుతాం. మనపై మనకు నమ్మకం ఉంటేనే ఏదైనా సాధించగలం" అని చెప్పారు.



కొత్తగా..

తెలంగాణ పల్లె కథ



రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్), అనన్య కృష్ణన్, తనికెళ్ల భరణి, ధన్‌రాజ్ కీలకపాత్రలు పోషించారు. గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. శనివారం చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సాయిరాజేశ్ చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిరాజేశ్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బావుంది. ఈ సినిమాతో రాకేశ్ మంచి స్థాయికి వెళ్లాలి. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని అద్భుతంగా చూపించిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాను మూడు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించాలనేది నా కోరిక. మా దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. చరణ్ అర్జున్ మంచి సంగీతం అందించారు' అని చెప్పారు. అంజి మాట్లాడుతూ 'దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ కూడా నేనే చేశాను. సాయి రాజేశ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. హీరోయిన్ అనన్య అద్భుతంగా నటించారు' అని చెప్పారు.

ఫ్యామిలీ చిత్రం



చిన్నా హీరోగా, మధుప్రియ, రుచిక హీరోయిన్లుగా సుభాని దర్శకత్వంలో ఎం. అనిత నిర్మిస్తున్న చిత్రం 'జై జై దుర్గమ్మ'. సంగీతం జయసూర్య. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రముఖ నిర్మాత సాయి వెంకట్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చిన్నా మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాము. ఫ్యామిలీతో కలిసి ఆనందించవలసిన చిత్రం' అని అన్నారు.

సరికొత్తగా నరుడి బతుకు



శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధురెడ్డి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన సుధీర్‌బాబు మాట్లాడుతూ 'శివ, నితిన్ ప్రసన్న నటన బావుంది. ఈ మూవీ సరికొత్తగా ఉండబోతోంది' అని చెప్పారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ "నరుడి బ్రతుకు నటన' చిత్రబృందాన్ని చూసినప్పుడు నాకు నా పాత రోజులు గుర్తుకొచ్చాయి. నేను కెరీర్ ఆరంభంలో నిర్మించిన కొన్ని మంచి చిత్రాలను అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శించగలిగాను కానీ థియేటర్లలో విడుదల చేయలేకపోయాను. అందుకే ఒక మంచి సినిమాను తీసిన ఈ నిర్మాతలకు సాయంచేసేందుకు ముందుకొచ్చాను' అన్నారు. శివ, నితిన్ ప్రసన్న నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ అని రిషికేశ్వర్ తెలిపారు. ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం, ప్రేక్షకులు ఆదరించాలి అని సింధురెడ్డి కోరారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



అంజన్ రామచంద్ర, శ్రావణిరెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన 'లవ్‌రెడ్డి' చిత్రం చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా చిత్ర బృందం శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మదన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ "లవ్‌రెడ్డి సినిమా చూస్తున్న ప్రేక్షకులు భావోద్వేగానికి గురవుతున్నారు. ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ మంచి పేరొచ్చింది. నిర్మాతకు నాకు సంతృప్తినిచ్చింది. ప్రేక్షకులు మరింతగా మా చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు స్మరణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచారానికి తగినంత సమయం దొరక్కపోయినా సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులకు చేరువైంది. ప్రతి ఒక్కరూ మంచి సినిమా తీశారని ప్రశంసిస్తున్నారు' అని చెప్పారు. రాతిగుండెను సైతం కరిగించేలా క్లైమాక్స్ ఉందని ప్రేక్షకులు చెబుతున్నారని శ్రావణి తెలిపారు. 'లవ్‌రెడ్డి' థియేటర్లలో గెలిచాడు అని అంజన్ రామచంద్ర తెలిపారు.



ఎవరో కొత్త చాంప్!

న్యూజిలాండ్‌తో సౌతాఫ్రికా ఫైనల్ నేడు

మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: ఎంతో కాలంగా ఊరిస్తున్న ప్రతిష్ఠాత్మక ఐసీసీ ట్రోఫీని దక్కించుకొనే సువర్ణావకాశం న్యూజిలాండ్ ముంగిట నిలిచింది. సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ మహిళలు ఆదివారం జరిగే టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఢీకొననున్నారు. టోర్నీకి ముందు టీ20లలో కివీస్ వరుసగా 10 మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. దాంతో ఈసారి మెగా టోర్నీలో ఆ జట్టుపై ఎవరికీ అంచనాలు లేవు. కానీ సుజీ బేట్స్, అమీలియా కెర్, లియా తహుహులాంటి స్టార్లతో కూడిన ఆ జట్టు టోర్నీలో అద్భుతాలు సృష్టించి తుదిపోరుకు చేరింది. అయితే తొలి టైటిల్‌పై కన్నేసిన సౌతాఫ్రికా మహిళలను అడ్డుకోవడం ఆషామాషీ కాదు. ఆస్ట్రేలియాను సెమీస్‌లో చిత్తు చేయడం సఫారీల సత్తాను తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఎవరవుతారో కొత్త చాంపియన్ చూడాలి.

హాకీ కుర్రాళ్ల శుభారంభం

జొహోర్ (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ టోర్నీలో భారత జూనియర్ హాకీ జట్టు బోణీ చేసింది. శనివారం మ్యాచ్‌లో భారత్ 4-2తో జపాన్‌పై గెలిచింది.

భారత్ 'ఎ' భళా

తొలి మ్యాచ్‌లో పాక్‌పై విజయం

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీ గ్రూపు 'బి'లో భారత 'ఎ' జట్టు 7 పరుగులతో పాకిస్థాన్ 'ఎ'ని చిత్తు చేసింది. భారత్ 'ఎ' తొలుత 20 ఓవర్లలో 183/8 స్కోరు చేసింది. తిలక్ వర్మ (44) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్రభ్‌సిమ్రన్ (36), అభిషేక్ శర్మ (35) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ముఖీమ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో పాకిస్థాన్ 'ఎ' 20 ఓవర్లలో 176/7 స్కోరే చేసింది. అరాఫత్ (41), యాసిర్ ఖాన్ (33) రాణించారు. అన్షుల్ 3, నిషాంత్, రసీఖ్ రెండేసి వికెట్లు సాధించారు.

ఆంధ్ర 137/5

అహ్మదాబాద్: టాపార్డర్ కుప్పకూలినా.. కేఎస్ భరత్ (78 బ్యాటింగ్), నితీశ్ కుమార్ (34 బ్యాటింగ్) ఆదుకోవడంతో గ్రూప్-బిలో గుజరాత్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర తడబడి నిలబడింది. ఆటకు రెండోరోజైన శనివారం ఆట ముగిసేసరికి ఆంధ్ర.. తొలి ఇన్నింగ్స్‌లో 137/5తో ఉంది. జట్టు 29/5తో కష్టాల్లో పడిన దశలో భరత్, నితీష్ ఆరో వికెట్‌కు అజేయంగా 108 పరుగులు జోడించారు. చింతన్ గాజా 3 వికెట్లు తీశాడు. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 367 రన్స్ చేసింది.


బౌలర్లు మాయ చేసేనా?

న్యూజిలాండ్ లక్ష్యం 107

సర్ఫరాజ్ భారీ శతకం

పంత్ సెంచరీ మిస్

భారత్ రెండో ఇన్నింగ్స్ 462



సర్ఫరాజ్ (150)



పంత్ (99)

బెంగళూరు: మూడున్నర దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్ జట్టు భారత గడ్డపై టెస్టు విజయం అందుకునేలా కనిపిస్తోంది. ఆ జట్టు చివరి రోజు ఆదివారం 107 పరుగులు సాధిస్తే చాలు. అయితే అంతకుముందు భారత్‌కు అంతా సవ్యంగా సాగుతుందనుకున్న వేళ.. ఒక్కసారిగా బ్యాటర్ల తడబాటు. ఓ దశలో సర్ఫరాజ్ (195 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్సలతో 150) వీరోచిత శతకం, రిషబ్ పంత్ (105 బంతుల్లో 9 ఫోర్లు 5 సిక్సలతో 99) అద్భుత పోరాటం ఫలితంగా జట్టు 408/3 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. దీంతో మరో 150-200 పరుగులైనా జత చేస్తారని అంతా భావించారు. కానీ రెండో కొత్త బంతి అందుకున్న కివీస్ బౌలర్లు మ్యాచ్ గమనాన్నే మార్చేశారు. టపటపా వికెట్లు తీసేయడంతో 54 పరుగుల వ్యవధిలోనే భారత్ చివరి 7 వికెట్లను కోల్పోయింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన 462 రన్స్‌కు ఆలౌటైంది. మ్యాట్ హెన్రీ, ఓరోర్క్ మరోసారి చెలరేగి మూడేసి వికెట్లతో దెబ్బతీశారు. ఎజాజ్ పటేల్‌కు రెండు వికెట్లు దక్కాయి. 107 పరుగుల లక్ష్యం కోసం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ నాలుగోరోజైన శనివారం ఆట ముగిసేసరికి కేవలం నాలుగు బంతులు ఆడి పరుగులేమీ చేయలేదు. వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను ముందుగానే ముగించారు. ఆదివారం కూడా వరుణుడు ఆటంకపరిచే అవకాశం ఉంది. దీంతో టీమిండియా ఓటమి నుంచి తప్పించుకోవాలంటే రోజంతా వర్షం కురవాలి.. లేదంటే బౌలర్లు ఏమైనా అద్భుతం చేయాలి. ఇక.. కివీస్ ఇక్కడ చివరిసారిగా 1989లో టెస్టు గెలవడం గమనార్హం.

సర్ఫరాజ్-పంత్ అద్భుత పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 231/3తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ తొలి సెషన్‌లో పూర్తి ఆధిపత్యం చూపింది. యువ బ్యాటర్లు సర్ఫరాజ్-పంత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దాదాపు ప్రతీ ఓవర్‌లో బౌండరీతో చెలరేగారు. సర్ఫరాజ్ తన సహజశైలిలో ఆడేస్తూ చక్కటి ఫోర్‌తో తొలి సెంచరీ (110 బంతుల్లో)ని పూర్తి చేశాడు. అటు ఆరంభంలోనే రనౌట్ నుంచి తప్పించుకున్న పంత్ కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. సౌథీ ఓవర్‌లో 6,4 కొట్టిన పంత్.. ఎజాజ్ ఓవర్‌లో 6,6,4తో చెలరేగాడు. 54 బంతుల్లోనే పంత్ ఫిఫ్టీ పూర్తయ్యింది. అయితే ఉదయం 11కు వర్షం కురవడంతో మ్యాచ్‌కు రెండు గంటల అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలోనే లంచ్ బ్రేక్‌ను ప్రకటించారు.

కొత్త బంతితో బెంబేలు: రెండో సెషన్ ఆరంభంలోనూ సర్ఫరాజ్-పంత్ జోరును చూపారు. ఎడాపెడా బౌండరీలతో స్కోరును 80 ఓవర్లలో 400కి చేర్చారు. కానీ ఆ ఓవర్ తర్వాత కివీస్‌కు కొత్త బంతి తీసుకునే అవకాశం రావడంతో భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. చక్కటి పేస్, బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బందిపెట్టారు. దీంతో పరుగుల సంగతి ఏమో కానీ వికెట్లు కూడా కాపాడుకోలేకపోయారు. 150 పరుగులతో ఉన్న సర్ఫరాజ్‌ను ముందుగా సౌథీ అవుట్ చేయడంతో తడబాటు ఆరంభమైంది. దీంతో నాలుగో వికెట్‌కు 177 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే.. సెంచరీకి పరుగు దూరంలో పంత్‌ను ఓరోర్క్ బౌల్డ్ చేశాడు. బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి నేరుగా వికెట్లను తాకింది. కుదురుకున్న ఇద్దరు బ్యాటర్లు పెవిలియన్ చేరడంతో భారత్ భారీ ఆధిక్యంపై ఆశలు వదులుకుంది. సెషన్ చివరి ఓవర్‌లో రాహుల్ (12)ను కూడా ఓరోర్క్ అవుట్ చేశాడు. ఇక ఆఖరి సెషన్ అయితే పది ఓవర్లలోనే ముగిసింది. హెన్రీ టెయిలెండర్లను టపటపా పెవిలియన్ చేర్చడంతో భారత్ స్వల్ప లక్ష్యాన్నే ప్రత్యర్థి ముందుంచగలిగింది.

1 టెస్టుల్లో వేగంగా (62 ఇన్నింగ్స్) 2500 పరుగులు సాధించిన వికెట్ కీపర్‌గా పంత్. ఈక్రమంలో అతను ధోనీ (69 ఇన్నింగ్స్)ని అధిగమించాడు.

3 టెస్టుల్లో ఎక్కువసార్లు (7) 90+ దగ్గర అవుటైన మూడో భారత బ్యాటర్‌గా పంత్. సచిన్ (10) టాప్‌లో ఉన్నాడు. అలాగే టెస్టుల్లో 99 దగ్గర అవుటైన నాలుగో వికెట్ కీపర్‌గా పంత్. గతంలో మెకల్లమ్, ధోనీ, బెయిర్‌స్టో కూడా ఇలాగే వెనుదిరిగారు.

3 ఒకే టెస్టులో డకౌట్, 150+ స్కోరు నమోదు చేసిన మూడో భారత బ్యాటర్‌గా సర్ఫరాజ్. గతంలో మాధవ్ ఆప్టే (0, 163 నాటౌట్), నయన్ మోంగియా (152, 0) ఉన్నారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46;

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402.


భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్డ్) బ్లండెల్ (బి) ఎజాజ్ 35; రోహిత్ (బి) ఎజాజ్ 52; కోహ్లీ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (సి) ఎజాజ్ (బి) సౌథీ 150; పంత్ (బి) ఓరోర్క్ 99; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరోర్క్ 12; జడేజా (సి) యంగ్ (బి) ఓరోర్క్ 5; అశ్విన్ (ఎల్బీ) హెన్రీ 15; కుల్దీప్ (నాటౌట్) 6; బుమ్రా (సి) బ్లండెల్ (బి) హెన్రీ 0; సిరాజ్ (సి) సౌథీ (బి) హెన్రీ 0; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 99.3 ఓవర్లలో 462 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462, 10-462. **బౌలింగ్:** సౌథీ 15-2-53-1; హెన్రీ 24.3-3-102-3; ఓరోర్క్ 21-4-92-3; ఎజాజ్ పటేల్ 18-3-100-2; ఫిలిప్స్ 15-2-69-1; రచిన్ 6-0-30-0.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బ్యాటింగ్) 0; కాన్వే (బ్యాటింగ్) 0; **మొత్తం:** 0.4 ఓవర్లలో 0/0. **బౌలింగ్:** బుమ్రా 0.4-0-0-0.

జీరో టు హీరో!

లావుగా ఉండడంతో ఎగతాళి.. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించినా సెలెక్టర్ల నుంచి రాని పిలుపు. నిరాశ ఆవరించినా.. సర్ఫరాజ్ మాత్రం తన బ్యాటింగ్ విన్యాసాలతో సెలెక్టర్ల తలుపులు బాదుతూనే ఉన్నాడు. గిల్ ఫిట్‌నెస్ లేమితో.. తుది జట్టులో చాన్స్ దక్కించుకొన్న 26 ఏళ్ల సర్ఫరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో జీరో అయ్యాడు. కానీ, రెండో ఇన్నింగ్స్‌లో ఆడిన తీరు అతడి ప్రతిభపై నెలకొన్న అనుమానాలను పటాపంచలు చేశాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా ఆడాడు. కోహ్లీలాంటి సీనియర్లే ఆచితూచి ఆడుతున్న పరిస్థితుల్లో సర్ఫరాజ్ ప్రత్యర్థి బౌలర్లపై వ్యూహాత్మకంగా దాడి చేసి వారిని ఒత్తిడిలోకి నెట్టాడు. ఇక, పంత్‌తో కలిసి బ్యాటింగ్ చేయాల్సి వచ్చినప్పుడు పరిణతి కనబర్చాడు. రిషబ్ కాలికి బంతి తగలడంతో అతడిని ఎక్కువగా పరుగులు తీయించలేదు. అంతేకాకుండా లెఫ్టామ్ స్పిన్నర్ వచ్చినపుడు పంత్‌కు ఎక్కువగా స్ట్రయిక్ ఇస్తూ.. తాను ఎక్కువగా పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మొత్తంగా ఒక్క ఇన్నింగ్స్‌తో తాను ఎవరికీ బ్యాకప్ కాదనే విషయాన్ని చాటాలనే కసి మాత్రం అతడిలో కనిపించింది. ఇనేళ్ల కష్టానికి.. ఎదురుచూపులకు దక్కిన ఫలితమే.. సర్ఫరాజ్ భావోద్వేగ సంబరాలు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



టైటాన్స్‌కు పరాజయం

● పీకేఎల్‌లో తలైవాస్ బోణీ

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తొలి మ్యాచ్‌లో విజయంతో శుభారంభం చేసిన తెలుగు టైటాన్స్‌కు రెండో మ్యాచ్‌లోనే ఓటమి ఎదురైంది. శనివారం ఇక్కడి గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44తో తవిళ తలైవాస్ చేతిలో చిత్తయింది. తలైవాస్ రైడర్లు నరేందర్ ఖండోలా, సచిన్ సూపర్-10లు సాధించగా.. సాహిల్ గులియా 5 టాకిలింగ్స్ చేశాడు. కాగా, టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 10 పాయింట్లు స్కోరు చేసినా ఫలితం లేకపోయింది. ఇక, ఆడిన తొలి మ్యాచ్‌లోనే గెలిచి తలైవాస్ లీగ్‌లో అద్భుత బోణీ చేసింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్ 35-25తో హరియాణా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. డిఫెండర్ గౌరవ్ ఖత్రి ఏడు పాయింట్లతో పుణెరి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

వెలుతురులేమిపై వాగ్వాదం



న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌కు దిగాక కేవలం నాలుగు బంతుల్లోనే ఆటను ఆపేశారు. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో అంపైర్లు లైట్ మీటర్ చెక్ చేసి వెలుతురులేమితో నాలుగో రోజు ఆటను ముగిస్తున్నట్టు ప్రకటించారు. వెంటనే కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు వెళ్లారు. అయితే భారత కెప్టెన్ రోహిత్ మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. వెలుతురు బాగానే ఉంది కదా అని ఆకాశానికేసి చూపిస్తూ అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. రోహిత్‌కు కోహ్లీ కూడా కలిశాడు. పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తుండడంతో వేగంగా వికెట్లు తీయాలనేది భారత్ ఉద్దేశం. అప్పటికి మ్యాచ్‌కు ఇంకా 15 నిమిషాల సమయం ఉంది. కానీ అంపైర్లు ససేమిరా అనడంతో పాటు కాసేపటికే భారీ వర్షం కురవడంతో పిచ్‌ను కవర్లతో కప్పేశారు.

ఒకే వేదికపై అప్పుడూ.. ఇప్పుడూ!



సర్ఫరాజ్ కీలక సమయంలో సెంచరీతో జట్టును ఆదుకొన్నాడు. వంద మార్క్ చేరిన అనంతరం అతడు మైదానంలో జోష్‌తో సంబరాలు చేసుకొన్నాడు. అతడి సెలెబ్రేషన్స్ చూసి కెప్టెన్ రోహిత్‌తో పాటు కోహ్లీ నవ్వుకున్నారు. కాగా.. ఈ సందర్భంగా కోహ్లీ, సర్ఫరాజ్ ఒకే వేదికపై పంచుకొన్న ఆనందాలను బీసీసీఐ ఎక్స్‌లో పోస్టు చేసింది. 2015లో రాజస్థాన్‌తో ఐపీఎల్ మ్యాచ్‌లో బెంగళూరు తరఫున 17 ఏళ్ల సర్ఫరాజ్ 21 బంతుల్లో 45 పరుగులు చేయడంతో జట్టు స్కోరు 200 మార్క్ అందుకొంది. ఆ సమయంలో సర్ఫరాజ్ డగౌట్‌కు వస్తున్నప్పుడు కోహ్లీ 'దండం' పెట్టి ప్రశంసించాడు. ఇప్పుడు అదే మైదానంలో టీమిండియా తరఫున సర్ఫరాజ్ సెంచరీ సాధిస్తే.. కోహ్లీ నవ్వుతూ అతడిని ప్రోత్సహించాడు.

టెక్ మహీంద్రా లాభం రెండింతలు

క్యూ2లో రూ.1,250 కోట్లుగా నమోదు.. ఒక్కో షేరుకు రూ.15 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రెండింతలకు పైగా పెరిగి రూ.1,250 కోట్లకు చేరుకుంది. ఆస్తుల విక్రయం ద్వారా ప్రత్యేక ఆదాయం సమకూరడం ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి టెక్ మహీంద్రా లాభం రూ.493.9 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.49 శాతం వృద్ధితో రూ.13,313.2 కోట్లకు పెరిగింది. కాగా, జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ లాభం 46.81 శాతం, రెవెన్యూ 2.36 శాతం వృద్ధి చెందాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు అర్హులైన వాటాదారులను గుర్తించేందుకు నవంబరు 1ని రికార్డు తేదీగా నిర్ణయించింది.

కొత్తగా 6,653 మంది చేరిక

ఐటీ సేవల రంగంలో డిమాండ్ కాస్త నెమ్మదించినప్పటికీ, మా వ్యూహాత్మక మెరుగుదల ప్రయత్నాల్లో పురోగతిని కొనసాగించగలిగామని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి అన్నారు. వ్యాపారాన్ని క్రమంగా కదం తొక్కించడంతో పాటు 15 శాతం నిర్వహణ లాభాల మార్జిన్ సాధన కోసం మోహిత్ జోషి ఈ ఏప్రిల్‌లో ఫోర్టియస్ పేరుతో మూడేళ్ల వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. గడిచిన మూడు నెలల్లో కంపెనీ 60.3 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను దక్కించుకుంది. నికరంగా 6,653 మందిని ఉద్యోగంలో చేర్చుకుంది. దాంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,54,273కు చేరుకుంది.

కోటక్ బ్యాంక్ లాభంలో 5% వృద్ధి

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గాను కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 5 శాతం పెరిగి రూ.3,344 కోట్లకు చేరుకుంది. ఆదాయం రూ.15,900 కోట్లకు ఎగబాకింది. అందులో స్థూల వడ్డీ ఆదాయం రూ.13,216 కోట్లుగా, నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.7,020 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.91 శాతానికి తగ్గింది. గత నెల చివరి నాటికి బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.49 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.43 శాతానికి తగ్గాయి.

తగ్గిన ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం

ముంబై: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24 శాతం తగ్గి రూ.223 కోట్లకు పరిమితమైంది. క్రెడిట్ కార్డు, సూక్ష్మ రుణాల వ్యాపారాల్లో ఒత్తిడి కారణంగా ఆస్తుల నాణ్యత క్షీణించడం ఇందుకు కారణమైందని బ్యాంక్ పేర్కొంది. గత ఏడాదిలో జూలై-సెప్టెంబరు కాలానికి బ్యాంక్ రూ.294 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

అదరగొట్టిన యూకో బ్యాంక్

క్యూ2 లాభంలో 50 శాతం వృద్ధి.. రూ.603 కోట్లుగా నమోదు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం ఏకంగా 50 శాతం వృద్ధితో రూ.603 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.402 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.5,866 కోట్ల నుంచి రూ.7,071 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.1,917 కోట్ల నుంచి రూ.2,301 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో అంచనాలకు తగ్గట్టుగానే బ్యాంక్ పనితీరును కనబరిచిందని, ఈ కాలంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.84 శాతం నుంచి 3.10 శాతానికి పెరిగిందని యూకో బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశ్వనీ కుమార్ వెల్లడించారు. కాగా రానున్న త్రైమాసికాల్లో కూడా ఇదే జోరును కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది మార్చినాటికి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ ఎన్ఐఎం 2.9-3 శాతం ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి రేటు 12-14 శాతం ఉంటుందని భావిస్తున్నట్టు అశ్వనీ కుమార్ పేర్కొన్నారు. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.14 శాతం నుంచి 3.18 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.11 శాతం నుంచి 0.73 శాతానికి తగ్గాయన్నారు. సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.56 శాతం వృద్ధి చెంది రూ.4,73,704 కోట్లకు చేరుకుంది.

క్యూఐపీ ద్వారా రూ.2,000 కోట్ల సమీకరణ

ప్రస్తుత అక్టోబరు-డిసెంబరు (క్యూ3) త్రైమాసికంలో క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.1,500-2,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలని చూస్తున్నట్టు అశ్వనీ కుమార్ తెలిపారు. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) నిబంధనలు చేరుకునే వ్యూహంలో భాగంగా క్యూఐపీకి సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ క్యూఐపీ ద్వారా యూకో బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 2-3 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంక్‌లో ప్రభుత్వానికి 95.39 శాతం వాటా ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.16,821 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.16,821 కోట్ల స్టాండ్ అలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన రూ.15,976 కోట్ల లాభంతో పోలిస్తే 5 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.85,500 కోట్లకు చేరుకుంది. 2023-24లో ఇదే కాలానికి రెవెన్యూ రూ.78,406 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం 6 శాతం వృద్ధితో రూ.17,826 కోట్లుగా నమోదైంది.

హెచ్‌డీబీ రూ.12,500 కోట్ల ఐపీఓ: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రూ.12,500 కోట్ల ఐపీఓ ప్రతిపాదనకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంక్ అనుబంధ విభాగమే ఈ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఈ ఐపీఓలో భాగంగా తమ వాటా నుంచి రూ.10,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించనున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. ఇందుకుతోడు రూ.2,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో కలిపి హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ సైజు రూ.12,500 కోట్లకు చేరుకోనుంది.

బిజినెస్

ఈనెల 25 నుంచి అఫ్కాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. సెబీకి సమర్పించిన పత్రాల (ఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,430 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందులో రూ.1,250 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.4,180 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది.

ఎస్ఎంపీపీ రూ.4,000 కోట్ల ఇష్యూ: రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ సంస్థ ఎస్ఎంపీపీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా రూ.4,000కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

భారత మార్కెట్లోకి ఈఎల్ అండ్ ఎన్ లండన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ లైఫ్‌స్టైల్, కేఫ్ బ్రాండ్ ఈఎల్ అండ్ ఎన్ లండన్.. భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్ (ఆర్‌బీఎల్)తో కలిసి తొలి స్టోర్‌ను ముంబైలో ప్రారంభించింది. భారతీయ కుటుంబాలకు సరికొత్త స్టైల్స్‌ను అందుబాటులోకి తీసుకురావటంతో పాటు కాఫీ ప్రియుల కోసం ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టినట్లు ఈఎల్ అండ్ ఎన్ లండన్ వెల్లడించింది. ఫుడ్ అండ్ బెవరేజేస్ విభాగంలో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు ఈఎల్ అండ్ ఎన్‌తో భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడనుందని ఆర్‌బీఎల్ మాతృసంస్థ రిలయన్స్ రిటైల్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,420 ▲	72,800 ▲	1,07,000 ▲
ముంబై	77,410 ▲	70,908 ▲	92,283 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	510
వరంగల్	497	గోదావరి	510
చిత్తూరు	538	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

వడ్డీ, పెనాల్టీ మినహాయింపులకు ఎలా దరఖాస్తు చేయాలి?



రాంబాబు గొండాల

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'వడ్డీ, పెనాల్టీ మినహాయింపు'నకు ఎవరు అర్హులో ఇంతకుముందు చెప్పుకోవటం జరిగింది. వాస్తవానికి ఇలాంటి ఆమ్నెస్టీ పథకం గురించి జీఎస్‌టీలో నమోదైన వ్యాపారులందరూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. అందుకే ప్రభుత్వం చేసిన ఈ ప్రకటనకు విశేష స్పందన లభిస్తోంది. మరి ఈ ప్రయోజనం ఎలా పొందాలి? దాని విధి విధానాలు ఏమిటో తెలుసుకుందాం.

ఈ ప్రయోజనం పొందటానికి కేసులను మూడు విభాగాలుగా విభజించారు. మొదటిది.. నోటీస్ ఇచ్చినప్పటికీ సంబంధిత ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. రెండోది.. ఆర్డర్ జారీ చేసినా దానికి సంబంధించిన అప్పీల్ ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. మూడోది.. అప్పీల్ ఆర్డర్ జారీ చేసినప్పటికీ ట్రైబ్యునల్ ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. ముందుగా చెప్పినట్లు ఈ కేసులన్నీ 'నాన్ ఫ్రాడ్' క్యాటగిరీ కింద ఇవ్వబడిన నోటీసులు అయ్యి ఉండాలి లేదా 'ఫ్రాడ్' క్యాటగిరీలో ఇచ్చినప్పటికీ దానిని అప్పీల్ లేదా పై స్థాయిలో నాన్ ఫ్రాడ్ మార్చి ఉండాలి.

మొదటి క్యాటగిరీ కేసులకు సంబంధించి వడ్డీ లేదా పెనాల్టీకి సంబంధించిన ప్రయోజనం పొందాలంటే.. ఫారమ్ జీఎస్‌టీ ఎస్‌పీఎల్-01 అనే అప్లికేషన్‌ను సంబంధిత వివరాలు అన్ని నింపి ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. అలాగే మిగతా క్యాటగిరీకి సంబంధించిన కేసులకు ఫారమ్ జీఎస్‌టీ ఎస్‌పీఎల్-02 దరఖాస్తును ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. ఈ అప్లికేషన్ దాఖలు చేయటానికి పూర్వమే అంటే 2025 మార్చి 31 లోపు సంబంధిత ట్యాక్స్ చెల్లించి ఉండాలి. పన్ను కట్టిన వివరాలు, మినహాయింపు కోరే వడ్డీ, పెనాల్టీ వివరాలతో సంబంధిత దరఖాస్తును 2025 జూన్ 30 లోపు దాఖలు చేయాలి. అయితే కొన్ని సందర్భాలలో ఫ్రాడ్ క్యాటగిరీ కేసులను 'నాన్ ఫ్రాడ్' కేసులుగా మార్చుతూ అప్పీల్‌లో లేదా పై స్థాయిలో ఉత్తర్వులు ఇవ్వటం జరుగుతుంది. దీని ప్రకారం కట్టాల్సిన పన్నును 'నాన్ ఫ్రాడ్' కు సంబంధించిన నియమాల ప్రకారం లెక్కించి ఒక ఆర్డర్‌ను కింది స్థాయి అధికారి జారీ చేయటం జరుగుతుంది. అలాంటి సందర్భంలో మాత్రం ఇలా ఆర్డర్ జారీ చేసిన తేదీ నుంచి ఆరు నెలలలోపు జీఎస్‌టీ ఎస్‌పీఎల్-02 ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఇక ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం. అప్లికేషన్ దాఖలు చేసే సమయానికి ఎలాంటి అప్పీల్ లేదా పిటిషన్స్ పెండింగ్‌లో ఉండకూడదు. అలాగే కొంతమంది ఇప్పటికే సంబంధిత పన్నును అంటే ఈ ప్రకటన వెలువడటానికి పూర్వమే చెల్లించి ఉండవచ్చు. వారు కూడా దీనికి అర్హులే. ఒక వ్యక్తికి లేదా సంస్థకు ఒకటి కంటే ఎక్కువ నోటీసులు ఇచ్చి ఉంటే ప్రతి నోటీసుకు విడివిడిగా దరఖాస్తులు దాఖలు చేయాలి. అలాగే నోటీసులో లేదా ఆర్డర్‌లో డిమాండ్ చేసిన పన్ను మొత్తాన్ని చెల్లించి ఉండాలి. ఉదాహరణకు ఒక వ్యక్తికి రెండు రకాల ఉల్లంఘనలకు గాను రూ.కోటి చొప్పున రూ.2 కోట్లకు డిమాండ్ నోటీస్ ఇచ్చారనుకుందాం. దీంతోపాటు వడ్డీ, పెనాల్టీ విధించారు. ఇప్పుడు ఆ వ్యక్తి రూ.కోటి మేర వడ్డీ, పెనాల్టీ మినహాయింపు కోరుతూ ఇంకొక రూ.కోటికి అప్పీల్‌కు వెళ్లలేదు. మినహాయింపు కావాలంటే నోటీసులో ఉన్న మొత్తాన్ని చెల్లించాలి.

అలాగే ఈ మినహాయింపు 2019-20 వరకు ఉన్న ఉల్లంఘనలకే వర్తిస్తుంది. ఒకవేళ ఒకే నోటీసులో తరువాతి కాలం కూడా కలిసి ఉంటే.. ఆ తదుపరి కాలానికి సంబంధించిన పన్నును కూడా చెల్లించినప్పుడే ఈ మినహాయింపు లభిస్తుంది. కానీ, ఈ మినహాయింపు మాత్రం 2019-20 వరకు గల వడ్డీ, పెనాల్టీలకే లభిస్తుంది. తదుపరి కాలానికి వర్తించదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆదివారం



కపుల్స్ ప్రతీది షేర్ చేసుకోవాలి!

నలభై ఐదేళ్ల వయసులోనూ యంగ్‌హీరోయిన్లతో పోటీపడుతూ ప్రేక్షకులను అలరిస్తున్నారు విద్యాబాలన్. ఎప్పుడూ చీరకట్టులో కనిపించే విద్యాబాలన్ వుమెన్ ఓరియెంటెడ్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపును సాధించారు. వైవాహికజీవితం సంతోషంగా ఉందంటున్న విద్యాబాలన్ గురించి మరికొన్ని విశేషాలు ఇవి...

'పరిణీత' సినిమాతో 2005లో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన విద్యాబాలన్ ఆ తరువాత వెనుదిరిగి చూసుకోలేదు. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. "నా 24 ఏళ్ల వయసులో 'పరిణీత' అవకాశం వచ్చింది. ఆ సమయంలో ఏదో సాధించాలనే బలమైన కోరిక ఉండేది. ఇప్పుడు తలుచుకుంటే అప్పుడు ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నానో అనిపిస్తుంది. సినిమా రంగంతో సంబంధం లేకుండా వచ్చిన ఒక అమ్మాయి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడమంటే మాటలు కాదు. నేనేమీ సినిమాలు చూస్తూ పెరగలేదు. మాది మధ్యతరగతి సంప్రదాయ కుటుంబం" అని అంటారు విద్యాబాలన్. సిద్ధార్థ్‌రాయ్ కపూర్‌ని పెళ్లి చేసుకున్న విద్యాబాలన్ అద్దె ఇంట్లో నివసిస్తున్నారంటే ఆశ్చర్యపోకుండా ఉండలేరు. అయితే దీనికి ఒక కారణం ఉందంటారామె. "ఒక మంచి ఇల్లు చూసి తీసుకుందామని చాలా వెతికాం. దాదాపు 25 ఇళ్లు చూశాం. కానీ నచ్చలేదు. ఒకే ఒక్క ఇల్లు నచ్చింది.

అది అద్దెకు మాత్రమే ఇస్తామన్నారు. అన్ని రకాలుగా నచ్చడంతో అద్దె అయినా ఫర్వాలేదని దిగిపోయాం. అద్దె ఇళ్లలో ఉండను అని నేను చాలా సార్లు చెప్పాను. కానీ ఈ ఇల్లు చాలా కంఫర్టబుల్‌గా ఉంది. అందుకే తప్పలేదు. గార్డెన్, సీ వ్యూ..వంటి నాకు నచ్చినవి ఎన్నో ఉన్నాయి" అని కారణాన్ని పంచుకుంటారు విద్యాబాలన్.

పని మాత్రమే సీరియస్

విద్యాబాలన్ చిత్రాలను చూసిన వారెవరైనా సీరియస్ నటి అనుకుంటారు. కానీ ఆమె చాలా సరదాగా ఉంటారు. వుమెన్ ఓరియెంటెడ్ చిత్రాల ఎంపిక వల్ల ఆ ముద్ర పడిపోయింది. "నిజానికి నేను సీరియస్ పర్సన్‌ని కాను. నా పనిని మాత్రమే సీరియస్‌గా చేస్తాను. వుమెన్ ఓరియెంటెడ్ సినిమాల్లో సీరియస్ టోన్ ఉంటుంది. నేను అలాంటి రోల్స్‌ని ఎక్కువ చేయడంతో సీరియస్ నటి అన్న ముద్ర పడిపోయింది" అని అంటారు విద్యాబాలన్.

చీర నా ఫేవరేట్

విద్యాబాలన్ ఎక్కువగా చీరకట్టులోనే కనిపిస్తారు. చీరలను అమితంగా ఇష్టపడటం వెనక కారణం ఏమైనా ఉందా అంటే నా దృష్టిలో సెక్సీయెస్ట్ గార్మెంట్ శారీనే అంటారు. "మీరు గుడికి వెళుతున్నట్టయితే చీరను ఒక రకంగా ధరించవచ్చు. అదే పార్టీకి వెళుతున్నట్లయితే అదే చీరను ఇంకో స్టయిల్‌లో కట్టుకోవచ్చు. ఒకవేళ మీ వర్క్‌ప్లేస్‌కు వెళుతుంటే మరోరకంగా ధరించవచ్చు. నా దృష్టిలో వెర్సటైల్ గార్మెంట్ ఇది. అందుకే నాకు చీరలు ధరించడమంటే ఇష్టం" అని అంటారు విద్యాబాలన్.

వైవాహిక జీవితం..

సినిమా రంగానికే చెందిన సిద్ధార్థ్‌రాయ్ కపూర్‌ని వివాహం చేసుకున్నారు విద్యాబాలన్. పెళ్లయిన తరువాత కూడా సినిమాల్లో బిజీబిజీగా గడుపుతున్నారామె. "పెళ్లి అనేది ఇద్దరి మధ్య ముడిపడిన బంధం. అందులో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదు. భార్యాభర్తల బంధం బాగుండాలంటే కమ్యునికేషన్, షేరింగ్ చాలా ముఖ్యం. భార్యాభర్తల మనసులో ఏముందో మూడో వ్యక్తి తెలుసుకోలేరు. ఒకరి గురించి మరొకరు ఏమనుకుంటున్నారో మూడో వ్యక్తి ఎలా కనుక్కుంటాడు. ప్రతీ జంట ఒక ప్రత్యేకమైన శైలిని కలిగి ఉంటారన్నది నా నమ్మకం. అయితే నా దృష్టిలో ఇద్దరూ ఓపెన్‌గా మాట్లాడుకుంటే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. నేను, సిద్ధార్థ్ ప్రతీదీ చర్చించుకుంటాం. ఒకవేళ ఒకరికి కోపం వచ్చినా, ప్రేమ కలిగినా నిజాయితీగా దాన్ని వ్యక్తపరుస్తాం. అది చాలా ముఖ్యం. ప్రతీదీ షేర్ చేసుకోవడం కపుల్స్‌కి చాలా అవసరం. ఎంత బిజీగా ఉన్నా ఇద్దరూ కలిసి కొంత టైం స్పెండ్ చేయడం కూడా ముఖ్యమే. సంతోషంగా ఎలా జీవించాలో సిద్ధార్థ్‌కు బాగా తెలుసు. నాకు అది తెలియదు. నేను చాలా డిసిప్లిన్‌గా ఉంటాను. జీవితాన్ని ఎలా చేయాలో, ఎలా రిలాక్స్ కావాలో తనే నేర్పించాడు. ఇద్దరం కలిసి ట్రావెల్ చేయడాన్ని ఇష్టపడతాం" అని అంటారు విద్యాబాలన్. ఆమె నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'దో ఔర్ దో ప్యార్' ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలయింది.

> "షూటింగ్ లేకపోతే వీలైనంత వరకు ఇంటికే పరిమితమవుతాను. కుటుంబసభ్యులతో గడపడానికి ఇష్టపడతాను. ఎక్కువగా నిద్రపోతాను. పుస్తకాలు చదువుతాను. సినిమాలు చూస్తాను. రిలాక్స్ అవుతాను. సోషల్ మీడియాలో వచ్చే అన్నిపోస్టులను చదవను. నేనేదైనా పోస్టు చేయాలనుకుంటే నా సోషల్ మీడియా టీమ్ ఆ పనిచేసి పెడుతుంది. ఇన్‌స్టాలో ఫొటోలు చూస్తుంటాను. కామిక్ రీల్స్ అంటే ఇష్టం."

గోల్డెన్ రేషియో

ప్రపంచం మొత్తంలో పది మంది అత్యంత అందమైన అతివలను ప్రతి ఏటా ఎంపిక చేస్తూ ఉంటారు. 'గోల్డెన్ రేషియో ఫార్ములా' ఆధారంగా ఎంపిక చేసే ఆ పది మంది అందగత్తెల్లో మన బాలీవుడ్ భామ దీపికా పదుకొనె కూడా ఉంది. ఆ విశేషాలు తెలుసుకుందాం!

లండన్‌లో స్థిరపడిన ఫేసియల్ కాస్మొటిక్ సర్జన్, డాక్టర్ జులియన్ డి సిల్వ, ప్రతి ఏటా, ప్రపంచ వ్యాప్తంగా పది మంది అందమైన మహిళలను ఎంపిక చేసి, ర్యాంకుల వారీగా వాళ్ల పేర్లను ప్రకటిస్తూ ఉంటాడు. అందుకోసం అతను గోల్డెన్ రేషియో ఫార్ములాను అనుసరిస్తూ ఉంటాడు. శాస్త్రీయ కొలతలతో అందాన్ని కొలవడం ఈ గ్రీకు ఫార్ములా ప్రత్యేకత. ముఖం పొడవు, వెడల్పుల ఆధారంగా గోల్డెన్ రేషియోను లెక్కిస్తారు. 1.618 నిష్పత్తికి దగ్గరగా ఉన్న విలువలను ఆదర్శ సౌందర్యంగా లెక్కించడం ఆనవాయితీ! ఈ నిష్పత్తిని ప్రత్యేకమైన ముఖ లక్షణాలకు కూడా అన్వయిస్తూ ఉంటారు.

గోల్డెన్ రేషియో స్కోర్లు

డాక్టర్ డి సిల్వ, ఎంపిక చేసిన పది మంది అందగత్తెల్లో మొదటి స్థానాన్ని ఇంగ్లీషు నటి, జోడీ కోమర్ సొంతం చేసుకుంది. ఈమె గోల్డెన్ రేషియో, 94.52 శాతం. ఆమె పెదవులు, ముక్కు తీరు, 98.7 శాతం స్కోరును దక్కించుకున్నాయి. ముక్కు కొలత, పెదవుల ఆకారం, కళ్ల ప్రదేశాలు కూడా ఆమెకు మంచి మార్కులే తెచ్చిపెట్టాయి. ఇదిలా ఉంటే, డాక్టర్ డి సిల్వ ప్రపంచంలోని పది మంది అందగత్తెల్లో దీపికా పదుకొనెకు తొమ్మిదో స్థానాన్ని కల్పించాడు. ఈ పోటీలో దీపిక 91.22 స్కోరును పొందడం విశేషం. 2018లో కూడా దీపికను, యుకెలోని

మన దీపిక బంగారమే!

వార్తాపత్రిక, ఈస్టర్న్ ఐ, సెక్సీయెస్ట్ ఇండియన్ విమెన్‌గా ప్రకటించింది. తాజాగా తల్లైన ఈ 38 ఏళ్ల బాలీవుడ్ భామ, నవంబరు ఒకటిన విడుదల కాబోతున్న సింఘం ఎగైన్ చిత్రంలో కనిపించబోతోంది. ఒక్కో సినిమాకు 15 నుంచి 30 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటూ, ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యంత ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్న తారగా కూడా దీపిక పేరు తెచ్చుకుంది.

వీళ్లే ఆ పది మంది

స్కోర్ ఆధారంగా ఎంపికైన పది మంది అందగత్తెల్లో ఇంగ్లీషు నటి జోడీ కోమర్ 94.52 శాతాన్ని సాధిస్తే, అమెరికన్ నటి, గాయని, జెండాయా 94.37 శాతాన్ని, అమెరికన్ మోడల్, బెల్లా హదీద్, 94.35 శాతాన్నీ, అమెరికన్ గాయని,



బియాన్సే 92.44, మెరికన్ గాయని, నటి ఆరియానా గ్రాండె, 91.81, అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్ 91.64, బ్రిటిష్ మోడల్ జోర్డాన్ డన్, 91.39, అమెరికన్ టివి పర్సనాలటీ, కిమ్ కర్దాషియాన్ 91.28, భారతీయ హిందీ నటి దీపిక పదుకొనె, 91.22 శాతం, దక్షిణ కొరియా మోడల్, హో యాన్ జుంగ్, 89.63 శాతం స్కోరునూ సొంతం చేసుకున్నారు.

> మనం ముఖం పొడవు, వెడల్పులను కొలిచి, ఆ విలువలను పొడవు, వెడల్పులతో భాగిస్తే వచ్చే ఫలితమే గోల్డెన్ రేషియో. ఆ ఫలితం 1.62కు దగ్గరగా ఉండాలి. ఈ అంకెను 'ఫై' అంటారు. ఈ పేరు, గ్రీకు శిల్పి ఫైడియాస్ నుంచి వచ్చింది. ఇతను తాను చెక్కే విగ్రహాలకు ఇదే సూత్రాన్ని అన్వయిస్తూ ఉంటాడు.

గోల్డెన్ రేషియో అంటే?

మనం ముఖం పొడవు, వెడల్పులను కొలిచి, ఆ విలువలను పొడవు, వెడల్పులతో భాగిస్తే వచ్చే ఫలితమే గోల్డెన్ రేషియో. ఆ ఫలితం 1.62కు దగ్గరగా ఉండాలి. ఈ అంకెను 'ఫై' అంటారు. ఈ పేరు, గ్రీకు శిల్పి ఫైడియాస్ నుంచి వచ్చింది. ఇతను తాను చెక్కే విగ్రహాలకు ఇదే సూత్రాన్ని అన్వయిస్తూ ఉంటాడు. ఈ కాన్సెప్ట్ ఆధారంగా ఒకరి ముఖాన్ని అంచనా వేసేటప్పుడు, ఆ ముఖంలో ఆకట్టుకునే లక్షణమేదో, గోల్డెన్ రేషియా సూత్రాల ఆధారంగా ఆ లక్షణానికి ఎంత స్కోరును కేటాయించవచ్చో లెక్కిస్తారు. ముఖంలో వేర్వేరు అవయవాల మధ్య ఉండే వ్యత్యాసం, దూరాలను కూడా కచ్చితంగా లెక్కిస్తారు. ఉదాహరణకు, వెంట్రుకలకూ కళ్లకూ మధ్య ఉండే దూరం, రెండు కళ్లకూ మధ్య ఉండే దూరం, ముక్కు దిగువ నుంచి చుబుకం వరకూ ఉన్న దూరాలను లెక్కించి, ఆదర్శవంతమైన నిష్పత్తితో సరిపోల్చుతారు. ఆ నిష్పత్తి 1.62 నిష్పత్తికి ఎంత దగ్గరగా ఉంటే, గోల్డెన్ రేషియో స్కోర్‌ను అంత ఎక్కువ ఉన్నట్టు లెక్క. సాధారణంగా ఈ కొలతలను, నిష్పత్తులనూ కాస్మొటిక్ సర్జరీలు, ఈస్థటిక్స్‌లో ముఖాన్ని అందంగా కనిపించేలా తీర్చిదిద్దే క్రమంలో ఉపయోగిస్తూ ఉంటారు. ప్రపంచంలోని పది మంది అందగత్తెలను ప్రకటించిన డాక్టర్ డి సిల్వ ఈ గోల్డెన్ రేషియో గురించి మాట్లాడుతూ... "కళ్లు, పెదవులు, ముక్కు మొదలైన, ముఖంలోని ఎలిమెంట్స్‌ను పరీక్షించడం కోసం మా క్లినిక్‌లో డిజిటల్ మ్యాపింగ్‌ను ఉపయోగిస్తాం. తర్వాత ఈ ఎలిమెంట్స్‌ను గోల్డెన్ రేషియోతో సరిపోల్చి, వాళ్ల ఆకర్షణను లెక్కిస్తాం. అలాగే ముక్కు, కళ్లు, పెదవుల మధ్య దూరాన్ని సాఫ్ట్‌వేర్ సహాయంతో విశ్లేషించి, వాటిని గోల్డెన్ రేషియోతో సరిపోల్చి, అలైన్‌మెంట్‌ను నిర్ధారిస్తాం" అంటూ సౌందర్య స్కోర్‌ను లెక్కించే విధానాన్ని వివరిస్తున్నాడు.

జీబ్రా స్ట్రిప్పింగ్ తెలుసా?

నవంబర్ నుంచి ఇక వరుసగా పండగలు వస్తాయి. పండగలు వచ్చాయంటే ఫ్రెండ్స్ రావటం .. పార్టీలు చేసుకోవటం మామూలే! కొన్ని సార్లు ఈ పార్టీల వల్ల మర్నాడు ఉదయం హ్యాంగోవర్లు రావటం కూడా మామూలే! ఈ మధ్య కాలంలో ఇలాంటి హ్యాంగోవర్లను తప్పించుకోవటానికి- జీబ్రా స్ట్రిప్పింగ్ అనే కొత్త పద్ధతిని పౌష్టికాహార నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పద్ధతిలో ఆల్కహాల్ తాగిన వెంటనే నాన్ ఆల్కాహాలిక్ డ్రింక్స్‌ను తాగుతారు. దీని వల్ల అదనంగా ఆల్కహాల్ తాగటం తగ్గుతుంది. దీనితో లివర్‌పై ఒత్తిడి తక్కువ అవుతుంది. హ్యాంగోవర్ కూడా ఉండదు. ఇక పార్టీలకు వెళ్లే సమయంలోనే ముందుగానే ప్లాన్ చేసుకొమ్మని నిపుణులు సూచిస్తున్నారు. వీరి సూచనల ప్రకారం..

- ముందుగానే ఎంత ఆల్కహాల్ తాగాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. ఎటువంటి పరిస్థితుల్లో అంత కన్నా ఎక్కువ తాగకూడదు.
- ఈ మధ్యకాలంలో అన్ని చోట్ల మాక్‌టైల్స్ లభిస్తున్నాయి. వీలైనంత వరకు ఆల్కహాల్ బదులుగా ఈ మాక్‌టైల్స్‌ను తాగితే మంచిది.
- ఇతరులు ఒత్తిడి చేస్తున్నారని వేగంగా ఆల్కహాల్ తాగకూడదు. వీలైనంత నెమ్మదిగా తాగాలి. దీని వల్ల ఆల్కహాల్ ఇన్‌టేక్ తగ్గుతుంది.

టాలీవుడ్‌లో కామియో మెరుపులు


డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చెంది, ఓటీటీలు అందుబాటులోకి రావడంతో వీక్షకులకు యూనివర్సెల్ కంటెంట్ విపరీతంగా అందుబాటులోకి వచ్చింది. భాషలతో సంబంధం లేకుండా పాన్ వరల్డ్ కథలు ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి. దాంతో ఓటీటీ ప్రస్తుతం నిత్య అవసరాల్లో ఒకటిగా మారిపోయింది. దీని వల్ల థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసే వారికి సంఖ్య నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. న్యూ ఏజ్, కొత్త తరహా కంటెంట్‌కు అలవాటు పడిన వీక్షకుడిని ఆకర్షించాలంటే చూడని కథను చూపించాలి. తెరపై అద్భుతాలను ఆవిష్కరించాలి. వీటితోపాటు తెరపై నచ్చిన స్టార్లు, గొప్ప కాంబినేషన్లతో అయినా మెస్మరైజ్ చేయాలి. లేదంటే కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌ని థియేటర్స్‌కు తీసుకు రావడం చాలా కష్టమే! మళ్లీ ప్రేక్షకుల్ని థియేటర్ బాట పట్టించటానికి దర్శక నిర్మాతలు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఏదో ఒక పాత్రలో ప్రముఖ నటి లేదా నటుడిని కామియో రూపంలో జొప్పిస్తున్నారు.

కథ రసవత్తరంగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా ఒక స్టార్ మెరుపులా తెరపై మెరవటం ఆ పాత్ర కథకు చాలా కీలకం కావడం ఈ మధ్యకాలంలో చాలానే చూశాం. కొన్ని సందర్భాల్లో ఆ పాత్ర సినిమాకు కీలకం కావచ్చు, అతిథిగా మెరిసే పాత్ర కూడా కావచ్చు. ఇలా ప్రేక్షకుల్ని ఆకర్షించడం ఓ ట్రెండ్‌గా మారింది. అయితే ఇది తెలుగు తెరకు కొత్తేమీ కాదు. గతంలోనూ ఇలాంటి కామియో రోల్స్ చేసిన తారలు ఉన్నారు. దీని వల్ల ప్రేక్షకులతోపాటు ఆ సినిమా హీరోతోపాటు కామియో చేసిన నటుడి అభిమానులను ఆకర్షించే అవకాశం ఉంది.

ఇటీవల కాలంలో చూసుకుంటే ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఎడి' చిత్రంలో రాజమౌళి భైరవకు రైవల్‌గా, రామ్‌గోపాల వర్మ చెఫ్ చింటుగా, దుల్కర్ సల్మాన్ పైలట్‌గా, విజయ్ దేవరకొండ అర్జునుడిగా, మాళవిక నాయర్ ఉత్తరగా ఓ రాణి పాత్రలో, ఫరియా అబ్దుల్లా కాంప్లెక్స్‌లో డ్యాన్సర్‌గా కాసేపు కనిపించి మెప్పించారు. అలాగే రవితేజ హీరోగా హరీష్ శంకర్ రూపొందించిన మిస్టర్ బచ్చన్ చిత్రంలో యూత్ యువరాజ్‌గా తనదైన శైలిలో మెప్పించాడు సిద్ధూ. కమిటీ కుర్రాళ్లు క్లైమాక్స్‌లో మెగా డాటర్ నిహారిక ఓ పాటలో మెరిసింది. నవదీప్ నటించిన 'లవ్ మౌళి'లో రానా గెస్ట్‌గా కనిపించి మెప్పించారు. 'మా నాన్న సూపర్ హీరో'లో రాజు సుందరం మెరిశారు.

కొందరు హీరోలు అయితే ఎప్పుడూ హీరోలుగానే కనిపించాలా? సినిమాకు అవసరం, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అంటే కామియో చేయడానికి ఏ మాత్రం ఆలోచించడం లేదు. గతంలో హిందీ చిత్రాల్లో నటించిన నాగార్జున చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత హిందీ చిత్రం 'బ్రహ్మాస్త్ర'లో నటించారు. ఇందులో నాగార్జున పోషించిన పాత్ర ఆర్కియాలజిస్ట్ పాత్ర సినిమాకు కీలకంగా నిలిచింది.

హిందీ ప్రేక్షకులతోపాటు తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించారు. వెంకటేశ్ కూడా తన స్నేహితుడు సల్మాన్ ఖాన్ కోసం 'కబీ ఈద్ కబీ దివాలీ'లో కీ రోల్ చేశారు. సినిమాలు చేస్తున్నారు. గత ఏడాది సంక్రాంతి బరిలో విజయం సాధించిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో మాస్ మహారాజ రవితేజ చిరుకి తమ్ముడికి కీలక పాత్ర పోషించి మెప్పించారు. గతంలో వీరిద్దరూ అన్నయ్య సినిమాలో కలిసి నటించారు. అలాగే చిరంజీవి హీరోగా నటించిన 'గాడ్ ఫాదర్'లో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కీలక పాత్ర పోషించారు. ఈ మధ్యకాలంలో విడుదలయిన విజయ్ 'గోట్' సినిమాలో ఒక సీనులో ధోని కనిపిస్తాడు. రజనీకాంత్ 'కూలీ' సినిమాలో అమీర్‌ఖాన్ ఒక చిన్న పాత్రలో కనిపించనున్నాడనే వార్త ప్రేక్షకులకు కొత్త కిక్‌ను ఇచ్చింది.



బాలీవుడ్‌లో మామూలే...

టాలీవుడ్‌లో ఒకప్పుడు కామియో పాత్రలు అడపాదడపా కనిపిస్తుండేది. బాలీవుడ్‌లో మాత్రం తరచూ ఏదో ఒక సినిమాలో స్టార్ టు స్టార్ కామియో చూస్తుంటాం. పఠాన్ సినిమాలో సల్మాన్‌ఖాన్, టైగర్ 3 సినిమాలో షారూక్ ఖాన్, ఆల్ఫాలో హృతిక్ రోషన్, ఘూమర్ సినిమాలో అమితాబ్ బచ్చన్, బ్యాడ్ న్యూస్ సినిమాలో అనన్యపాండేలు ఒక మెరుపు మెరిసి ప్రేక్షకులకు అలరించారు. తాజాగా హిట్ అయిన 'స్త్రీ2' సినిమా ఉత్కంఠగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా అక్షయ్‌కుమార్ ఒక మెరుపులా మెరుస్తాడు. చాలా మంది ప్రేక్షకులకు ఇంటికి తిరిగి వచ్చేసిన తర్వాత కూడా అక్షయ్ పాత్ర గుర్తుండిపోతుంది. అలాగే టాలీవుడ్‌లో మంచు విష్ణు కీలక పాత్రలో తెరకెక్కుతున్న కన్నప్ప చిత్రంలో ప్రభాస్, కాజల్, శరత్‌కుమార్, అక్షయ్ కుమార్, ప్రీతి ముకుందన్, మోహన్‌లాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అంతే కాదు బాలీవుడ్ సినిమాల్లో టాలీవుడ్ హీరోలు కామియో పాత్రలు చేసి పాన్ ఇండియా సినిమాలుగా మారుస్తున్నారు. హిందీలో ఆమిర్‌ఖాన్ హీరోగా అద్వైత్ చందన్ తెరకెక్కించిన 'లాల్‌సింగ్ చద్దా'లో అక్కినేని నాగచైతన్య కీలక పాత్ర పోషించారు. గతంలో హిందీ చిత్రాల్లో నటించిన నాగార్జున చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత హిందీ చిత్రం 'బ్రహ్మాస్త్ర'లో నటించారు. ఇందులో నాగార్జున పోషించిన పాత్ర ఆర్కియాలజిస్ట్ పాత్ర సినిమాకు కీలకంగా నిలిచింది. విశ్వనాయకుడు కమల్‌హాసన్ కమ్‌బ్యాక్ సినిమాలో తమిళ స్టార్ హీరో సూర్య రోలెక్స్ అనే అద్భుతమైన పాత్ర పోషించారు. అది సినిమాకు చాలా ప్లస్ అయింది. చిత్రంలో సూర్య ఎంట్రీతో మూవీ లవర్స్ థియేటర్స్‌లో గోల పెట్టారు.


మరోవైపు మలయాళ స్టార్స్ మమ్ముట్టి, పృథ్వీరాజ్ కూడా కామియో పాత్రలు చేస్తున్న జాబితాలో ఉన్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్'లో మమ్ముట్టి కీ రోల్ చేశారు. పాన్ ఇండియా చిత్రం సలార్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. హీరో దుల్కర్ సల్మాన్ నటించిన తెలుగు చిత్రం సీతారామం లో సుమంత్ కీ రోల్ చేశారు. చిరంజీవి నటించిన 'ఆచార్య', గాడ్ ఫాదర్ చిత్రాల్లో సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు. హీరోగా ఫామ్‌లో ఉన్న మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ 'ముఖచిత్రం'లో కీ రోల్ చేశారు.

> గతంలో దర్శకుడు, నిర్మాత ఏదో ఒక సన్నివేశంలో కనిపించేవారు. దాసరి నారాయణరావు, రామానాయుడు, ఎంఎస్ రాజు, అనీల్ రావిపూడి ఇలా చెప్పుకుంటే ఎందరో ఉన్నారు. ఏదో ఒక చిత్ర పాత్ర పోషించి మెప్పించేవారు. ప్రేక్షకులకు థ్రిల్ ఫీలయ్యేలా చేసేవారు. ఆ తర్వాతి కాలంలో ఈ కామియోలు తగ్గాయి. కానీ కోవిడ్ తర్వాత ప్రేక్షకులను ఆకర్షించటానికి దర్శకులు దీనిని ఒక వ్యూహంగా వాడుకుంటున్నారు. కల్కి 2898 సినిమాలో రాజమౌళి, రామ్‌గోపాల్ వర్మ, విజయ్ దేవరకొండలు చిన్న చిన్న పాత్రల్లో మనకు కనిపిస్తారు. అవన్నీ సినిమాకు బోనస్‌గా నిలిచాయి. అభిమానులకు కొత్త అనుభూతిని కలిగించాయి.

> సీనియర్ హీరోలు, యంగ్ హీరోలు కలిసి 'కీరోల్స్' చేయడం మంచి పరిణామం. ఎలాగూ ఆయా సినిమా హీరోకి ఉన్న స్టార్‌డమ్ వల్ల ఆ చిత్రంపై అంచనాలు కామన్‌గానే ఉంటాయి అదే సినిమాలో ఇంకో హీరో కీ రోల్‌లో యాడ్ అయితే అదనపు బలం చేకూరుతుంది. ప్రస్తుతం ఉన్న ఇదే ట్రెండ్ కొనసాగితే భవిష్యత్తులో కామియోలు లేకుండా సినిమాలను ఊహించుకోవటమే కష్టం అవుతుంది.

ఈ వారమే విడుదల

ఈరోజు నుంచి వచ్చే శనివారం వరకు వివిధ ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			**జియో సినిమా**		
ఫ్యామిలీ ప్యాక్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 23	ది బైక్‌రైడర్స్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 21
ది కమ్‌బ్యాక్:2004 బోస్టన్ రెడ్ సాక్స్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 23	ఫ్యూరియోసా: ఎ మ్యాడ్ మ్యాక్స్ సాగా	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 23
బ్యూటీ ఇన్ బ్లాక్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24	ది మిరండా బ్రదర్స్	హిందీ చిత్రం	అక్టోబర్ 25
టెర్రిటరీ	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24	**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్**		
దట్ నైన్టీస్ షో	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24	ది లెజెండ్ ఆఫ్ హనుమాన్ 5	తెలుగు డబ్బింగ్ సిరీస్	అక్టోబర్ 25
దో పత్తీ	హిందీ చిత్రం	అక్టోబర్ 25	**జీ 5**		
డోంట్ మూవ్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 25	ఐందం వేదం	తమిళ చిత్రం	అక్టోబర్ 25
హెల్‌బౌండ్ 2	కొరియన్ సిరీస్	అక్టోబర్ 25	ఏ జిందగీ	హిందీ చిత్రం	అక్టోబర్ 25
అమెజాన్ ప్రైమ్			**ఆపిల్ టీవీ ప్లస్**		
నాటిలిస్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 25	బిఫోర్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 25
జ్విగాటో	హిందీ చిత్రం	అక్టోబర్ 25			



ఆ రహస్యం ఏమిటి?

కృతీసనన్, కాజోల్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన హిందీ చిత్రం 'దో పత్తీ'. శశాంక్ చతుర్వేది దర్శకత్వం వహించారు. కృతీసనన్ నిర్మించడంతో పాటు ద్విపాత్రాభినయం చేశారు. కాజోల్ కెరీర్‌లో తొలిసారి పోలీస్ అధికారి పాత్రను పోషించారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే చిత్రమిది. కవలలైన అక్కచెల్లెళ్లు ఇద్దరూ ఒకే అబ్బాయిపైన మనసు పడడం, వారి జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో కథ సాగుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. అక్కచెల్లెళ్ల పోరాటం ఎలాంటి విపత్కర పరిస్థితులకు దారి తీసింది, పోలీస్‌లకు తెలియకుండా వారు దాచాలనుకున్న రహస్యాలేవిటి అనేది సినిమాపై ఆసక్తిని పెంచింది.










విదేశీ నేస్తాలు వచ్చేశాయ్

పక్షుల కిలకిలరావాలతో ఉప్పలపాడు కళకళ

పక్షుల కిలకిలరావాలు, విదేశీ పక్షుల విన్యాసాలతో గుంటూరు జిల్లా ఉప్పలపాడు పులకిస్తోంది. గ్రామంలో ఎటు చూసినా పక్షుల విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. శీతాకాలం ప్రారంభ సమయంలో వలస పక్షులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఈ నెలలో అత్యధికంగా ఓపెన్ బిల్డ్ స్టార్క్ పక్షులు తరలి వచ్చాయి. దక్షిణాఫ్రికా నుంచి ఇక్కడి దాకా వలస వచ్చాయి. ఇంకా... వైట్ హైవేస్, డాటర్/స్నేక్ బర్డ్, నీటికాకులు, పెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్ తదితర జాతుల పక్షులూ ఉప్పలపాడుకు వస్తాయి. సంతానోత్పత్తి తర్వాత తిరిగి నవంబరు, డిసెంబరు నెలల్లో స్వస్థలాలకు వెళ్లిపోతాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెదకాకాని

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆలపాటి, పేరాబత్తుల

- పట్టభద్రుల స్థానాలకు పేర్లు ఖరారు చేసిన టీడీపీ
- మిత్రపక్షాల సమ్మతి కోసం చర్చలు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు చోట్ల పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో జరగబోయే ఎన్నికలకు తమ అభ్యర్థులను టీడీపీ ఖరారు చేసింది. మిత్రపక్షాల సమ్మతి కోసం చర్చలు జరుపుతోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ స్థానానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఖరారు చేశారు. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ స్థానానికి పేరాబత్తుల రాజశేఖర్, కటకం బాబ్జీ, మెట్ల రాంబాబు పేర్లు పరిశీలనకు రాగా, చివరకు పేరాబత్తుల రాజశేఖర్ పేరును ఖరారు చేశారు. శనివారం ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దీనిపై చర్చించారు. ఆలపాటి, పేరాబత్తుల పేర్లను ఆమోదించారు. వీరికి మద్దతు ఇవ్వాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫోన్లు చేసి విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ నేతలతో చర్చించి ఒకటి రెండు రోజుల్లో అభిప్రాయం చెబుతామని వారిద్దరూ టీడీపీ నేతలకు చెప్పినట్లు సమాచారం. వారి సమ్మతి వచ్చిన తర్వాత ఈ రెండు పేర్లు అధికారికంగా ప్రకటించాలని టీడీపీ భావిస్తోంది.

జోగి రాజీవ్ బెయిల్ రద్దు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన ఏసీబీ

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్, సర్వేయర్ అజ్మీరా రమేశ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఏసీబీ అధికారులు వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న జోగి రాజీవ్, అజ్మీరా రమేశ్‌కు నోటీసులు జారీ చేసింది. వారికి నేరుగా నోటీసులు అందజేసేందుకు ఏసీబీ అధికారులకు వెసులుబాటు ఇచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లా అంబాపురం గ్రామం పరిధిలో సీఐడీ జప్తు చేసిన 2,160 చదరపు గజాల అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయించారనే ఆరోపణలతో జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, మరికొందరిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో జోగి రాజీవ్, మండల సర్వేయర్ అజ్మీరా రమేశ్‌కు విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ ఏసీబీ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: పీయూష్

న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో మూడు పారిశ్రామిక వాడలను డెవలప్ చేస్తామని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ఇప్పటికే కృష్ణపట్నం అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవల తనకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. పోర్ట్ లాండ్ పారిశ్రామిక అభివృద్ధికి భూములు బదిలీ చేయాలని, దీనిని పరిశీలించేందుకు ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి చొప్పున సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ఏపీ ప్రతిపాదనలను పరిశీలించి మౌలిక సదుపాల కల్పనకు సిఫారసులు చేస్తుందన్నారు. దీనివల్ల పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందని చెప్పారు. మడ అడవులను కూడా ఏవిధంగా ఉపయోగించాలో ఆలోచిస్తున్నామని పీయూష్ చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య పోటీ ఉండాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని అన్నారు. అమెరికాతో కీలకమైన ఖనిజ వనరుల భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. ప్రపంచంలో భారత దేశం 'క్లీన్ ఎనర్జీ' రాజధానిగా అవతరించనున్నదని చెప్పారు.

ఆవిష్కరణల రంగంలో ఏపీ ముందంజలో ఉండాలి

- కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తోందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఏపీలో ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. ఆవిష్కరణల రంగంలో ఏపీ ముందంజలో ఉండాలని, భవిష్యత్తుకు కొత్త చరిత్రను అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ సమ్మిట్ నిర్వహణతో వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగాలలో డ్రోన్ టెక్నాలజీ సామర్థ్యం మరింతగా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రోన్ సమ్మిట్‌లో తాను భాగమయ్యేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నానని పేర్కొన్నారు.

మరో రెండేళ్లు ఆపండి!

- సర్దుబాటు చార్జీలపై విద్యుత్ నిపుణుడు వేణుగోపాలరావు

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 2022-23 సంవత్సరానికి చెందిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు రూ.8,114 కోట్లపై రెండేళ్లుగా నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారని.. మరో రెండేళ్లు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని విద్యుత్తు రంగ నిపుణులు ఎం.వేణుగోపాలరావు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)ని కోరారు. 2022-23లో డిమాండ్ లేదంటూ 11,000 ఎంయూ బ్రేకింగ్ డౌన్‌చేసి.. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసేందుకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలపై ఈఆర్‌సీ వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొన్నారు. రెండేళ్లుగా నిర్ణయం తీసుకోనందువల్ల వినియోగదారులకు కలిగిన నష్టంపై ఈఆర్‌సీ వేసిన ప్రశ్నకు వేణుగోపాలరావు పైవిధంగా స్పందించారు. సర్దుబాటు ఛార్జీలపై అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నెలవారీ వసూలు చేయకుండా.. ఒకేసారి 12 పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడం ఏంటని ఈఆర్‌సీని ప్రశ్నించారు. జాప్యం వల్ల ఛార్జీల భారం తడిసిమోపెడవుతుందన్నారు. డిస్కమ్‌లకు ఆదాయం రాకపోవడం వల్ల ఆర్థికంగా చితికిపోతాయని వెల్లడించారు. హిందూజాకు రూ.1,234 కోట్లను డిస్కమ్‌లు చెల్లించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) విద్యుత్తు కొనుగోలు వల్ల రాష్ట్రానికి ఆర్థిక భారం పెరుగుతుందన్నారు.

'రుషికొండ'.. గుదిబండ!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక స్థోమత కలిగిన సంస్థకు మాత్రమే అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రుషికొండ ప్యాలెస్ వినియోగంపై కూటమి సర్కారు తర్జన భర్జన పడుతోంది. దీనిపై నిపుణులు పలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఏం చేశారంటే..

రుషికొండపై ప్యాలెస్ కట్టడం కోసం అక్కడ ఉన్న పర్యాటక శాఖ కాటేజీలను కూల్చివేశారు. పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదు. 4.5 ఎకరాల్లో భవనాల నిర్మాణం కోసం 22 ఎకరాల మేర కొండను ఇష్టానుసారం తవ్వేశారు. ఐదు ఎకరాల్లో వేలాది మొక్కలతో ల్యాండ్ స్కేపింగ్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. పర్యాటకుల కోసం ఏడు నక్షత్రాల హోటల్, కన్వెన్షన్ సెంటర్, గదులు నిర్మిస్తామని మభ్యపెట్టి ఐదు బ్లాకుల్లో పడక గదులు, డైనింగ్, లివింగ్ రూమ్‌లు, సమావేశ మందిరాలు నిర్మించుకున్నారు. రాజభవనంలా విశాలంగా, విలాసంగా నిర్మించారు. ఐదు బ్లాకుల భవనాలను 1,48,413 చ.అ. విస్తీర్ణంలో నిర్మించారు. చదరపు అడుగుకు సగటున రూ.30 వేలు ఖర్చు చేశారు. కొన్ని భవనాలకు మాత్రమే ఫర్నీచర్ సమకూర్చారు. ఈలోగా ఎన్నికలు రావడం, వైసీపీ ఓడిపోవడంతో అవన్నీ ఆగిపోయాయి. వాటి కోసం కొనుగోలు చేసిన ఫర్నీచర్ ఎక్కడుందో కూడా తెలియడం లేదు.

విద్యుత్ బిల్లులు పెండింగ్

గత ఏడాది నవంబరు నుంచి రుషికొండ ప్యాలెస్‌కు విద్యుత్ వినియోగిస్తున్నారు. అప్పటి నుంచి నెలకు సగటున రూ.7 లక్షల విద్యుత్ బిల్లు వస్తోంది. విద్యుత్ బిల్లులు చెల్లించక ఇప్పటి వరకు దాదాపు రూ.85 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఆ భవనం ఆవరణలో కేవలం రాత్రిపూట విద్యుద్దీపాలు వెలిగించినందుకే ఈ మొత్తంలో బిల్లు వచ్చింది.

కార్పొరేట్ సమావేశాలకైతే...

విశాఖపట్నంలో వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థలకు సంబంధించి తరచూ భారీ కార్పొరేట్ సమావేశాలు జరుగుతుంటాయి. అటువంటి వాటికి ఈ భవనాలు ఉపయోగించుకుంటే బాగుంటుందని విశాఖకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు సూచించారు. పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీటీడీసీ పర్యాటక ఆస్తులను లీజుకు ఇచ్చినట్టు దీనిని కూడా ఇస్తే ప్రభుత్వానికి భారమే తప్ప రూపాయి ఆదాయమూ రాదు కాబట్టి ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎంబసీ కార్యాలయాలకు ఇస్తే మేలు

రాష్ట్రంలో వీసా ఫెసిలిటేషన్ సర్వీస్ సెంటర్ లేదు. హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. రుషికొండలోని ఐదు భవనాల్లో ఒక దానిని ఇందుకోసం కేటాయిస్తే బాగుంటుంది. సింగపూర్, మలేషియా, దుబాయ్, అమెరికా తదితర దేశాలతో వ్యాపార సంబంధాలు పెంచుకోవడానికి, పెట్టుబడులు తెప్పించుకోవడానికి వీలుగా రెండు భవనాలను డిప్యూటీ హై కమిషనర్ కార్యాలయాలకు ఇవ్వాలి. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం పనిచేస్తున్న ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డును ఇక్కడే పెట్టాలి. ఇంకో భవనాన్ని ఐటీ ప్రమోషన్స్‌కు వినియోగించుకుంటే మేలు.

- ఒ.నరేశ్‌కుమార్, సీఈఓ, సింబయోసిస్ టెక్నాలజీస్

లోపల ఏముందో..?

ఈ భవనాల లోపల ఎలా ఉంది? అని తెలుసుకోవడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. కానీ ప్రభుత్వం అటువంటి ఏర్పాట్లు ఏమీ చేయలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్ కూడా ఇప్పటి వరకూ లోపలకు వెళ్లి చూడలేదు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాత్రమే ఎన్నికల ఫలితాలు వెలువడిన నెలలోనే వెళ్లి చూశారు. ఆ తరువాత తాళాలు వేశారు. మళ్లీ తెరవలేదు. దాదాపు రూ.500 కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ ప్యాలెస్ వినియోగానికి గ్లోబల్ టెండర్లు ఆహ్వానించాలని, ఆసక్తితో ముందుకు వచ్చే సంస్థల ప్రతినిధులకు దానిని చూపించే ఏర్పాట్లు చేయాలని పారిశ్రామికవేత్తలు సూచిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ

- రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు (ఏపీటీడీసీ) అప్పగించారు. ఈ భవనాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులేమీ ఇవ్వలేదు.
- ప్రస్తుతం భవనాలకు తాళాలు వేసి ఉంచారు. కాపలాగా సెక్యూరిటీని పెట్టారు.
- పది నెలలుగా నిర్వహణ లేకపోవడంతో భవనాలు దుమ్ము పట్టేశాయి. కొన్ని ఉపకరణాలు తుప్పు పట్టేశాయి. నీరు పోసేవారు లేక మొక్కలు ఎండిపోతున్నాయి.
- సముద్రాన్ని ఆనుకొని ఉండడంతో ఉప్పు నీటి గాలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.
- సరైన నిర్వహణ లేకపోతే కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన గృహోపకరణాలు పాడైపోయే అవకాశం ఉంది.

వేసవి 'అసెంబ్లీ'కి అనువైన ప్రాంతం

వేసవిలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇక్కడ అనువుగా ఉంటుంది. రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రజా ప్రతినిధులు విశాఖపట్నం చూసినట్టు, సాగర తీరాన సేద తీరినట్టు అవుతుంది. విశాఖలో ప్రభుత్వ అతిథి గృహం సర్క్యూట్ హౌస్ పాతబడి పోయింది. కొత్తది నిర్మించే ప్రతిపాదనలు లేవు. రుషికొండలో కనీసం రెండు భవనాలు అయినా అతిథుల కోసం కేటాయిస్తే బాగుంటుంది.

- జి.సాంబశివరావు, పూర్వ అధ్యక్షుడు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

విశాఖలో ఈడీ దాడులు

- వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ నివాసంలో సోదాలు
- ఆయన స్నేహితుడు జీవీ ఇల్లు, కార్యాలయంలో కూడా..
- మనీ లాండరింగ్ నేపథ్యంలోనే..
- 'హయగ్రీవ' జగదీశ్వరుడు ఫిర్యాదుతో దాడులు జరిగినట్లు ప్రచారం



ఈడీ అధికారులు వచ్చిన వాహనం

విశాఖపట్నం, అనకాపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మాజీ ఎంపీ, వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణ నివాసం, కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం సోదాలు నిర్వహించింది. ఆయనతో పాటు ఆయన స్నేహితుడైన ఆడిటర్, వైసీపీ నేత గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) నివాసం, కార్యాలయంపై కూడా ఏకకాలంలో దాడులు నిర్వహించారు. లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ నివాసం, కార్యాలయంతో పాటు రుషికొండలోని ఆయన కుమారుడి ఇంట్లో మూడు బృందాలు, సీతమ్మధారలోని జీవీ నివాసం, పెదవాల్తేరులోని ఆయన కార్యాలయంలో రెండు బృందాలు ఉదయం ఎనిమిది గంటల నుంచి సోదాలు నిర్వహించాయి. 2006లో రిజిస్టర్ అయిన హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు ఎండాడలో 2008లో రాష్ట్ర ప్రభుత్వం 12.51 ఎకరాలు కేటాయించింది. సంస్థ ప్రమోటర్ అయిన చెరుకూరి జగదీశ్వరుడు ఆ భూమిలో వృద్ధులకు విల్లాలు, వృద్ధాశ్రమం నిర్మిస్తానని ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఆ భూమి డెవలప్‌మెంట్ పేరుతో ఆడిటర్ జీవీ 2020లో అప్పటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను జగదీశ్వరుడికి పరిచయం చేశారు. ఆ సమయంలో డెవలపర్ గద్దె బ్రహ్మాజీతో తాను ఒప్పందం చేసుకున్నట్టు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, తమను బెదిరించి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకుని ప్రభుత్వం కేటాయించిన భూమిని లాక్కొన్నారని, బ్రహ్మాజీకి ఎంవీవీ, జీవీకి మధ్య మనీ లాండరింగ్ కూడా జరిగిందని ఈ ఏడాది జూన్‌లో పీఎం పాలెం పోలీసులకు జగదీశ్వరుడు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జూన్ 22న మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారిద్దరికీ ఈనెల 17న హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ అంశం ఈడీ దృష్టికి చేరడంతో ఈ దాడులు నిర్వహించినట్టు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌లో ఒక సెల్‌ఫోన్ విక్రయ సంస్థకు చెందిన నగదు భారీమొత్తంలో బయటపడిందని, దానిపై ఈడీ విచారణ జరపగా ఆ నగదుతో ఆ సంస్థకు ఆడిటర్‌గా ఉన్న జీవీ, ఎంవీవీ సత్యనారాయణకు లింకులున్నట్టు తేలిందని అంటున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయేవరకు సోదాలు కొనసాగాయి. దీనికి సంబంధించి అధికారికంగా వివరాలు వెల్లడికాలేదు.

భూదందాలకు పాల్పడ్డ వైసీపీ నేతలు జైలుకే: ఎంపీ సీఎం రమేశ్

విశాఖపట్నం కేంద్రంగా గత వైసీపీ పాలకులు విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని, వారంతా జైలుకు వెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. విశాఖలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసం, కార్యాలయంలో ఈడీ సోదాల నేపథ్యంలో శనివారం ఆయన మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. ఇవి ప్రారంభం మాత్రమేనన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని వైసీపీ నేతలు విశాఖపట్నంలో చేసిన అవినీతి, అక్రమాల చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందన్నారు. వైసీపీ నేతల దందాలపై కేంద్రానికి ఫిర్యాదు చేశామన్నారు. రుషికొండపై నిర్మాణం విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి టెండర్లు లేకుండా రూ. 500 కోట్లు దోచుకున్నారని, ఆ వివరాలు కూడా ఈడీ, సీబీఐ వద్ద ఉన్నాయన్నారు. ప్రజల సొత్తు దోచుకున్న వైసీపీ నేతలు స్వచ్ఛందంగా తిరిగి అప్పగించాలన్నారు.

జేసీబీతో ఇల్లు కూల్చేశారు!

- వైసీపీ నేతల దాష్టీకాలపై ఫిర్యాదుల వెల్లువ
- టీడీపీ కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాశ్

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, వారి అనుచరులు చేసిన దౌర్జన్యాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వత్ అర్జీలు స్వీకరించారు. స్థలం విషయంలో కోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా ఉన్నా.. అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అనుచరులు వందమంది తమ ఇంటిపై దాడి చేసి, తమను కొట్టి జేసీబీతో ఇంటిని, కొట్టును ధ్వంసం చేశారని వినుకొండకు చెందిన కామా వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు రాత్రికి రాత్రే దౌర్జన్యంగా తమ పొలంలో వరి పంటను కోసుకుపోయారని కృష్ణాజిల్లా గన్నవరం మండలం గోపవరపుగూడేనికి చెందిన వేమూరి రామారావు, వేమూరి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అప్పట్లోనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తీసుకోలేదని వాపోయారు. 2019 ఎన్నికల్లో తాను టీడీపీ ఏజెంట్‌గా పోలింగ్ బూత్‌లో కూర్చున్నందుకు.. ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి తనపై కక్ష గట్టి, ఇబ్బందులకు గురి చేశారని, పోలీసులతో భయపెట్టారని, బిల్లులు రాకుండా అడ్డుకున్నారని కడప జిల్లా చాపాడు మండలం ఎస్.అనంతపురం గ్రామానికి చెందిన మల్లి కార్జునరెడ్డి వాపోయారు. తన పొలంలో పంటను వైసీపీ నేతలు ధ్వంసం చేశారని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం దివ్యాంగులమైన తమను తాడేపల్లిగూడెం హార్టికల్చర్ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలకు పిలిచి.. తర్వాత ఏ సమాచారం ఇవ్వలేదని, వైసీపీకి అనుకూలమైనవారికి ఉద్యోగాలు ఇచ్చి.. తమకు తీరని అన్యాయం చేసిందని వాపోతూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన దివ్యాంగుడు ఎన్.నరేష్ ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు కూడా అర్జీ ఇచ్చారు. ఇంకా అనేకమంది అర్జీలు సమర్పించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- సీఎంకు ఏపీ బార్‌కౌన్సిల్ వినతి
- సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.10 లక్షలు సాయం



సీఎం చంద్రబాబుకు డీడీ అందజేస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ బృందం నేతలు సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షల డీడీని అందజేశారు. న్యాయవాదుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. హైకోర్టులో బార్ కౌన్సిల్ కార్యకలాపాలకు కేటాయించిన స్థలం సరిపోవడం లేదని, బార్ కౌన్సిల్ కోసం అమరావతి జస్టిస్ సిటీలో 5 ఎకరాలను గుర్తించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం హైకోర్టులో ప్రస్తుతం ఉన్న 37 మంది న్యాయమూర్తుల సంఖ్యను 62కు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ ఎస్.కృష్ణ మోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గంటా రామారావు, సభ్యులు ఉన్నారు.

శ్రీశైలం జలాశయం 4 గేట్లు ఎత్తివేత

శ్రీశైలం, అక్టోబరు 19: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. దీంతో శనివారం 4 గేట్లు 10 అడుగులు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 72,114 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 మొత్తం 1,90,828 వరద వస్తోంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.8824 టీఎంసీలుగా నమోదైంది.



శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న జలాలు

మద్యం షాపు కోసం రూ.కోటి ఆఫర్

- పార్వతీపురం మన్యం జిల్లాలో సిండికేట్ల ప్రయత్నాలు

పార్వతీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీ, వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం వ్యాపారం ప్రారంభించారు. అయితే లాటరీలో దుకాణం పొందలేని వారు తమ ప్రాంతంలో షాపులను దక్కించుకున్న వ్యాపారులకు భారీగా డబ్బులు ఆఫర్ చేస్తున్నారు. ఈ మేరకు మక్కువ మండలంలో సిండికేట్ వ్యాపారులు ఒక మద్యం దుకాణానికి సుమారు రూ.కోటిపైనే గుడ్‌విల్‌గా ఇవ్వడానికి సిద్ధమయ్యారు. లాటరీలో దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తి దానికి ఆశపడి మద్యం షాపును సిండికేట్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా సిండికేట్లు వ్యక్తిగత మద్యం షాపుల వ్యాపారులతో బేరసారాలు చేస్తున్నారు. షాపులకు దక్కించుకునేందుకు రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

అమరావతి మళ్లీ తలెత్తి నిలబడింది

అమరావతి మళ్లీ తలెత్తి నిలబడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతి రాజధాని పనులను ప్రారంభించిన సందర్భంగా శనివారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'విధిరాత ఏంటో ప్రస్ఫుటమైంది. ఐదు సంవత్సరాల ఎనలేని నిర్లక్ష్యం, ఆశల అణిచివేత తర్వాత అమరావతి మళ్లీ ప్రాణం పోసుకొంది. మన ప్రజారాజధాని అమరావతి.. హృదయాలను కలిపి ఒక్కో ఇటుక పేర్చి పునఃనిర్మితమవుతుంది. అమరావతి స్వప్నాన్ని సజీవంగా నిలిపిన రాష్ట్ర ప్రజానీకానికి నా శుభాకాంక్షలు. ప్రత్యేకించి రాజధాని రైతు సోదరులు, సోదరీమణులు తమపై భయంకరమైన అణిచివేతను ప్రయోగించినా తట్టుకొని నిలబడి పోరాడి మన కలలను నిలబెట్టారు. ఈ రోజు మొదలైన పని ఇక ఆగదు. ముందుకు మునుముందుకు సాగుతుంది' అని ఆయన పేర్కొన్నారు. అమరావతిపై వైసీపీ కుతంత్రాలు సాగవని, అమరావతి మళ్లీ ఊపిరి పోసుకోవడం ఖాయమని 2022 సంవత్సరం అక్టోబర్ ఇరవై రెండో తేదీన తాను చేసిన ట్వీట్‌ను చంద్రబాబు దీనికి జత చేశారు.





రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను తిరిగి ప్రారంభిస్తున్న సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన జనం

రెండు నెలల్లో మునిసిపల్ శాఖలన్నీ అమరావతికి

» అక్కడ పనులన్నీ పూర్తికాగానే తరలింపు

» మంత్రి నారాయణ విజ్ఞప్తిపై నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయనున్న కాంట్రాక్టు సంస్థ

విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యాని కంటే నెల ముందుగా అంటే రెండు నెలల్లోనే పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. సీఆర్‌డీఏ కాంప్లెక్స్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మునిసిపల్ మంత్రి నారాయణ విజ్ఞప్తి చేయగా.. కాంట్రాక్టు సంస్థ ఆ మేరకు హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అమరావతిలో సీఆర్‌డీఏ కాంప్లెక్స్ పూర్తి కాగానే.. మునిసిపల్ శాఖలన్నింటినీ అక్కడకు తరలించనున్నారు. మునిసిపల్ పట్టణాభివృద్ధి సంస్థ (ఎంఏయూడీ), కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ), కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తదితర మునిసిపల్ సంబంధిత రాష్ట్ర శాఖలన్నీ సీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లో కొలువు తీరనున్నాయి. సీఆర్‌డీఏ కాంప్లెక్స్ పనులను 2017లో ప్రారంభించి రూ. 61.48 కోట్లు ఖర్చు చేశారు. పెండింగ్ సివిల్ పనులతో పాటు ఆర్కిటెక్చరల్ ఇంటీరియర్ ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పుడు రూ. 160 కోట్ల వ్యయంతో బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు కిందటి నెలలో టెండర్లు పిలిచారు. ఆ వెంటనే రూ.129 కోట్ల వ్యయంతో ఆర్కిటెక్చరల్ వర్క్స్, ఇంటర్నల్ ఫినిషింగ్ వర్క్స్, ఎంఈపీఎఫ్ వర్క్స్, ఐసీటీ వర్క్స్ ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ వర్క్స్‌కు టెండర్లు పిలిచారు. నాలుగు సంస్థలు టెండర్లు వేయగా.. ఎల్ 1గా నిలిచిన కేపీసీ ప్రాజెక్ట్స్‌కు పనులు అప్పగించారు. ఇక రాజధానిలో అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోస్, ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాలు, ప్రభుత్వ టైప్ - 1 , టైప్ - 2 భవనాల పనులకు జనవరిలో టెండర్లు పిలవనున్నారు. గతంలో పిలిచిన టెండర్లన్నింటినీ రద్దు చేశారు. రాజధానిలో రోడ్ల పనులకు సంబంధించి డిసెంబరులో టెండర్లు పిలవనున్నారు.

రాజధానికి పునఃప్రతిష్ఠ

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. తానిచ్చిన పిలుపుతో వారసత్వంగా వచ్చిన భూములను కూడా భవిష్యత్తు తరాల కోసం ఇచ్చిన రైతులకు మరోసారి ధన్యవాదాలు చెబుతున్నానని తెలిపారు. 34,241 ఎకరాలను 29,881 మంది రైతులు రాజధాని నిర్మాణానికి ఇచ్చారని, ఇంత పెద్ద మొత్తంలో ల్యాండ్ పూలింగ్ చేసి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలిచిన ఘనత మనదేనన్నారు. అమరావతి రైతులను గత ప్రభుత్వం అడుగడుగునా అణగదొక్కిందని, న్యాయస్థానం టు దేవస్థానం కార్యక్రమం చేపడితే ఎక్కడా అన్నం కూడా తిననివ్వకపోవడంతో రోడ్డు మీదే వారు భోజనం చేశారన్నారు. నాడు సాక్షాత్తు ప్రధాని అమరావతికి శంకుస్థాపన చేశారని, అన్నీ దేవాలయాల నుంచి పవిత్ర జలాలు, మట్టి తెచ్చి ఇక్కడ ఉంచి పునీతం చేశామన్నారు. ఈ పవిత్రమైన భూమికున్న శక్తే అమరావతిని కాపాడిందన్నారు. రాళ్లు, రప్పలున్న ప్రాంతంలో మూడో నగరంగా సైబరాబాద్‌ను నిర్మించామని, హైదరాబాద్‌ను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దామన్నారు. ఎవరూ ఊహించని రోజుల్లోనే 8 లేన్ల ఔటర్ రింగ్‌రోడ్డును నిర్మించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తే అప్పులు తప్ప ఏమీ కనిపించలేదని సీఎం చంద్రబాబు అన్నారు. రైతులకు కౌలు కూడా పెండింగ్‌లో పెట్టారని, మనం అధికారంలోకి రాగానే రూ. 170 కోట్లు ఇచ్చామని, మరో రూ. 225 కోట్లు త్వరలో ఇస్తామని తెలిపారు. భూమిలేని కూలీలకు అప్పట్లో పెన్షన్ ఇస్తే దానిని వైసీపీ సర్కార్ నిలిపేసిందని, వాళ్లకు తిరిగి పెన్షన్ అందిస్తామన్నారు.

ఒక రాష్ట్రం.. ఒకటే రాజధాని

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రానికి మధ్యలో అమరావతి ఉందని, రాజధాని ప్రాంతానికి ఓవైపు 12, మరోవైపు 12పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయని, మధ్యలో గుంటూరు నియోజకవర్గం ఉందన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అని రాష్ట్రంలో ప్రతి చోటా చెప్పామన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చెప్పానని, అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారం..

రాజధాని నిర్మాణానికి రూ. లక్ష కోట్లు అవుతాయని, తమవద్ద డబ్బు లేదంటూ గత పాలకులు ఐదేళ్లపాటు కాలయాపన చేశారంటూ చంద్రబాబు మండిపడ్డారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ సిటీ అని, ప్రభుత్వ డబ్బు అవసరం లేకుండా అమరావతిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొత్త రాజధానికి అమరావతి పేరు బాగుంటుందని ఆనాడు రామోజీరావు చెబితే, దానినే ఆమోదించామన్నారు. అలాంటి అమరావతిని శ్మశానం, ఎడారి, మునిగిపోతుందంటూ వైసీపీ నేతలు ప్రచారం చేశారన్నారు. గత పాలకులు రోడ్లు కూడా తవ్వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బెంగుళూరులో జగన్ ఇల్లు ఉన్న ప్రాంతం మునిగిపోయిందని.. వేరే వాళ్లు చెడిపోవాలని కోరుకుంటే భగవంతుడు క్షమించడన్నారు. 1,631 రోజుల పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారన్నారు. విధ్వంసం పోయి.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. విధ్వంసం శాశ్వతం కాదు.. మన మంచి పనులే శాశ్వతమన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిలిచిపోయిన పనుల వల్ల రూ. 7 వేల కోట్లు అదనంగా భారం పడుతుందన్నారు. రూ. 52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామన్నారు. కేంద్రం రూ. 15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆలిండియా అధికారులు, న్యాయమూర్తుల కోసం రెసిడెన్షియల్ టవర్స్ పూర్తి చేస్తామన్నారు. అనుకున్న సమయానికి నిర్మాణాలన్నీ పూర్తి చేస్తామన్నారు.

టాప్ 10 విద్యాసంస్థలు వస్తాయి

అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ యూనివర్సిటీలు వచ్చాయని, ఎక్స్ఎల్ఆర్ యూనివర్సిటీ కూడా వస్తుందని చెప్పారు. జాతీయ లా స్కూల్ కూడా ఏర్పాటు కాబోతోందని, దేశంలో టాప్-10 విద్యాసంస్థల బ్రాంచ్‌లు అమరావతికి వస్తాయన్నారు. అమరావతిలో గ్రీన్ ఎనర్జీ మాత్రం వినియోగించేలా చేస్తామన్నారు. సైకిళ్లపై తిరిగే విధంగా సైకిలింగ్ ట్రాక్‌లు, అలాగే వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. 8,603 కి.మీ పరిధిలో సీఆర్‌డీఏ, 217 చ.కిమీల పరిధిలో అమరావతి రాజధాని, 16.9 చ.కిమీ పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుందన్నారు. అమరావతి ప్రాంతంలో 183 కి.మీతో ఓఆర్ఆర్ వస్తుందన్నారు. రాజధానిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తయి ప్రజలు గెలవాలని ఆకాంక్షించారు.

2 వారాల్లో పోలవరం పనులు

తనకు ఎలాంటి స్వార్థం లేదని, దేశంలో ఏపీ నంబర్‌వన్‌గా ఉండాలన్నదే తన కల అని, ఇది ఐదు కోట్ల ఆంధ్రప్రజలు అర్థం చేసుకోవాలని చంద్రబాబు కోరారు. పోలవరం 72 శాతం పూర్తి చేస్తే.. వైసీపీ వాళ్లు డయాఫ్రంవాల్ దెబ్బతీశారన్నారు. మరో రెండు వారాల్లో పోలవరం పనులు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తానన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు 2047 విజన్ డాక్యుమెంట్ తయారుచేస్తున్నామని తెలిపారు. 2000 సంవత్సరానికి ముందు విజన్ 2020 అంటే ఎగతాళి చేసి 420 అన్నారని, కానీ విమర్శించిన వాళ్లే 420లు అయ్యారన్నారు. తన విజన్ ఏంటో 420లకు అర్థం కాలేదన్నారు. ప్రపంచంలోనే తెలుగువారు అగ్రగామిగా ఉండాలన్నదే తన ధ్యేయమన్నారు. ప్రజల ఆదాయాలు పెంచుతామని, ప్రతి ఇంటినుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నారు. ఒకప్పుడు థింక్ గ్లోబల్.. యాక్ట్ లోకల్ అనే వారమని, ఇప్పుడు థింక్ గ్లోబల్.. యాక్ట్ గ్లోబల్‌గా ఉండాలన్నారు. గత ఐదేళ్ల ఏ రాక్షసుడు ఎప్పుడు వస్తాడో తెలియక ప్రజలు భయంతో బతికారని, ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా, ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలు ఇచ్చిన గెలుపుతో రాష్ట్ర పరపతి పెరిగిందన్నారు. కేవలం రాష్ట్రాన్ని పరిరక్షించుకోవాలని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని కూటమిగా తాము ఆలోచించి నిర్ణయం తీసుకున్నామన్నారు. తన రాజకీయ జీవితంలో చూడని విజయాన్ని ప్రజలు 2024లో ఇచ్చారన్నారు. రాష్ట్రం నుంచి భూతం పోయిందని సీఎం పేర్కొన్నారు.

విజయవాడ బైపాస్‌ను పరిశీలించిన సీఎం..

అమరావతి పనుల పునఃప్రారంభం అనంతరం ఉండవల్లి తిరిగి వెళ్తూ సీడ్ యాక్సిస్ రోడ్డు మీదుగా వెళ్లే విజయవాడ బైపాస్ రోడ్డు పనులను మంత్రి నారాయణతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేరుస్తాం



2015 జనవరిలో ల్యాండ్‌పూలింగ్ కింద భూములివ్వడానికి ఒప్పుకున్న రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. చిన్న లిటిగేషన్ లేకుండా ల్యాండ్‌పూలింగ్ చేశామని, రూ.45వేల కోట్లతో టెండర్లు పిలిచి అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. అమరావతి ప్రపంచంలోని టాప్-10 నగరాల్లో ఒకటిగా ఉండాలన్న సీఎం ఆకాంక్ష నెరవేరే విధంగా పనులు చేపడతామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఈ ప్రాంతాన్ని వైసీపీ చిట్టడవిగా మార్చేసిందని, గత మూడేళ్లుగా కౌలు రైతులకు కౌలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. గతంలో రైతులకిస్తున్న పెన్షన్లను వైసీపీ సర్కార్ రద్దు చేసిందని, తిరిగి పునఃప్రారంభించాలని సీఎంను కోరారు.

అమరావతికి నిధులొస్తున్నాయ్!

డిసెంబరులో 10% అడ్వాన్స్ ఇవ్వనున్న వరల్డ్ బ్యాంకు, ఏడీబీ

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల కొరత తీరనుంది. దీనికోసం ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులు 1.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13,600 కోట్లు) అప్పుగా ఇవ్వనున్నట్లు సీఆర్డీఏ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఏడీబీ బోర్డు సమావేశం డిసెంబరు 8న, ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశం జరుగుతుందని, వాటిలో ఈ అప్పు ప్రతిపాదనను ఆమోదిస్తారని చెప్పారు. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయన్నారు. రుణం మొత్తం రూ.13,600 కోట్లను ఐదేళ్ల పాటు పలు విడతల్లో ఇస్తారని, ఈ డిసెంబరులోనే 10 శాతాన్ని అడ్వాన్స్‌గా ఇస్తారని వివరించారు. వచ్చే జనవరి నెలాఖరున మొదటి విడత అప్పు రావొచ్చని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అప్పుపై మారటోరియం వ్యవధి 5 నుంచి 15 ఏళ్ల వరకు ఉండేలా వెసులుబాటు కల్పించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇది వడ్డీ రహిత రుణమని, దీని కాలపరిమితి, మారటోరియం పీరియడ్, ఇతర నిబంధనలపై నవంబరు 8 నాటికి స్పష్టత వస్తుందని వెల్లడించారు. ఈ అప్పును ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో చేర్చితే రాష్ట్ర అవసరాలకు అప్పులు తగ్గుతాయి కాబట్టి దాని పరిధికి బయట కేంద్రం అనుమతిస్తోందని ఆర్థికశాఖ అధికారులు తెలిపారు.

కేంద్రం భరించేది 9.33 శాతమే

అమరావతి నిర్మాణం కోసం ఏడీబీ, వరల్డ్ బ్యాంకు నుంచి వస్తున్న అప్పును తిరిగి చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. అమరావతి ఫేజ్-1 కోసం ప్రతిపాదించిన రూ.15,000 కోట్ల అప్పులో రూ.13,600 కోట్లు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు నుంచి రాగా, మిగిలిన రూ.1,400 కోట్లను కేంద్రం భరిస్తుంది. ఇదేమీ ప్రత్యేకమైన సాయం కాదు. సాధారణంగా ఈఏపీ ప్రాజెక్టులకు కేంద్రం 10శాతం వరకు రాష్ట్రాలకు సాయం చేస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు డాలర్ల రూపంలో అప్పులిస్తాయి. వాటిని తిరిగి డాలర్లలోనే చెల్లించాలి. ప్రస్తుతం ఒక డాలర్ విలువ రూ.84గా ఉంది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ఇవ్వనున్న 1.6 బిలియన్ డాలర్లను తిరిగి చెల్లించే సమయానికి వాటి విలువ భారీగా పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అమరావతికి వచ్చే అప్పు కాలపరిమితి దాదాపు 50 ఏళ్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అంటే రాబోయే 50 ఏళ్లలో డాలర్ విలువకు అనుగుణంగా రాష్ట్ర ఖజానాపై భారం కూడా పెరుగుతుంది. రాష్ట్రానికి గుదిబండలా మారే అంతర్జాతీయ అప్పుల కంటే దేశీయ సంస్థల నుంచి తీసుకోవడం సమంజసమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నాబార్డు, పీఎఫ్‌సీ, ఆర్ఈసీలతో పాటు అనేక సంస్థలు అప్పులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొంటున్నారు.

వైసీపీ వేధింపులకు టీడీపీ కార్యకర్త బలి

» చీరాలలో వినాయకచవితిరోజు ఘర్షణపడిన వైసీపీ మూక

» దీనిపై కేసు పెట్టాడని గ్రామం నుంచి బహిష్కరణ

» ఆయన నడిపే చిల్లర కొట్టుకు ఎవరూ పోకుండా కట్టడి

» మనస్తాపంతో ఉరివేసుకున్న టీడీపీ కార్యకర్త



కోట వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాలలో వైసీపీ వేధింపులకు టీడీపీ కార్యకర్త బలయ్యాడు. ఊరి పెద్దల ముసుగులో వైసీపీ నేతలు.... గ్రామం నుంచి వెలివేయడంతో మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండలం పరిధిలోని కావూరివారిపాలెంలో టీడీపీ కార్యకర్త కోట వెంకటేశ్వరరెడ్డి (బుజ్జిరెడ్డి)కి చిల్లర కొట్టు ఉంది. వినాయకచవితి వేడుకల సమయంలో వైసీపీ కార్యకర్తలు కుంచాల వెంకటేశ్వరరెడ్డి (పొట్టయ్య), కావూరి శ్రీనివాసరెడ్డి (ఎర్రోడు), మంచాల పండు అంకిరెడ్డి (చిన్నా)కి.. వెంకటేశ్వరరెడ్డి (బుజ్జిరెడ్డి)కి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ మూకలు...బుజ్జిరెడ్డిపై దాడి చేసి కొట్టారు. దీనిపై బుజ్జిరెడ్డి ఈపూరుపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొద్దిరోజులు పోలీస్ పికెట్ కూడా నిర్వహించారు. బుజ్జిరెడ్డిపై కక్ష పెంచుకున్న వైసీపీ కార్యకర్తలు.... ఆయన చిల్లర కొట్టుకు ఎవరు వెళ్లినా, ఆ కుటుంబంతో మాట్లాడినా రూ.లక్ష జరిమానా విధిస్తామని ప్రకటించారు. దీంతో బుజ్జిరెడ్డికి గ్రామస్థులందరూ దూరంగా ఉంటూ వచ్చారు. కొట్టు సాగక తీసుకున్న రుణాలకు బ్యాంక్ నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో బుజ్జిరెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈనెల 1న ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌ను కలిసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఆ బాధలో అక్కడే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఇంటి ముందు ఉన్న పందిరిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మావోయిస్టుల దాడిలో 'కడప' జవాన్ మృతి

» మహారాష్ట్రకు చెందిన మరో సైనికుడు కూడా.. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో ఐఈడీ పేలుడు

» మరో ఇద్దరు పోలీసు సిబ్బందికి గాయాలు



కొడవటికంటి రాజేశ్(ఫైల్)

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి కడప జవాన్ సహా ఐటీబీపీ(ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు) దళానికి చెందిన ఇద్దరు మరణించారు. మరో ఇద్దరు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. ఐటీబీపీ, బీఎస్ఎఫ్(సరిహద్దు భద్రతా దళం), డీఆర్‌జీ(జిల్లా రిజర్వు గార్డు) దళాలు దుర్భేద ప్రాంతంలో సంయుక్తంగా మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ నిర్వహించి శనివారం మధ్యాహ్నం నారాయణపూర్‌కు తిరిగి వస్తుండగా కొడ్లియార్ గ్రామం వద్ద ఐఈడీ పేలుడు సంభవించింది. మృతులను ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లె పంచాయతీ, పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేశ్(36), మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన అమర్ పన్వర్(36)గా గుర్తించారు. వీరిద్దరూ ఐటీబీపీలోని 53వ బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన ఇద్దరు నారాయణపూర్ జిల్లా పోలీసు రిజర్వు గార్డ్ దళానికి చెందినవారు. వారికి చికిత్స కొనసాగుతోందని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఈనెల 4న అబూజ్‌మడ్ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ ఆపరేషన్ నిర్వహించి 38 మంది మావోయిస్టులను హతమార్చాయి. ఆ ఘటన జరిగిన రెండు వారాలకే మావోయిస్టులు తాజా ఐఈడీ దాడికి పాల్పడ్డారు.

రెండు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చి..

కొడవటికంటి రాజేశ్ 2007 నుంచి ఐటీబీపీలో జవాన్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు జానయ్య, బాలమ్మ గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసి కుమారుడిని చదివించారు. రాజేశ్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య పాపిరెడ్డిపల్లెలోనే ఉండి పిల్లలను చదివిస్తున్నారు.

సాములోరికి సాయమా?

(మొదటి పేజీ తరువాయి)

ధిక్కరించేంత సాహసం అధికారులకు వచ్చిందా అనేది తెలియదు. కానీ ఆ ఫైలు మళ్లీ పెండింగ్ పెట్టారు. కేవలం భూ కేటాయింపులను రద్దుచేయాలనే ప్రతిపాదించాలట! భూ కేటాయింపులో జరిగిన గోల్‌మాల్, అక్రమాలు, గూడుపుఠాణి, చీకటి పనుల ప్రస్తావన తీసుకు రావద్దంట! అది సీఎం దృష్టికి వెళ్తే ఎలా? అంతే ఫైలు పెండింగ్. పేరు ఇదే. కానీ అంతర్గత లక్ష్యం వేరేలా ఉంది. వేగంగా నిర్ణయం తీసుకోకుండా ఆలస్యం చేయడం ద్వారా సాములోరికి మేలు చేసే ఉద్దేశం ఉన్నట్లు కనిపిస్తోంది. సోమవారం దాకా పెండింగ్ పెట్టి, అదే రోజు సాములోరు కోర్టుకు వెళ్లే అవకాశం కల్పించడమే లక్ష్యంగా తోస్తోంది. దీని కోసం తెరవెనక కీలక అధికారి పెండింగ్ డ్రామా నడుపుతున్నారన్న అనుమానాలు ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వైసీపీ హయాంలో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానంద.... జగన్‌కు ఆత్మగా, రాజగురువుగా ఓ వెలుగు వెలిగారు. అందుకు ఉదాహరణే ఆ పీఠానికి భూ కేటాయింపు. భీమిలీ మండలం కొత్త వలసలో 15 ఎకరాలు అప్పట్లో కేటాయించారు. అక్కడ ఎకరం బహిరంగ మార్కెట్ విలువ 15 కోట్లపైమాటే. రిజిస్ట్రేషన్ విలువ ఎకరాకు 1.89 కోట్లు. కాబట్టి, పీఠానికి ఎకరాకు 1.89 కోట్ల చొప్పున భూమిని కేటాయించవచ్చంటూ నాటి విశాఖ కలెక్టర్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. జగన్‌కు సాములోరు రాజగురువు కదా! సాములోరు కోరినట్లుగా ఎకరా భూమిని లక్ష రూపాయల చొప్పున 15 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీఎల్ఎమ్ఏ)లో తీర్మానించారు. శారదా పీఠానికి ఓ ట్రస్టు ఉంటుంది. కాబట్టి ట్రస్టీ పేరిట ఓ వ్యక్తి శారదాపీఠానికి భీమిలీ మండలం కొత్త వలసలోని సర్వేనెంబర్ 102లో ఉన్న 15 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ లేఖపై ఆఘమేఘాల మీద సర్కారు నిర్ణయాలు తీసుకుంది. కానీ, ఇప్పుడుఆ ఫైలును పరిశీలిస్తే, భూమి కేటాయింపు కోరుతూ వచ్చిన దరఖాస్తులో ట్రస్టీ పేరిట ఉన్న పేరు అసలు ట్రస్టు సభ్యుల జాబితాలో లేదు. అంటే, పీఠానికి ట్రస్టీ సభ్యుడు కాకున్నా, భూమి కేటాయింపును కోరుతూ లేఖ ఇచ్చారు. సర్కారు దాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఆ ట్రస్టీ కోరిక మేరకు భూమి కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం 2021, నవంబరు 29న జీఓ-343 జారీ చేసింది. ఈ జీఓలోని అంశాలకు ఆనాటి మంత్రివర్గ ఆమోదం ఉంది.

అంతా సాములోరి మహిమ

అయితే, ఆ తర్వాత సాములోరి ఆలోచనలు మారాయి. కొత్తవలసలోని సర్వేనెంబర్ 102లోనే మొత్తం భూమి వద్దని, అందులో కొంత తీసుకొని, మిగతా కొంత పక్క సర్వేనెంబర్‌లో తీసుకోవాలనుకున్నారు. అంతే, రెవెన్యూ అధికారులు సాములోరికి జై కొట్టారు. మంత్రివర్గం ఆమోదించిన కేటాయింపుల ఫైలుకు విరుద్ధంగా, తమకు నచ్చిన సర్వే నెంబర్లలోని భూమిని పొందారు. దీనికి మంత్రివర్గ ఆమోదం లేదు. రెవెన్యూశాఖ కూడా ఆమోదం తీసుకోలేదు. సర్వేనెంబర్ 102-2లో 7.60 సెంట్లు, సర్వేనెంబర్ 103లో 7.30 సెంట్ల భూమిని పీఠానికి కేటాయిస్తున్నట్లు ఆనాటి రెవెన్యూశాఖ కార్యదర్శి సవరణ ఉత్తర్వులు 2022, ఫిబ్రవరి 8న (జీఓ-64) జారీ చేశారు. అంటే, జీవో నం. 343లో పేర్కొన్న సర్వేనెంబర్లు మార్చారు. భూమిని మార్చారు. అంటే, కొత్తగా కేటాయింపులు ఉత్తర్వులు ఇచ్చారన్నమాట. దీనికి కూడా మంత్రివర్గ ఆమోదం కావాలి. కానీ, రెవెన్యూశాఖ అధికారి ఈ పనిచేయకుండా సైలెంట్‌గా తానే సర్వాధికారి అన్నట్లుగా ఉత్తర్వులు ఇచ్చారు.

గుట్టురట్టవ్వకూడదనే పెండింగ్...

ఇంతటి అక్రమమైన కేటాయింపును రద్దుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనేక ఫిర్యాదులు అందాయి. ఈ అంశాన్ని సహజవనరుల్లో భాగంగా భూముల అంశంపై విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ ప్రస్తావించారు. ఆ భూ కేటాయింపును రద్దు చేస్తామని కూడా ఆయన చెప్పారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ఫైలు పంపిస్తే దాన్ని ప్రభుత్వంలో కీలక అధికారి రెండున్నర నెలల పాటు తొక్కిపెట్టారు. కారణం ఏమంటే, భూ కేటాయింపు సమయంలో తన వ్యవహారం బయటకొస్తుందన్నది ఒక కారణం. సాములోరి పట్ల తనకున్న ప్రత్యేక స్వామిభక్తి బయటపడుతుందన్నది మరో భయం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ ఆ ఫైలును మరోసారి ప్రభుత్వానికి పంపించింది. సేమ్ సీన్. ఆ ఫైలును ఆ కీలక అధికారి మరోసారి పెండింగ్ పెట్టారు. రెవెన్యూశాఖ పంపించిన ఫైలులో ఉన్న అంశాలను ఆయన మార్చాలని కోరుతున్నారని తెలిసింది. సాములోరికి భూ కేటాయింపులో అప్పటి సీసీఎల్ఏ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీఎల్ఎమ్ఏలో ఏం జరిగిందో ఫైలులో ప్రస్తావించవద్దని, కేవలం కేటాయింపును రద్దుచేస్తున్నట్లు, సాంకేతిక అంశాలనే కొనసాగించాలని ఆయన ఒత్తిడిచేస్తున్నట్లు తెలిసింది. దీనికి రెవెన్యూ శాఖ ససేమిరా అంటోంది. దీంతో ఫైలును ఆ అధికారి పెండింగ్‌లో పెట్టినట్టు సమాచారం.

కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చేందుకా?

భూ కేటాయింపు రద్దు ఫైలుపై వెంటనే నిర్ణయం తీసుకోపోవడం వల్ల సాములోరికి మరో తెరవెనుక మేలు చేస్తున్నట్లుగా ఉందని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి. శారదా పీఠం భూ కేటాయింపులు రద్దుచేయాల్సిందే అని సీఎం పట్టుబడుతున్నట్లుగా మీడియాలో వచ్చింది. కాబట్టి సర్కారు చర్యను అడ్డుకోవాలని సాములోరు కోర్టును ఆశ్రయించడానికి అవకాశం కల్పించడానికే పలు కారణాల పేరుతో ఫైలును ఆమోదించడంలో ఉద్దేశ్యపూర్వక ఆలస్యం చేస్తున్నారని తెలుగుదేశం వర్గాలు అనుమానిస్తున్నాయి. నిజానికి సీఎం ఆదేశాల మేరకు శుక్రవారమే ఉత్తర్వులు వస్తాయని ప్రభుత్వ వర్గాలు అంచనావేశారు.కానీ అది జరగలేదు. శనివారం కూడా ఎలాంటి ఉత్తర్వురాలేదు. ఎందుకంటే ఆ ఫైలు ఆ కీలక అధికారే అట్టిపెట్టుకున్నారు. ఆదివారం సెలవు రోజు...ఉత్తర్వులు ఇవ్వలేరు. ఇక సోమవారమే ఉత్తర్వులు ఇవ్వడానికి అవకాశం. అదే రోజున సాములోరు కోర్టుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని ఓ సీనియర్ టీడీపీ నేత చెప్పారు.

ఉత్తరాంధ్ర నుంచి వైవీ అవుట్

» మళ్లీ విజయసాయికి బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త బాధ్యతల నుంచి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని తప్పించారు. ఉత్తరాంధ్రకు మళ్లీ రాజ్యసభ సభ్యుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి సమన్వయకర్తగా నియమించారు. వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలను శనివారం వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఉమ్మడి అనంతపురం, నెల్లూరు జిల్లాలకు పీవీ మిథున్‌రెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కారుమూరి నాగేశ్వరరావు, ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు, గుంటూరు జిల్లాలకు వైవీ సుబ్బారెడ్డి, ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఉభయగోదావరి జిల్లాలకు బొత్స సత్యనారాయణను నియమించారు. కాగా, చిత్తూరు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డిని జగన్ నియమించారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, బూత్ కమిటీల రాష్ట్ర అధ్యక్షుడిగా కొండమడుగుల సుధాకరరెడ్డిని నియమించారు.

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

» అతిసారకు 11 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం: జగన్



అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్కాముల్లో మునిగిపోయిన కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని 'ఎక్స్' వేదికగా శనివారం విమర్శించారు. విజయనగరం జిల్లాలో అతిసారకు 11 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. విజయనగరం, విశాఖలో మంచి ఆసుపత్రులున్నా స్థానికంగానే వైద్యం అందించడంపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ నిలిచిపోయిందని, మెడికల్ కాలేజీల నిర్మాణాలు ఆగిపోయాయని జగన్ ఆరోపించారు.

లంచం మాటే వినపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల బాధ్యతలను తీసుకున్నానన్నారు. సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా అన్ని శాఖలను ముందుకు తీసుకెళ్లేలా పని చేద్దామన్నారు. శనివారం జనసేన కేంద్ర కార్యాలయంలో పవన్ సమక్షంలో పలువురు నాయకులు పార్టీలో చేరారు. వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, అమలాపురానికి చెందిన కల్వకొలను తాతాజీ, గుంటూరుకు చెందిన చందు సాంబశివరావు, పలువురు గుంటూరు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, జగ్గయ్యపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీలో చేరారు. వీరందరికి పవన్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి. ఆ దిశగా కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా నాయకులు బాధ్యతగా పని చేయాలి. నాయకులు, పార్టీ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న సమస్యలను తీర్చడంపై దృష్టిసారించాలి. జనసేన పార్టీని ఇంత మంది నాయకులు బలంగా నమ్ముతున్నారంటే మనపై ఉన్న నమ్మకమని గుర్తుంచుకోవాలి. దాన్ని నిలబెట్టుకునేలా పని చేద్దాం. అవినీతికి తావు లేకుండా, ప్రజలకు జవాబుదారీతనంతో ప్రభుత్వ పాలన ఉండాలి. నా కార్యాలయానికి ప్రజలకు సంబంధించి ఏ సమస్య తీసుకొచ్చినా దాని పరిష్కారం కోసం పని చేయడానికి సిద్ధంగా ఉంటాను. ఇటీవల పల్లె పండుగ ప్రారంభ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తాగునీటి కలుషిత సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగాన్ని పంపాం. మొదటి విడతలో నందివాడ మండలంలో రూ.91 లక్షలతో ఫిల్టర్ బెడ్లు, ఇతర పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రజలకు అవసరమైన సమస్యలను తీరుస్తూ వారి మన్ననలు పొందేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ప్రతి ఒక్కరూ నిలబెట్టుకునే విధంగా పాలన సాగించాలి" అని పవన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన సామినేని ఉదయభాను మొదటి నుంచి విలువలకు కట్టుబడి రాజకీయం చేశారని ప్రశంసించారు. అలాంటి వ్యక్తి పార్టీలోకి రావడం ఆనందం కలిగించిందన్నారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం ఉందన్నారు.

పారదర్శకంగా బదిలీలు

"పాలనలో రాజీ లేకుండా రూల్‌బుక్ నిబంధనలకు అనుగుణంగా ఇటీవల బదిలీలు చేశాం. అవినీతికి తావు లేకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఇటీవల చేసిన బదిలీల్లో 20 ఏళ్లకు పైబడి ఒకే చోట పాతుకుపోయిన వారికి స్థానచలనం కలిగించాం. అయితే కొన్ని చోట్ల అడిగిన ప్రాంతాలకు వారిని బదిలీ చేయలేకపోయాం. అధికారుల సచ్ఛీలత, వారి పనితనం, నిజాయితీలను పరిగణనలోకి తీసుకొని తగిన బాధ్యతలను అప్పగిస్తాం. ఇటీవల జరిగిన బదిలీలు ఎప్పుడూ లేని విధంగా రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా జరిగాయని అధికారులు చెప్పడం ఆనందంగా ఉంది" అని పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, సంకూరి శ్రీనివాసరావు, ఇర్రి ధనలక్ష్మి, అయిశెట్టి కనకదుర్గ పార్టీలో చేరారు.




సస్పెండైన సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ పి.అప్పారావు

పేకాట సొమ్ము నొక్కేసిన
సీఐ, ఎస్ఐపై వేటు

రాజమహేంద్రవరం, తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పేకాట సొమ్ము నొక్కేసిన ఘటనలో సీఐ, ఎస్ఐ సహా నలుగురు పోలీసు సిబ్బందిపై వేటు పడింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలోపి ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో గత నెల 8న పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో పెరవలి ఎస్ఐ సిబ్బందితో వెళ్లి సుమారు 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఏడుగురిపై మాత్రమే కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. జూదరుల నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు రూ.8లక్షలను పోలీసు బృందం నిడదవోలు సీఐ వద్దకు తీసుకెళ్లింది. అక్కడ మంతనాల తర్వాత రూ.55,500 మాత్రమే స్వాధీనం చేసుకున్నట్టు నమోదు చేశారు. నొక్కేసిన సొమ్మును వాటాలు వేసుకోవడంలో తేడాలు రావడంతో విషయం ఎస్పీ నరసింహ కిషోర్ దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో దర్యాప్తు చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. జూదరుల నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్మును భారీగా జేబుల్లో వేసుకున్నారని ప్రాథమికంగా రుజువు కావడంతో నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావును ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సస్పెండ్ చేశారు.


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాకాల ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదులో అలసత్వంతోపాటు నిందితుడి పేరు తారుమారు చేసిన పాకాల ఎస్ఐ మహేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కం రైటర్ మొగిలీశ్వర రెడ్డిలపై వేటు పడింది. బాలశివరాం అనే వ్యక్తి ఈ నెల 6న ద్విచక్ర వాహనంపై చిత్తూరుజిల్లా కల్లూరుకు వెళుతుండగా పాకాల వద్ద కారు ఢీకొంది. పాకాల పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేసి అతణ్ణి తిరుపతి ఆస్పత్రిలో చేరారు. అయితే, కేసు దర్యాప్తులో తీవ్ర జాప్యం చేస్తున్నారని, నిందితుని పేరూ తప్పుగా నమోదుచేశారని బాధితుడు ఎస్పీని కలసి ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు.

పోలవరానికి నాలుగు అడ్డంకులు

- వాటిని అధిగమించేలా నిర్మాణ ప్రణాళికలు అమలు చేయాలి
- అప్పుడే సకాలంలో పనులు పూర్తి చేయడం సాధ్యపడుతుంది
- పీవోఈ, సీడబ్ల్యూసీ నివేదికలను పరిగణనలోకి తీసుకోండి
- రాష్ట్రానికి కేంద్ర జలశక్తి శాఖ ఆదేశం
- రేపు నిర్మాణసంస్థలతో నిమ్మల సమీక్ష



అమరావతి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్‌లో కీలక కట్టడాలైన డయాఫ్రమ్‌వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణంపై ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్(పీవోఈ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చేసిన అధ్యయన నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. పోలవరం నిర్మాణంలో నాలుగు అంశాలు ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయని సీడబ్ల్యూసీ, పీవోఈ ఉమ్మడిగా వెల్లడించాయి. వీటిని అధిగమించేలా నిర్మాణ ప్రణాళికలను అమలు చేస్తే సకాలంలో పనులు పూర్తి చేయవచ్చని రాష్ట్రానికి కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల స్పష్టం చేసింది.

- **కాఫర్‌డ్యామ్ బట్రెస్ లెంగ్త్:** ప్రస్తుతం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు జలాలు ఎగజిమ్మడంపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. సీపేజీని అరికట్టేందుకు సాంకేతిక నైపుణ్యాలను పునఃసమీక్ష చేయాల్సి ఉంది. నివారణ చర్యలు చేపట్టడం కోసం మట్టి, రాళ్లతో కూడిన ప్రత్యేక డిజైన్లను రూపొందించాల్సి ఉంది.
- **వైబ్రో కాలమ్స్‌తో గ్రౌండ్ క్లియరెన్స్:** రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య నిర్మించనున్న డయాఫ్రమ్‌వాల్ ప్రాంతంలో గ్రౌండ్ క్లియరెన్స్ కోసం వైబ్రో కాలమ్స్ ఉపయోగించి బురద నియంత్రణ చర్యలు చేపట్టాలి.
- **డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రణాళిక:** డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని పునఃపరిశీలన చేయాలి. గతంలో నిర్మించిన దానికి, కొత్తగా నిర్మిస్తున్న దానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా విశ్లేషించుకోవాలి. దీని నిర్మాణం ఒక క్రమ విధానంలో.. ఒకదాని వెంట ఒకటిగా నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. దీనికిగాను పీవోఈ, సీడబ్ల్యూసీ సూచనలను, విశ్లేషణలు, అధ్యయన నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలి.
- **కాఫర్ డ్యామ్‌ల మధ్య నీటి నిల్వ:** డయాఫ్రమ్‌వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ల నిర్మాణ సమయంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. కాఫర్ డ్యామ్‌ల నుంచి ఎగదన్నుకొస్తున్న జలాలను నిరంతరం పంపింగ్ చేస్తూ బయటకు పంపేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

రేపు మంత్రి నిమ్మల సమీక్ష

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు వచ్చేనెల నుంచి ప్రారంభించడంపై సోమవారం జల వనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌తో కలసి మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షిస్తారు. నిర్మాణ సంస్థలు మేఘా, బావర్ ప్రతినిధులతో సహా పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి తదితరులు పాల్గొంటారు. సీడబ్ల్యూసీ, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని, వచ్చేనెల 5నుంచి 9 వరకూ ప్రాజెక్టు ప్రాంతంలో వర్క్‌షాప్ నిర్వహించాలని మంత్రి స్పష్టం చేయనున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబుకు నివేదిస్తారు.

ఆలయాలను హిందూ సంఘాలకు అప్పగించాలి

- జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం
- వీహెచ్‌పీ కేంద్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర జైన్

విజయవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను హిందూ సంఘాలకు అప్పగించాలని విశ్వ హిందూ పరిషత్ కేంద్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సురేంద్ర జైన్ డిమాండ్ చేశారు. దీనికి విజయవాడ నుంచి అడుగులు వేస్తామని అన్నారు. ఆలయాలను హిందూ సంఘాలకు అప్పగించాలన్న డిమాండ్‌తో జనవరి 5వ తేదీన విజయవాడలో హైందవ శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ వివాదం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని సురేంద్ర జైన్ అన్నారు. దేవాలయాల ఆదాయాన్ని ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. సనాతన ధర్మం వర్ధిల్లాలంటే హిందూ సంఘాలే దేవాలయాలను నిర్వహించాలన్నారు. హిందూయేతర వ్యక్తులు ప్రభుత్వం ఆధీనంలోని ఆలయాలను నిర్వహిస్తున్నారని, ఈ జాబితాల్లో టీటీడీ కూడా ఉందన్నారు. టీటీడీ నిర్వాహణకు స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని సురేంద్ర జైన్ డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామాలయాన్ని ఇలాంటి కమిటీనే నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, కార్యదర్శి టీఎస్ రవికుమార్, వీహెచ్‌పీ సెంట్రల్ కార్యదర్శి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, సెంట్రల్ కమిటీ సభ్యులు వై.రాఘవులు పాల్గొన్నారు

రాష్ట్రాభివృద్ధే డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యం

- 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లంకా దినకర్


20 సూత్రాల కార్యక్రమం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లంకా దినకర్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

అమరావతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కార్ కృషి చేస్తుందని 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేంద్ర నిధులను దారి మళ్లించిందని, దీని వలన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు రాష్ట్రంలో సక్రమంగా అమలు కాలేదని అన్నారు. లంకా దినకర్ శనివారం అమరావతి సచివాలయంలో 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వికసిత భారత్-2047'లో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపరిచే లక్ష్యంలో రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. 20 సూత్రాలను అందరికీ తెలిసేలా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఉంచుతామన్నారు. జల్‌జీవన్ మిషన్ అమలుకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.